ప్రకటనల కోసం సంప్రదించండి
98483 28698

తెలంగాణ స్వరాష్ట్ర సమరయోధ పత్రిక
Estd : 2002
RNI NO.TELTEL / 2013 /50370

# జనంసాక్షి

www.janamsakshi.org
శుక్రవారం 21.11.2025 | సంపుటి :12 సంచిక : 121 | పేజీలు :12 వెల : రూ. 4/-
హైదరాబాద్ | Simultaneously Published from Hyderabad & Karimnagar | ఎడిటర్ : ఎం.ఎం. రహమాన్

## నిఖత్ జరీన్‌కు స్వర్ణం



- వరల్డ్ బాక్సింగ్ కప్‌లో గోల్డ్ మెడల్ కైవసం
- ఫైనల్లో చైనీస్ తైపీకి చెందిన జువాన్ యి గువోపై గెలుపు

భారత బాక్సింగ్ స్టార్, తెలంగాణ అమ్మాయి నిఖత్ జరీన్ వరల్డ్ బాక్సింగ్ కప్‌లో స్వర్ణ పతకం కైవసం చేసుకుంది. గురువారం జరిగిన ఫైనల్లో చైనీస్ తైపీకి చెందిన జువాన్ యి గువోపై 5-0తో గెలుపొందింది.

2 లో..




ఫార్ములా ఈ కారు రేసు కేసులో..

## కేటీఆర్ ప్రాసిక్యూషన్‌కు గవర్నర్ అనుమతి



### కేసులో రూ.54.88 కోట్ల నిధుల దుర్వినియోగంపై దర్యాప్తు కొనసాగించేందుకు గ్రీన్‌సిగ్నల్



హైదరాబాద్(జనంసాక్షి):మాజీ మంత్రి, బీఆర్‌ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ కు బిగ్ షాక్ తగిలింది. ఈ ఫార్ములా -కారు రేసు కేసుకు సంబంధించి ఆయనపై విచారణ చేపట్టేందుకు గవర్నర్ అధికారికంగా అనుమతి మంజూరు చేశారు. ఈ కేసులో నిధుల దుర్వినియోగంపై విచారణ కొనసాగించేందుకు గవర్నర్ గ్రీన్ సిగ్నల్ ఇచ్చారు. గవర్నర్ అనుమతితో ఏసీబీ త్వరలోనే కేటీఆర్‌పై చార్జ్‌షీట్ దాఖలు చేయనుందని సమాచారం. ప్రభుత్వం ఈ విషయంలో లేఖ రాయడంతో ఫార్ములా ఈ-కార్ రేసింగ్ కేసులో మాజీ మంత్రి కేటీఆర్‌ను ఏసీబీ విచా రించేందుకు గవర్నర్ జిష్ణుదేవ్ వర్మ అనుమతిం చారు. ఈ కేసులో ఇప్పటికే పలుమార్లు కేటీఆర్ ఏసీబీ విచారణకు హాజరయ్యారు. ఫార్ములా ఈ-కార్ రేసింగ్‌లో రూ.54.88 కోట్ల నిధుల దుర్వినియోగం జరిగినట్లు ఆరోపణలున్నాయి.

మిగతా 2లో..

## ఇంటలీజెన్స్ సిటీగా హైదరాబాద్

### హైదరాబాద్ పెట్టుబడులకు వేదికగా మారింది : సీఎం రేవంత్‌రెడ్డి

తెలంగాణ నార్త్ ఈస్ట్ టెక్నో కల్చరల్ ఫెస్టివల్ ప్రారంభించిన గరవ్నర్ జిష్ణుదేవ్ శర్మ

హైదరాబాద్(జనంసాక్షి):పెట్టుబడులకు హైదరాబాద్ వేదికగా మారిందని, తాము పక్క రాష్ట్రాలతో కాకుండా దుబాయ్, సింగపూర్ లాంటి దేశాలతో పోటీ పడతామని సీఎం రేవంత్ రెడ్డి అన్నారు. హైదరాబాద్ వేదికగా 6 రోజుల పాటు రెండు విడతలుగా జరిగే తెలంగాణ నార్త్ ఈస్ట్ టెక్నో కల్చరల్ ఫెస్టివల్‌ను గవర్నర్ జిష్ణు దేవ్ వర్మ ప్రారంభించారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డితో పాటు మంత్రులు సీతక్క, పొన్నం ప్రభాకర్, పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి, జూపల్లి కృష్ణారావ్, సీఎస్ రామకృష్ణారావు, డీజీపీ శివధర్‌రెడ్డి హాజరయ్యారు. త్రిపుర గవర్నర్ ఇంద్రసేనా రెడ్డి గౌరవ అతిథిగా హాజరయ్యారు.

మిగతా 2లో..




### తెలంగాణ తరహాలో దేశవ్యాప్తంగా సన్నబియ్యం పంపిణీ చేయండి

కేంద్రమంత్రికి సీఎం రేవంత్ సూచన

పరిశీలిస్తామన్న మంత్రి ప్రహ్లాద్ జోషి

2 లో..

### ప్రకృతి విపత్తుల నియంత్రణకు ఏఐ టెక్నాలజీ వినియోగం

సీఎం రేవంత్‌రెడ్డితో అనలాగ్ ఏఐ సీఈవో భేటీ



## గవర్నర్,రాష్ట్రపతులకు గడువు విధించలేం

### పెండింగ్ బిల్లుల ఆమోదానికి సంబంధించిన అంశంలో వారికి నిర్దిష్ట కాలపరిమితి విధించటం తగదు

- బిల్లును నిరవధికంగా నిలిపివేసే అధికారం గవర్నర్‌కు కూడా లేదు
- సుప్రీంకోర్టు ధర్మాసనం కీలక తీర్పు

**సుప్రీంకోర్టు ప్రకారం, ఒక బిల్లు గవర్నర్ ఎదుటకు వచ్చినప్పుడు ఆయనకు 3 ఆప్షన్లు ఉంటాయి**

1. బిల్లుకు సమ్మతి తెలపడం
2. కారణం చెప్పి బిల్లును రిజర్వ్‌లో పెట్టడం లేదా రాష్ట్రపతికి పంపడం
3. బిల్లును తిరస్కరించి అసెంబ్లీకి తిరిగి పంపడం



న్యూఢిల్లీ(జనంసాక్షి): గవర్నర్, రాష్ట్రపతి అధి కారాలపై భారత అత్యున్నత న్యాయస్థానం సుప్రీం కోర్టు గురువారం కీలక తీర్పు వెలువరిం చింది. పెండింగ్ బిల్లుల ఆమోదానికి సంబంధించిన అంశంలో రాష్ట్రపతి, గవర్నర్లకు గడువును విధించటం తగదని స్పష్టం చేసింది. కారణం చెప్పకుండా గవర్నర్‌లు బిల్లులను వెనక్కి పంపలేరని తెలిపింది. బిల్లును నిరవధికంగా నిలిపివేసే అధికారం గవర్నర్‌కు లేదని కూడా తేల్చి చెప్పింది. గవర్నర్ బిల్లును రాష్ట్రప తికి పంపితేనే రాష్ట్రపతి చర్యలు తీసుకోగలరని చెప్పింది. ఆర్టికల్ 200 ప్రకారం గవర్నర్‌కు విచక్షణాధికా రం ఉందని వెల్లడించింది. తన ముందుకు వచ్చిన బిల్లులను గవర్నర్ రాష్ట్రపతికి పంపడం, అభిప్రాయాలతో తిరిగి పంపడం, బిల్లును పరిశీలించి సూచనలు ఇవ్వడం వంటివి మాత్రమే చేస్తా రని తెలిపింది. రాష్ట్ర పరిపాల నలో తుది అధికారం ఎన్నుకో బడిన మంత్రివర్గానిదేనని స్పష్టం చేసింది. ఒక రాష్ట్రంలో రెండు ఎగ్జిక్యూటివ్ పవర్స్ ఉండవని, ప్రభుత్వం ఒక్కటే ప్రధాన నిర్ణయాధికారి అని తేల్చి చెప్పింది. రాష్ట్రాల శాసనసభలు ఆమోదించి పంపిన బిల్లులకు

మిగతా 2లో..



## నేత కార్మికుల రుణమాఫీ నిధుల విడుదల

హైదనాబాద్(జనంసాక్షి): నేత కార్మికుల రుణమాఫీ నిధులు విడుదల చేసింది తెలంగాణ ప్రభుత్వం. నేత కార్మికుల కోసం రూ. 33 కోట్ల నిధులను తెలంగాణ ప్రభుత్వం గురువారంవిడుదల చేసింది. ఈ మేరకు నిధులు విడుదల చేశారు ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి. గత సెప్టెంబర్ 27వ తేదీన కొండా లక్ష్మణ్ బాపూజీ జయంతి సందర్భంగా నేత కార్మికుల రుణమాఫీ చేస్తానని ముఖ్యమంత్రి రేవంత్ హామీ ఇచ్చారు. ఇచ్చిన మాట ప్రకారం తాజాగా నేత కార్మికులకు నిధులు విడుదల చేశారు. నేత కార్మికుల నిధులు విడుదల చేసిన ముఖ్యమంత్రికి రేవంత్‌కు మంత్రి తుమ్మల నాగేశ్వర్‌రావు ధన్యవాదాలు తెలియ జేశారు.

## ఇది కక్ష సాధింపు చర్యే

బీఆర్‌ఎస్



హైదరాబాద్(జనంసాక్షి): హైదరాబాద్ బ్రాండ్ ఇమేజీని పెంచిన కేటీఆర్‌పై అక్రమ కేసులు బనాయించి ఇబ్బంది పెట్టడమే రేవంత్ రెడ్డి లక్ష్యంగా పెట్టుకున్నాడని బీఆర్‌ఎస్ ఎమ్మెల్యే హరీశ్ రావు విమర్శించారు. ప్రభుత్వ వైఫల్యాలను ఎప్పటికప్పుడు ఎండగడుతున్న కేటీఆర్‌పై అక్రమ కేసులు బనాయించి రాక్షసానందం పొందటం అప్రజాస్వామిక మన్నారు. కేటీఆర్‌పై రాజకీయ కక్ష సాధింపు చర్యలకు ఇది పరాకాష్ఠ అని ఆయన విమర్శించారు. ఈ ప్రభుత్వం ప్రశ్నించే వారి గొంతులు నొక్కే

మిగతా 2లో..

## ఇప్పటికైనా అరెస్ట్ చేయండి

భాజపా



హైదరాబాద్(జనంసాక్షి): భారత రాష్ట్ర సమితి కార్య నిర్వాహక అధ్యక్షుడు కేటీఆర్ ప్రాసిక్యూషన్‌కు తెలంగాణ గవర్నర్ అనుమతించిన నేపథ్యంలో ఇప్పుడు కాంగ్రెస్ ఏం చెబుతుందని కేంద్రమంత్రి బండి సంజయ్ ప్రశ్నించారు. ఫార్ములా ఈ-కార్ రేస్ కేసులో ఏసీబీ ప్రాసిక్యూషన్‌కు గవర్నర్ జిష్ణుదేవ్ వర్మ అనుమతించిన విషయం తెలిసిందే. ఈ నేపథ్యంలో బండి సంజయ్ స్పందించారు. "భాజపా, భారత రాష్ట్ర సమితి ఒకటే అని విమర్శించిన సీఎం రేవంత్‌రెడ్డి ఇప్పుడేం సమాధానం

మిగతా 2లో..

## బండి సంజయ్, కేటీఆర్‌కు హైకోర్టులో ఊరట

హైదరాబాద్(జనంసాక్షి): కేంద్రమంత్రి బండి సంజయ్, మాజీ మంత్రి కేటీఆర్‌కు హైకోర్టులో ఊరట లభించింది. వారిపై నమోదైన కేసులను ఉన్నత న్యాయస్థానం కొట్టివేసింది. 2023లో పదో తరగతి ప్రశ్నపత్రం లీకేజీ వ్యవహారం నేపథ్యంలో బండి సంజయ్‌పై కమలాపూర్ పోలీస్ స్టేషన్‌లో కేసు నమోదైంది. రాజకీయ కక్షల కారణంగానే కేసు నమోదు చేశారని బండి సంజయ్ తరపు న్యాయవాది కోర్టు దృష్టికి తెచ్చారు.

మిగతా 2లో..

## కీలక ఖనిజ రంగంలో తెలంగాణ చొరవకు నీతి ఆయోగ్ గుర్తింపు

### సింగరేణి సంస్థకు నీతి ఆయోగ్ జాతీయ కమిటీలో చోటు: డిప్యూటీ సీఎం భట్టి

2300 మెగావాట్ల థర్మల్, సోలార్ విద్యుత్ ప్లాంట్ల ఏర్పాటుకు రాజస్థాన్ క్యాబినెట్ ఆమోదంపై హర్షం



హైదరాబాద్(జనంసాక్షి):తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం కీలక ఖనిజ రంగానికి అధిక ప్రాధాన్యతను ఇస్తూ కార్యాచరణ ప్రారంభించి మిగిలిన అన్ని రాష్ట్రాల కన్నా ముందున్న నేపథ్యంలో దేశవ్యాప్త గుర్తింపును పొందుతుందని, ఇటీవల నీతి ఆయోగ్ సంస్థ ఏర్పాటు చేసిన జాతీయ స్థాయి కీలక ఖనిజ కమిటీలో రాష్ట్ర ప్రభుత్వ సంస్థ అయిన సింగరేణికి ప్రముఖ స్థానం కల్పించడం దీనికి నిదర్శనమని రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి శ్రీ భట్టి విక్రమార్కమల్లు పేర్కొన్నారు. ఈనెల 19వ తేదీన నీతి ఆయోగ్ ప్రకటించిన జాతీయ స్థాయి కీలక ఖనిజాల గుర్తింపు, అన్వేషణ కమిటీలో సింగరేణి సంస్థ కు ప్రాధాన్యతనిస్తూ ఆ సంస్థ సీఎండీని సభ్యునిగా పేర్కొంటూ ఆఫీస్ మెమొరాండం విడుదల చేసిన నేపథ్యంలో శ్రీ భట్టి విక్రమార్కమల్లు గురువారం ఈ ప్రకటన చేశారు. దేశ అవసరాలకు కీలకమైన కీలక ఖనిజాల అన్వేషణను తెలంగాణ ప్రభుత్వం ప్రాధాన్య అంశంగా పరిగణిస్తూ ప్రభుత్వ సంస్థలను ప్రోత్సహిస్తూ ముందుకెళ్తున్న విషయాన్ని ఈ సందర్భంగా ఆయన గుర్తుచేశారు. ఇప్పటికే ఆస్ట్రేలియా, రష్యా, ఘనా వంటి దేశాలతో వ్యాపార విస్తరణ అవకాశాలపై చర్చలు జరుపుతున్నామని, కీలక ఖనిజరంగంలో గల అవకాశాలను అధ్యయనం చేయటానికి ఇప్పటికే ఏజెన్సీలను నియమిం చుకున్నామని తెలిపారు. ఇటీవల కేంద్రం నిర్వహించిన కీలక ఖనిజాల అన్వేషణ వేలంపా టలో సింగరేణి సంస్థ పాల్గొని బంగారం, రాగి ఖనిజాల అన్వేషణకు లైసెన్స్ కూడా సాధించింద న్నారు. సింగరేణి ప్రాంతంలోని గుట్టల్లో, ఓపెన్ కాస్ట్ గనుల మట్టిలో, సింగరేణి థర్మల్ విద్యుత్ కేంద్రం నుండి వెలువడే ఫ్లై యాష్ బాటమ్ యాష్ లో ఉన్న కీలక ఖనిజాలు, రేర్ ఎర్త్ ఎలిమెంట్స్ ను గుర్తించడానికి, వాటిని వాణిజ్యపరంగా

మిగతా 2లో..

### స్కాలర్‌షిప్ బకాయిలు వెంటనే విడుదల చేయండి

ఆర్థిక శాఖ అధికారులకు డిప్యూటీ సీఎం ఆదేశం

2 లో..




## కొలువుదీరిన నితీష్ సర్కారు

- సీఎంగా నితీశ్ ప్రమాణం
- 27మంది మంత్రులు కూడా..
- ప్రమాణం చేయించిన గవర్నర్
- హాజరైన మోడీ, అమిత్ షా, చంద్రబాబు

పాట్నా(జనంసాక్షి): బిహార్ సీఎంగా జేడీయూ అధినేత నితీశ్ కుమార్ గురువారం ప్రమాణస్వీకారం చేశారు. సిఎంగా ఆయన ప్రమాణస్వీకారం చేయడం ఇది పదోసారి. పట్నాలోని గాంధీ మైదానంలో నితీశ్‌తో పాటు 27 మంది మంత్రులు ప్రమాణస్వీకారం చేయగా.. సామ్రాట్ చౌదరీ, విజయ్ కుమార్ సిన్హాలకు డిప్యూటీ సీఎం పదవులు దక్కాయి. గవర్నర్ అరీఫ్ మహ్మద్ ఖాన్ సిఎం, మంత్రులతో ప్రమాణం చేయించారు. ఈ కార్యక్రమానికి ప్రధాని నరేంద్ర మోదీ, అమిత్ షా, ఏపీ సీఎం చంద్రబాబు నాయుడు తదితరులు హాజరయ్యారు. బిహార్ అసెంబ్లీ ఎన్నికల్లో ఎన్డీయే కూటమి అదరగొట్టింది. మొత్తం 243 అసెంబ్లీ సీట్లకు నితీశ్ కుమార్ నేతృత్వంలో

మిగతా 2లో..

## తెలంగాణలో పంచాయతీ ఎన్నికల రిజర్వేషన్లపై ప్రభుత్వానికి నివేదిక

### సమర్పించిన డెడికేటెడ్ కమిషన్




హైదరాబాద్(జనంసాక్షి):పంచాయతీ ఎన్నికల రిజర్వేషన్లపై డెడికేటెడ్ కమిషన్ రాష్ట్ర ప్రభుత్వానికి నివేదిక సమర్పించింది. పంచాయతీలు, వార్డుల వారీగా ఎస్సీ, ఎస్టీ, బీసీ రిజర్వేషన్లు 50 శాతం మించకుండా సిఫారసు చేసింది. డెడికేటెడ్ కమిషన్ ఆధారంగా రాష్ట్ర ప్రభుత్వం రిజర్వేషన్లు ఖరారు చేయనుంది. ఈనెల 24న హైకోర్టు విచారణకు ముందే రాష్ట్ర ప్రభుత్వం ఈ ప్రక్రియను పూర్తి చేయనుంది. ఈనెల 24 లేదా 25న షెడ్యూల్ ప్రకటించేందుకు రాష్ట్ర ఎన్నికల సంఘం సిద్ధమైంది. 12,733 పంచాయతీ, 1,12,288 వార్డుల్లో డిసెంబరు 16 వరకు మూడు విడతల్లో పంచాయతీ ఎన్నికలు పూర్తి చేసేలా కసరత్తు చేస్తోంది.

భార్య, పిల్లల హత్య కేసులో..

### నిందితుడికి ఉరిశిక్ష

సంచలన తీర్పు వెలువరించిన వికారాబాద్ జిల్లా కోర్టు

11 లో..

ఢిల్లీ ఎర్రకోట పేలుళ్ల ఘటన..

### మరో నలుగురిని అరెస్ట్ చేసిన ఎన్ఐఏ

2 లో



## త్వరలో భారత్‌కు అధునాతన జావెలిన్ క్షిపణి వ్యవస్థ

### అమెరికాతో కుదిరిన 93 మిలియన్ డాలర్ల ఆయుధ ఒప్పందం

వాషింగ్టన్(జనంసాక్షి): భారత్-అమెరికాల మధ్య కీలకమైన రక్షణ ఒప్పందం కుదిరింది. దీంతో అధునాతన జావెలిన్ క్షిపణి వ్యవస్థ మన దేశానికి అందనుంది. రష్యాతో పోరులో ఉక్రెయిన్‌కు వరంలా వచ్చిన ఈ ఆయుధానికి ప్రపంచవ్యాప్తంగా విపరీతమైన ఆదరణ ఉంది. భుజం మీద నుంచి గురిపెట్టి ప్రయోగించే ఈ మిసైల్.. కొన్ని వందల సంఖ్యలో రష్యన్ ట్యాంకులను పేల్చేసింది.

మిగతా 9లో..






## దానం,కడియంలకు మరోసారి నోటీసులు

### పోచారం, అరికెపూడిలను విచారించిన స్పీకర్

హైదరాబాద్(జనంసాక్షి): సుప్రీం మరో నాలుగు వారాల గడువు ఇవ్వడంతో పార్టీ ఫిరాయింపుల ఆరోపణలు ఎదుర్కొంటున్న 10 మంది ఎమ్మెల్యేలకు తెలంగాణ అసెంబ్లీ స్పీకర్ గడ్డం ప్రసాద్ నోటీసులు జారీ చేశారు. గురువారం పోచారం శ్రీనివాసరెడ్డి, అరికెపూడి గాంధీలను విచారించారు. పదిమందిలో ఇద్దరు ఎమ్మెల్యేలు మాత్రం ఇప్పటి వరకు అఫిడవిట్‌లు దాఖలు చేయని పరిస్థితి. ఎమ్మెల్యేలు దానం నాగేందర్, కడియం శ్రీహరి.. స్పీకర్ నోటీసులకు స్పందించని విషయం తెలిసిందే. దీంతో వారిరువురికి స్పీకర్ మరోసారి నోటీసులు

మిగతా 2లో..

# గవర్నర్,రాష్ట్రపతులకు గడువు విధించలేం

ఆమోదం తెలిపే విషయంలో న్యాయస్థానం రాష్ట్రపతి, గవర్నర్లకు గడువు విధించటంపై ఆర్టికల్ 143 కింద రాష్ట్రపతి ద్రౌపదీ ముర్మ పంపిన ప్రెసిడెన్షియల్ రిఫరెన్స్‌పై స్పందిస్తూ సుప్రీంకోర్టు ఈ తీర్పును వెలువరించింది. రాష్టర శాసనసభలు ఆమోదించి పంపించిన బిల్లులకు సమ్మతి తెలిపే అంశంలో సుప్రీంకోర్టు గురువారం కీలక తీర్పు వెలువరించింది. ఈ విషయంలో రాష్ట్రపతి, గవర్నర్లకు న్యాయస్థానం గడువు విధించడంపై దేశ ప్రథమ పౌరురాలు ద్రౌపదీ ముర్మ సంధించిన ప్రశ్నలపై అత్యున్నత న్యాయస్థానం సమాధానమిచ్చింది. పెండింగ్ బిల్లుల ఆమోదం కోసం రాష్ట్రపతి, గవర్నర్లకు గడువును విధించడం తగదని సీజేఐ జస్టిస్ బి.ఆర్.గవాయ్ నేతృత్వంలోని రాజ్యాంగ ధర్మాసనం స్పష్టంచేసింది. అయితే, కారణం చెప్పకుండా గవర్నర్లు బిల్లులను వెనక్కి పంపలేరని వెల్లడించింది. ఈ మేరకు దీనిపై గతంలో ద్విసభ్య ధర్మాసనం ఇచ్చిన తీర్పును సీజేఐ ధర్మాసనం పక్కనబెట్టింది. గవర్నర్‌కు రాజ్యాంగపరంగా మూడు ఆప్షన్లు ఉంటాయి. బిల్లులకు సమ్మతి తెలియజేయడం, కారణం చెప్పి బిల్లును రిజర్వ్‌లో పెట్టడం లేదా రాష్ట్రపతికి పంపడం, బిల్లును తిరస్కరించి అసెంబ్లీకి పంపడం. ఈ మూడు ఆప్షన్లు ఎంచుకోవడంలో గవర్నర్ విచక్షణాధికారాన్ని ఉపయోగిస్తారు. ఇందుకు న్యాయస్థానాలు గడువు విధించడం సబబు కాదని అభిప్రాయపడ్డారు. గవర్నర్ల విధుల నిర్వహణ వ్యవహారాల్లో కోర్టులు జోక్యం చేసుకోవు. కానీ, కారణం లేకుండా దీర్ఘకాలంగా బిల్లులను పెండింగ్‌లో ఉంచిన సందర్భాల్లో కోర్టులు పరిమిత విచక్షణతో వ్యవహరించొచ్చు. రాష్ట్రపతి విషయంలోనూ ఇదే వర్తిస్తుంది. నిరవధిక ఆలస్యం కొనసాగుతున్న సందర్భాల్లో అది న్యాయసమీక్ష పరిధిలోకి వస్తుందని తెలిపారు. గవర్నర్ బిల్లును రాష్ట్రపతికి రిజర్వ్ చేసిన ప్రతిసారీ ఆర్టికల్ 143 కింద రాష్ట్రపతి సుప్రీంను సంప్రదించాల్సిన అవసరం లేదు. ఆర్టికల్ 200 కింద గవర్నర్లకు విచక్షణాధికారం ఉంటుంది. అయితే, దాన్ని అపరిమితంగా వినియోగించలేరు.శాసనసభలు ఒకటికి రెండుసార్లు ఆమోదించిన బిల్లులను గవర్నర్లు ఆమోదం తెలపకుండా కాలయాపన చేయడం, రాష్ట్రపతి పరిశీలనలో ఉన్నవీ తీవ్ర జాప్యానికి గురికావడంపై ఈ ఏడాది ఏప్రిల్‌లో సుప్రీంకోర్టు సంచలన నిర్ణయం తీసుకున్న సంగతి తెలిసిందే. గతంలో ఎన్నడూ లేనివిధంగా ఈ అంశంలో గవర్నర్‌తో పాటు రాష్ట్రపతికీ గడువు విధించింది. గరిష్ఠంగా మూడు నెలల్లోగా ఆ బిల్లులను ఆమోదించడమో, తిప్పి పంపించడమో చేయాలని జస్టిస్ జె.బి.పార్దీవాలా, జస్టిస్ ఆర్.మహాదేవన్ ధర్మాసనం నిర్దేశించింది. దీంతో రాజ్యాంగ అధికరణం 143(1) ప్రకారం తనకున్న అధికారాన్ని వినియోగిస్తూ రాష్ట్రపతి ద్రౌపదీ ముర్మ మే నెలలో పలు ప్రశ్నలతో సీజేఐకి లేఖ రాశారు. రాష్ట్రపతి విచక్షణ అధికారాల పరిధిలోకి వచ్చే రాష్ట్రాల బిల్లులకు ఆమోదం తెలిపే అంశంలో న్యాయస్థానం గడువు విధించడం ఎంతవరకు న్యాయ సమ్మతమో తెలపాలంటూ సుప్రీంకోర్టు అభిప్రాయాన్ని కోరారు. దీనిపై సీజేఐ నేతృత్వంలోని రాజ్యాంగ ధర్మాసనం ఏర్పాటైంది. పది రోజుల పాటు అన్ని పక్షాల వాదనలను ఆలకించిన ధర్మాసనం సెప్టెంబరు 11న తీర్పు రిజర్వు చేసింది. ఈ విషయంలో రాష్ట్రపతి, గవర్నర్లకు గడువు విధించలేమంటూ తాజాగా తీర్పు వెలువరించింది.

# కొలువు దీరిన నితీష్ సర్కారు

ఎన్డీయే ఏకంగా 202 సీట్లు దక్కించుకుంది. బీజేపీ 101 సీట్లలో పోటీ చేసి 89 చోట్ల గెలుపొందింది. 101 సీట్లలోనే పోటీ చేసిన జేడీయూ 85 చోట్ల విజయం సాధించింది. తాజాగా ప్రమాణస్వీకారం చేసిన 27 మంత్రుల్లో.. 14 మంది బీజేపీ నుంచి కాగా, 9 మంది జేడేయూకు చెందిన నేతలు. బిహార్‌లో సీఎం నితీశ్ కుమార్ దాదాపు 19 ఏళ్లు పదవిలో ఉన్నారు. 2000 సంవత్సరంలో ఏడు రోజులు మాత్రమే సీఎంగా పని చేశారు. ఇప్పుడు ఎన్డీయే కూటమి మళ్లీ ఆయనకే పగ్గాలు అప్పగించడంతో పదోసారి సీఎంగా ప్రమాణం చేశారు. పదోసారి బిహార్ సీఎంగా ప్రమాణ స్వీకారం చేసిన నితీశ్ కుమార్‌కు ప్రధాని నరేంద్ర మోదీ శుభాకాంక్షలు తెలిపారు. 'సీఎంగా ప్రమాణ స్వీకారం చేసిన నితీశ్ కుమార్‌కు నా హృదయపూర్వక శుభాకాంక్షలు. నితీశ్ రాజకీయంలో ఎంతో అనుభవం ఉన్న నాయకుడు. రాష్ట్రంలో మంచి పాలన అందించిన వ్యక్తి అనే అద్భుతమైన రికార్డు ఆయనకు ఉందని ఎక్స్ వేదికగా పోస్ట్ పెట్టారు.


తెలంగాణ ప్రభుత్వం
రెవిన్యూ (భూసే) శాఖ
**ఫారం - సి**
ప్రకటన
(చట్టంలోని సెక్షన్ 11 క్రింద దీనిలో 10ఎ మినహాయింపు గలదు)
(రూల్ 6/12 చూడండి)

గెజిట్ నెం.జిహెచ్ఎంసి-49 తేది: 12-11-2025
నెం.సి/690 ఎస్ఆర్‌డిపి/2025 తేది: 12-11-2025

తెలంగాణ ప్రభుత్వం / స్పెషల్ కలెక్టర్ (భూ.సే) & కమిషనర్, జిహెచ్ఎంసి వారు ఉప్పల్ గ్రామం & మండలం, మేడ్చల్ -మల్కాజ్‌గిరి జిల్లాలో **16283.99** చ.గ.ల విస్తీర్ణం గల భూమి స్టేడియం మెట్రో స్టేషన్ నుండి ఐటి పార్క్ వయా ఉప్పల్ స్టేడియం (సర్వే ఆఫ్ ఇండియా క్యాంపస్‌ను అనుకుని) వరకు ప్రతిపాదిత 36 మీ. రోడ్డు కొరకు కావలసి ఉందని భావిస్తున్నారు.

కావున ఉప్పల్ గ్రామం & మండలం, మేడ్చల్ -మల్కాజ్‌గిరి జిల్లాలో సుమారు **16283.99 చ.గ.ల** ప్రామాణిక కొలతలు గల భూమి ప్రాజెక్టు నిర్మాణం కోసం సేకరించాలని ప్రతిపాదించబడిదని దాని వివరాలు ఈ దిగువ విధంగా ఇవ్వబడినవని ఇందుమూలంగా తెలియజేయబడినవి.

| క్రమ సం | సర్వే నెం. | టైటిల్ రకం | భూమి రకం | సేకరణ క్రింద విస్తీర్ణం చ.గ. లలో | ఆసక్తిగల వ్యక్తి పేరు మరియు చిరునామా | సరిహద్దులు: ఉత్తరం | దక్షిణం | తూర్పు | పడమర | చెట్లు: [illegible] | [illegible] | కట్టడాలు: [illegible] | [illegible] |
|---|---|---|---|---|---|---|---|---|---|---|---|---|---|
| 1 | 2 | 3 | 4 | 5 | 6 | 7 | 8 | 9 | 10 | 11 | 12 | 13 | 14 |
| 1 | టిజిఐఐసి | - | - | 9562.98 | ఎన్ఎస్ఎల్ ఇన్‌ఫ్రా - టెక్ | స్కెచ్ ప్రకారం | | | | - | - | - | - |
| 2 | టిజిఐఐసి | - | - | 348.50 | ఉప్పల్ స్టేడియం (హెచ్‌సిఎ) | | | | | - | - | - | - |
| 3 | టిజిఐఐసి | - | - | 155.50 | మసీదు | | | | | - | - | - | - |
| 4 | టిజిఐఐసి | - | - | 6217.01 | జోనల్ మేనేజర్, టిజిఐఐసి ల్యాండ్,టిజిఐఐసి | | | | | - | - | - | - |
| | | | మొత్తము | **16283.99** | | | | | | | | | |

భూసేకరణ, పునరావాస, రీసెటిల్‌మెంట్ (తెలంగాణ సవరణ) చట్టం 2016 (చట్టం నెం.21 ఆఫ్ 2017)లో సముచిత పరిహారం, పారదర్శకత కొరకు హక్కు ద్వారా సవరించబడిన విధంగా భూసేకరణ, పునరావాస, రీసెటిల్‌మెంట్ చట్టం 2013 (కేంద్ర చట్టం నెం.30/2013)లో సముచిత పరిహారం మరియు పారదర్శకత కొరకు హక్కు యొక్క సెక్షన్ -11(1)లో నిబంధనల క్రింద సంబంధితులందరికీ ఈ ప్రకటన చేయబడినది.

భూమి ప్లాన్ స్పెషల్ కలెక్టర్ & కమిషనర్, జిహెచ్ఎంసి, హైదరాబాద్ కార్యాలయంలో ఏ పని రోజునైనా పనివేళల్లో పరిశీలించుకోవచ్చును. తెలంగాణ ప్రభుత్వం / స్పెషల్ కలెక్టర్ (ఎల్ఏ) & కమిషనర్, జిహెచ్ఎంసి, హైదరాబాద్ కం-సరియైన ప్రభుత్వం వారు సదరు చట్టంలోని సెక్షన్ -12లో తెలిపిన మరియు నిర్దేశించిన విధంగా తమ పని తగు విధంగా నిర్వహించుటకు అవసరమైన అన్ని ఇతర చట్టాలను చేయుటకు, భూమిలోనికి ప్రవేశించి భూమి సర్వే చేయుటకు, ఏ భూమి ఎత్తుపల్లాలను తీసుకొనుటకు, సబ్ సాయిల్ త్రవ్వటకు లేదా బోర్ వేయుటకు అధీకృత అధికారి అనగా స్పెషల్ డిప్యూటీ కలెక్టర్, భూసేకరణ, జిహెచ్ఎంసి, హైదరాబాద్ మరియు వారి సిబ్బందికి ఇందు మూలంగా అధికారమిస్తున్నారు.

చట్టంలోని సెక్షన్ 11(4) క్రింద స్పెషల్ కలెక్టర్ (ఎల్ఏ) & కమిషనర్, జిహెచ్ఎంసి, హైదరాబాద్ వారి ముందస్తు అనుమతి లేకుండా ఈ ప్రకటన ప్రచురించిన తేదీ నుంచి ఏ వ్యక్తి కూడా అట్టి భూమి యొక్క ఏదేని లావాదేవీలు లేదా లావాదేవీలకు కారణమయ్యే దేనిని అంటే అమ్మకం / కొనుగోలు వగైరాలు చేయరాదు లేదా అట్టి భూములపై ఎటువంటి తాకట్టు రుణభారాలు కల్పించలేదు.

పరిహారం సంప్రదింపుల ద్వారా పరిష్కారానికి ఆసక్తిగల / ప్రభావితమయ్యే వ్యక్తుల నుంచి క్లెయింలు, సేకరణ కోసం అభ్యంతరాలు ఏమైనా ఉంటే భూమిలో ఆసక్తి గల వ్యక్తులు చట్టంలోని సెక్షన్ 15 క్రింద ఏర్పాటు చేసిన విధంగా ఈ ప్రకటన ప్రచురించిన తేదీ నుంచి 60 (అరవై రోజులు) లోగా స్పెషల్ కలెక్టర్ (ఎల్ఏ) & కమిషనర్, జిహెచ్ఎంసి, హైదరాబాద్ / అధీకృత అధికారి వారి సమక్షంలో దాఖలు చేయవచ్చును.

సం/- స్పెషల్ డిప్యూటీ కలెక్టర్, ఎల్ఏ, జిహెచ్ఎంసి, హైదరాబాద్
సం/- స్పెషల్ కలెక్టర్ (ఎల్ఏ) & కమిషనర్, జిహెచ్ఎంసి, హైదరాబాద్

DIPR RO.No.849/LA/PP/Advt/Pub/2025-26


# ఇంటలీజెన్స్ సిటీగా హైదరాబాద్

తెలంగాణతో పాటు పాటు 8 ఈశాన్య రాష్ట్రాలకు చెందిన 600 మంది పాల్గొంటారని నిర్వాహకులు తెలిపారు. ఈ నెల 21, 22 తేదీల్లో మొదటి దశ ఫెస్టివల్‌లో సినిమాలు, సాహిత్యం వంటి అంశాలపై సెమినార్లు, చర్చా గోష్టిలు, ప్రదర్శనలు ఉంటాయని, 25 నుంచి 27 వరకు సాగే 2వ విడతలో ఆరోగ్యం, సాంకేతికత వంటి అంశాలపై చర్చలు ఉంటాయని చెప్పారు. రోజూ 2వేల మంది ఈ కార్యక్రమంలో పాల్గొంటారని, 40 మంది పౌర పురస్కార విజేతలు కూడా దీనికి హాజరవుతారని గవర్నర్ కార్యాలయ కార్యదర్శి దాన కిశోర్ తెలిపారు.రెండు రాష్ట్రాల మధ్య సాంస్కృతిక వారసత్వం ఇచ్చి పుచ్చుకోవడానికే కాదు ఒకరి ఉత్పత్తులు మరొకరు అమ్మడానికి, కొన డానికి దోహదం చేస్తుందని త్రిపుర గవర్నర్ ఇంద్ర సేనా రెడ్డి అన్నారు. సంస్కృతి, సహజ వనరుల పరం గా ఈశాన్య రాష్ట్రాలు ఎంతో గొప్పవని.. మన దేశం అతిథి దేవో భవ అంటే వారు అభివృద్ధి దేవో భవ అంటున్నారని తెలిపారు. సంక్షేమ ఫలాలు అం దరికీ చేరడమే అసలైన అభివృద్ధి అన్నారు. తొలి రో జు ఉత్తమ ప్రదర్శన కనబరిచిన కళాకారులకు గవ ర్నర్ బహుమతులు అందజేశారు. మిజోరాం యువ జన సర్వీసులు, క్రీడల మంత్రిని సీఎం సన్మానించారు.



# తెలంగాణ తరహాలో దేశవ్యాప్తంగా సన్నబియ్యం పంపిణీ చేయండి

**కేంద్రమంత్రికి సీఎం రేవంత్ సూచన**

**పరిశీలిస్తామన్న మంత్రి ప్రహ్లాద్ జోషి**

**హైదరాబాద్(జనంసాక్షి):** దేశంలో ఎక్కడాలేని విధంగా తెలంగాణలో రేషన్ షాపుల్లో వినియోగదారులకు సన్న బియ్యాన్ని సరఫరా చేస్తున్నామని కేంద్ర మంత్రి ప్రహ్లాద్ జోషికి ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి వివరించారు. గురువారం ఉదయం హోటల్ తాజ్‌కృష్ణలో కేంద్రమంత్రితో ముఖ్యమంత్రి రేవంత్ సమావేశమయ్యారు. ఈ సందర్భంగా రాష్ట్రంలో సన్న బియ్యం పంపిణీ విషయాన్ని కేంద్రమంత్రి దృష్టికి తీసుకెళ్లారు. ప్రజలు తినే బియ్యాన్ని సరఫరా చేస్తేనే సంక్షేమ పథకం ఉద్దేశం నెరవేరుతుందని ముఖ్య మంత్రి అన్నారు. తెలంగాణలాగే కేంద్రం కూడా దేశవ్యాప్తంగా సన్న బియ్యం పంపిణీ అంశాన్ని పరిశీలించాలని కేంద్రమంత్రి కోరారు. అవసరమైతే అధ్యయనం చేసి తగు నిర్ణయం తీసుకోవాలని వినతి చేశారు. దీనిపై కేంద్రమంత్రి సానుకూలంగా స్పందించారు. పూర్తిస్థాయి అధ్యయనం తర్వాత పరిశీలించి దేశవ్యాప్తంగా సన్న బియ్యం పంపిణిపై నిర్ణయం తీసుకుంటామని కేంద్రమంత్రి ప్రహ్లాద్ జోషి వెల్లడించారు. ఈ సమావేశంలో రాష్ట్ర పౌరసరఫరాల శాఖ మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి, రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి రామకృష్ణారావు, ఇతర ఉన్నతాధికారులు పాల్గొన్నారు.



# ప్రకృతి విపత్తులకు నియంత్రణకు ఏఐ టెక్నాలజీ

**– సీఎం రేవంత్‌రెడ్డితో అనలాగ్ ఏఐ సీఈవో భేటీ**

**హైదరాబాద్(జనంసాక్షి):** ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డితో అనలాగ్ ఏఐ సంస్థ సీఈవో అలెక్స్ కిప్‌మాన్ భేటీ అయ్యారు. హైదరాబాద్‌లో ట్రాఫిక్, వరదల నియంత్రణకు ఏఐ టెక్నాలజీ సాయం కావాలని సీఎం కోరారు. ఫ్యూచర్ సిటీ, ఏఐ సిటీ, మూసీ ప్రాజెక్టుల గురించి కిప్‌మాన్‌కు వివరించారు. డిసెంబర్ 8, 9 తేదీల్లో నిర్వహించబోయే గ్లోబల్ సమ్మిట్‌కు హాజరు కావాలని ఈ కంపెనీ సీఈఓను ముఖ్యమంత్రి ఆహ్వానించారు.నేత కార్మికుల రుణమాఫీ కోసం రూ.33 కోట్లు విడుదల చేస్తూ తెలంగాణ ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. నిధులు విడుదల చేసినందుకు గానూ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు సీఎంకు ధన్యవాదాలు తెలిపారు.

# నిఖత్ జరీన్‌కు స్వర్ణం

- వరల్డ్ బాక్సింగ్ కప్‌లో గోల్డ్ మెడల్ కైవసం
- ఫైనల్లో చైనీస్ తైపీకి చెందిన జువాన్ యి గువోపై గెలుపు

న్యూఢిల్లీ(జనంసాక్షి):భారత బాక్సింగ్ స్టార్, తెలంగాణ అమ్మాయి నిఖత్ జరీన్ వరల్డ్ బాక్సింగ్ కప్‌లో స్వర్ణ పతకం (51 కిలోల విభాగంలో) కైవసం చేసుకుంది.ఇవాళ (నవంబర్ 20) జరిగిన ఫైనల్లో చైనీస్ తైపీకి చెందిన జువాన్ యి గువోపై 5–0తో గెలుపొందింది. నిఖత్ సాధించిన ఈ పతకంతో ప్రస్తుత బాక్సింగ్ కప్‌లో భారత మహిళలు సాధించిన పతకాల సంఖ్య ఐదుకు చేరింది. నిఖత్‌కు ముందు 48 కిలోల విభాగంలో మినాక్షి హూడా, 54 కిలోల విభాగంలో ప్రీతి పవార్, 70 కిలోల విభాగంలో అరుంధతి, 80ం కిలోల విభాగంలో నూపుర్ శెఓరన్ స్వర్ణాలు సాధించారు. మాజీ ప్రపంచ చాంపియన్ అయిన నిఖత్.. దాదాపు రెండేళ్ల తర్వాత తొలి అంతర్జాతీయ పతకాన్ని సాధించింది. ఈ టోర్నీలో నిఖత్ వెయిట్ కేటగిరీలో ఐదుగురు బాక్సర్లు మాత్రమే బరిలోకి దిగారు. దీంతో నేరుగా సెమీఫైనల్ ఆడిన నిఖత్ 5–0తో జెనీవా గుల్‌సెవర్ (ఉజ్బెకిస్తాన్)ను చిత్తు చేసింది.భుజం గాయంతో దాదాపు ఏడాది పాటు ఆటకు దూరమైన నిఖత్ ఈ టోర్నీతోనే బరిలోకి దిగింది. 2024 ఫిబ్రవరిలో స్ట్రాంజా మెమోరియల్ టోర్నీలో సాధించిన విజయం తర్వాత నిఖత్ గెలిచిన తొలి పతకం ఇదే.

# బండి సంజయ్, కేటీఆర్‌కు హైకోర్టులో ఊరట

కేసు నమోదులో సరైన సెక్షన్లు, దర్యాప్తులో పూర్తి వివరాలు లేవని పేర్కొన్న హైకోర్టు.. కేసును కొట్టేస్తూ ఉత్తర్వులు జారీ చేసింది. 2023 ఎన్నికల సమయంలో కోడ్ ఉల్లంఘించారని మాజీ మంత్రి కేటీఆర్, గోరటి వెంకన్నపై సైఫాబాద్ పీఎస్‌లో కేసు నమోదైంది. ప్రభుత్వ పథకాలపై గోరటి వెంకన్న.. సచివాలయం ఎదురుగా ఉన్న అమరవీరుల జ్యోతి వద్ద కేటీఆర్‌ను ఇంటర్వ్యూ చేశారని, అనుమతి లేకుండా డ్రోన్ ఎగురవేశారని పోలీసులు పేర్కొన్నారు. భారత రాష్ట్ర సమితికి లబ్ధి చేకూర్చే విధంగా ఇంటర్వ్యూ ఉందని ఎఫ్ఐఆర్‌లో పొందుపర్చారు. రాజకీయ లబ్ధి కోసమే కేసు నమోదు చేశారని కేటీఆర్ తరఫు న్యాయవాది కోర్టు దృష్టికి తెచ్చారు. ఇరువైపులా వాదనలు విన్న ధర్మాసనం.. కేటీఆర్, గోరటి వెంకన్నపై నమోదైన ఎఫ్ఐఆర్‌ను కొట్టివేసింది.

# నేడు హైదరాబాద్‌కు రాష్ట్రపతి రాక

**హైదరాబాద్(జనంసాక్షి):** తిరుమల పర్యటన ముగించుకుని రాష్ట్రపతి ద్రౌపది ముర్మ శుక్రవారం మధ్యాహ్నం 1.10 గంటలకు ప్రత్యేక విమానంలో బేగంపేట ఎయిర్‌పోర్ట్‌కు చేరుకుంటారు. అక్కడి నుంచి నేరుగా ఆమె రాజ్ భవన్‌కు వెళ్తారు. మధ్యాహ్నం భోజనం చేసి.. రాజ్ భవన్‌లో విశ్రాంతి తీసుకుంటారు. ఆ తర్వాత 3:50 గంటలకు బొల్లారంలోని రాష్ట్రపతి నిలయానికి ఆమె చేరుకుంటారు. సాయంత్రం 4.00 గంటలకు రాష్ట్రపతి నిలయం వేదికగా నిర్వహించే భారతీయ కళా మహోత్సవాన్ని రాష్ట్రపతి ముర్మ ప్రారంభిస్తారు. తిరిగి సాయంత్రం 6:15 గంటలకు ఆమె తిరిగి రాజ్ భవన్‌కు చేరుకుంటారు.

# మరో నలుగురిని అరెస్ట్ చేసిన ఎన్ఐఏ

**న్యూఢిల్లీ(జనంసాక్షి):** ఢిల్లీ ఎర్రకోట సమీపంలో జరిగిన పేలుళ్లతో సంబంధం ఉన్న మరో నలుగురు నిందితులను ఎన్ఐఏ పట్టుకుంది. గురువారం శ్రీనగర్‌లో వీరిని అరెస్ట్ చేసింది. దీంతో ఈ దాడితో సంబంధం ఉన్న మొత్తం అరెస్టులు 6కి పెరిగాయి. నవంబర్ 10న ఢిల్లీలోని ఎర్రకోట దగ్గర జరిగిన పేలుడు ఘటనపై జాతీయ దర్యాప్తు సంస్థ ముమ్మరంగా దర్యాప్తు సాగిస్తోన్న సంగతి తెలిసిందే. జిల్లా సెషన్స్ జడ్జి, పాటియాలా హౌస్ కోర్టు జారీ చేసిన ఆర్డర్ల మేరకు నలుగురు నిందితులను జమ్మూ కాశ్మీర్‌లోని శ్రీనగర్‌లో అదుపులోకి తీసుకున్నారు. వారిని జమ్మూ కాశ్మీర్‌లోని పుల్వామాకు చెందిన డాక్టర్ ముజమ్మిల్ షకీల్ గనై, జమ్మూ కాశ్మీర్‌లోని అనంత్‌నాగ్‌కు చెందిన డాక్టర్ అదీల్ అహ్మద్ రాథర్, ఉత్తర ప్రదేశ్‌లోని లక్నోకు చెందిన డాక్టర్ షాహీన్ సయీద్ ఇంకా, జమ్మూ కాశ్మీర్‌లోని షోపియన్‌కు చెందిన ముఫ్తీ ఇర్ఫాన్ అహ్మద్ వాగేగా గుర్తించారు. వీరందరూ ఢిల్లీ బ్లాస్ట్ లో ముఖ్యమైన పాత్ర పోషించారని దర్యాప్తు ఏజెన్సీ చెబుతోంది. టీవల ఈ కేసుకు సంబంధించి ఇద్దరు నిందితులను ఎన్ఐఏ అరెస్టు చేసిన సంగతి తెలిసిందే. పేలుడుకు ఉపయోగించిన కారు ఎవరి పేరున రిజిస్టర్ అయిందో అతనైన(అమీర్ రషీద్ అలీ)ని, దాడిలో పాల్గొన్న ఉగ్రవాదికి సాంకేతిక సహాయం అందించిన డానిష్ అలియాస్ జాసిర్ బిలాల్ వాని లను ఔఎం అదుపులోకి తీసుకుంది. ఈ కేసులో పూర్తి కుట్రను వెలికితీసే ప్రయత్నాలలో భాగంగా వీరిద్దరినీ ఇంటరాగేట్ చేస్తోంది.కాగా, ఈ పేలుడు ఘటన జరిగిన వెంటనే కేంద్ర హోం మంత్రిత్వ శాఖ దీనిపై దర్యాప్తును ఎన్ఐఏ కి అప్పగించింది. దాడికి కారణమైన గ్రూపులోని ప్రతి సభ్యుడిని గుర్తించి అరెస్టు చేయడానికి ఏజెన్సీ వివిధ రాష్ట్ర పోలీసు దళాలతో కలిసి పనిచేస్తోంది. నవంబర్ 10న ఢిల్లీలోని నేతాజీ సుభాష్ మార్గ్‌లో ముష్కరమూకలు జరిపిన పేలుడులో 15 మంది మరణించారు.

# దానం, కడియంలకు మరోసారి నోటీసులు

జారీ చేశారు. అనర్హత పిటిషన్లపై అఫిడవిట్ దాఖలు చేయాలని అసెంబ్లీ స్పీకర్ స్పష్టం చేశారు. ఇక.. పార్టీ ఫిరాయింపుల ఆరోపణలు ఎదుర్కొంటున్న ఎమ్మెల్యేల విచారణ గురువారంతో ముగిసింది. కేసు విచారణ ఆలస్యంపై సుప్రీం సీరియస్ అవడంతో పాటు నాలుగు వారాలు గడువు ఇచ్చిన విషయం తెలిసిందే. ఈ నేపథ్యంలో విచారణలో వేగం పెంచాలని అసెంబ్లీ స్పీకర్ నిర్ణయించారు. ఇందులో భాగంగా రెండో విడత విచారణలో భాగంగా నలుగురు ఎమ్మెల్యేలను విచారణకు పిలిచారు. ఉదయం ఎమ్మెల్యేల విచారణ మొదలైంది. పోచారం శ్రీనివాస్ రెడ్డి వర్సెస్ జగదీశ్ రెడ్డి కేసును స్పీకర్ విచారించారు. ఇరు వర్గాల వాదనలను స్పీకర్ విన్నారు. అలాగే మధ్యాహ్నం అరికెపూడి గాంధీ వర్సెస్ ఎమ్మెల్యే కల్వకుంట్ల సంజయ్ కేసు విచారించారు. వీరి విచారణతో మొత్తం ఎనిమిది మంది ఎమ్మెల్యేల విచారణ పూర్తి అవుతుంది. మరోవైపు ఎమ్మెల్యే దానం నాగేందర్ ఢిల్లీ వెళ్లారు. ఏఐసీసీ పెద్దలను కలవనున్నారు. ఫిరాయింపు ఎమ్మెల్యేల విచారణ ముగియనున్నప్పటికీ ఇప్పటి వరకు దానం అఫిడవిట్లు దాఖలు చేయలేదు. విచారణకు హాజరైతే వేటు పడుతుందని దానం భావిస్తున్నట్లు తెలుస్తోంది. వేటు పడితే ఆరు సంవత్సరాల పాటు పోటీ చేయడానికి నో ఛాన్స్. ఈ క్రమంలో రాజీనామా చేసేందుకు దానం మొగ్గు చూపుతున్నట్లు సమాచారం. రాజీనామా చేస్తే తన పరిస్థితి ఏంటని పార్టీ పెద్దలతో దానం సంప్రదింపులు జరుపనున్నట్లు తెలుస్తోంది.

# ఇప్పటికైనా అరెస్ట్ చేయండి

చెబుతారు? ఇన్నాళ్లూ గవర్నర్ అనుమతి ఇవ్వొద్దనే సీఎం కోరుకున్నారు. అవినీతిపరుల ఆస్తులు జప్తు చేస్తానని గతంలో ఆయన అన్నారు. ఇప్పుడు గవర్నర్ అనుమతి ఇచ్చారు కదా.. సీఎం ఏం చేస్తారో చూడాలి." అని అన్నారు. అర్బన్ నక్సలైట్లు చిన్నపిల్లలను రెచ్చగొడుతున్నారని ఆయన విమర్శించారు. కార్లలో తిరుగుతూ సొంత పైరవీలు చేసుకుంటూ రూ.కోట్లు సంపాదిస్తున్నారని ఆరోపించారు.

# కేటీఆర్ ప్రాసిక్యూషన్‌కు గవర్నర్ అనుమతి

ఈక్రమంలో కేటీఆర్ ప్రాసిక్యూషన్‌కు గవర్నర్ అనుమతి కోరుతూ గతంలో ఏసీబీ లేఖ రాసింది. ఆయన పాత్రపై సాక్ష్యాలు ఉన్నాయంటూ అందులో పేర్కొంది. ఈక్రమంలో తాజాగా ఏసీబీ అధికారులకు అనుమతి ఇస్తూ గవర్నర్ ఉత్తర్వులు జారీ చేశారు. ఫార్ములా ఈ-కార్ రేసింగ్ కేసులో త్వరలోనే ఏసీబీ ఛార్జ్‌షీట్ దాఖలు చేయనుంది. ఈ కేసులో కేటీఆర్‌ను ఏ-1 గా, సీనియర్ ఐఏఎస్ అధికారి అరవింద్ కుమార్ ను ఏ-2గా ఏసీబీ పేర్కొంది. ఇప్పటికే కేటీఆర్ ఈ కేసు విషయంలో ఏసీబీ విచారణకు నాలుగు సార్లు హాజరయ్యారు. ఈ కేసులో ఏ-2గా ఉన్న ఐఏఎస్ అధికారి అరవింద్ కుమార్ విషయంలో తదుపరి చర్యలు తీసుకోవాల్సిందిగా అధికారులు ఇప్పటికే కేంద్రంలోని డీఓపీటీకు లేఖ రాశారు. గవర్నర్ అనుమతి నేపథ్యంలో, చార్జ్‌షీట్ దాఖలుకు ముందు ఏసీబీ అధికారులు మరోసారి కేటీఆర్‌ను లేదా ఇతర కీలక వ్యక్తులను విచారించే అవకాశం ఉంది. ఈ కేసుపై గవర్నర్ అనుమతి లభించడంతో, రాజకీయ వర్గాలలో, పరిపాలనా వర్గాలలో తీవ్ర చర్చనీయాంశంగా మారింది. ఏసీబీ త్వరలో దాఖలు చేయబోయే చార్జ్‌షీట్‌తో ఈ కేసు విచారణ కీలక మలుపు తిరగనుంది. ఫార్ములా ఈ-కారు రేసులో క్విడ్ ప్రోకో జరిగినట్టు ఏసీబీ నివేదిక ఇచ్చిన విషయం తెలిసిందే. రూ.54.88 కోట్ల నిధులు దారి మళ్లింపుపై ఆరోపణలు చేసింది. ఇక, 2024లో ఫార్ములా ఈ-కారు కేసులో ఎఫ్ఐఆర్ నమోదు చేశారు. కార్ రేస్ వ్యవహారంలో 2024 డిసెంబర్ నెలలో ఏసీబీ కేసు నమోదు చేసిన సంగతి తెలిసిందే. మాజీ మంత్రి కేటీఆర్‌ను ఏ1గా ఎఫ్ఐఆర్‌లో పేర్కొన్నారు. కేసు విచారణలో భాగంగా ఇప్పటికే కేటీఆర్‌ను రెండు సార్లు, ఐఏఎస్ అధికారి అరవింద్ కుమార్‌ను 3 సార్లు ఏసీబీ అధికారులు విచారించారు. తాజాగా ప్రభుత్వానికి నివేదికను సమర్పించారు. కేసుకు సంబంధించిన నివేదికను అవినీతి నిరోధక శాఖ( ఏసీబీ) అధికారులు మంగళవారం తెలంగాణ ప్రభుత్వానికి అందించారు. ప్రాసిక్యూషన్ అనుమతి కోరుతూ ఏసీబీ అధికారులు ఈ నివేదికను రాష్ట్ర ప్రభుత్వానికి పంపించారు. బీఆర్ఎస్ ప్రభుత్వంలో కేటీఆర్ మున్సిపల్ శాఖ మంత్రిగా పనిచేశారు. ఈ నేపథ్యంలో కేటీఆర్‌ను ఈ కేసులో ఏ1గా పేర్కొంటూ ఏసీబీ కేసు నమోదు చేసింది. ఫార్ములా- ఈ కార్ రేసు నిర్వహణ కోసం యూకేకు చెందిన ఫార్ములా-ఈ ఆపరేషన్స్, ఏస్ నెక్స్ట్‌జెన్ ప్రైవేట్ లిమిటెడ్, తెలంగాణ పురపాలకశాఖ 2022 అక్టోబరు 25న ఒప్పందం చేసుకున్నాయి. ఈ ఒప్పందం ప్రకారం కార్ రేస్ నిర్వహణకు అయ్యే ఖర్చును స్పాన్సర్‌గా ఉన్న ఏస్ నెక్స్ట్ జెన్ ప్రైవేట్ లిమిటెడ్ భరించాలి. అలాగే కార్ రేసు నిర్వహణకు వీలుగా తెలంగాణ పురపాలక శాఖ ట్రాక్‌ను ఏర్పాటు చేయాలి. అందులో భాగంగా 2023 ఫిబ్రవరి 11 జరిగిన రేస్ కోసం తెలంగాణ పురపాలక శాఖ తరుపున హెచ్ఎండీఏ రూ.12 కోట్లు ఖర్చు చేసింది. రేసు నిర్వహణ ఖర్చును స్పాన్సర్‌గా ఉన్న ఏస్ నెక్స్ట్ జెన్ భరించింది.

## ఇది కక్ష సాధింపు చర్యే

ప్రయత్నం చేస్తోందన్నారు. ప్రతిపక్ష నేతలను వేధించడమే సీఎం రేవంత్‌రెడ్డి పనిగా పెట్టుకున్నారు. హైదరాబాద్ బ్రాండ్ ఇమేజ్ పెంచిన కేటీఆర్‌పై అక్రమ కేసులు పెట్టారు. స్థానిక ఎన్నికల్లో రాజకీయ లబ్ది కోసం చిల్లర డ్రామాలు చేస్తున్నారు. కేటీఆర్‌కు అండగా ఉంటాం అని హరీశ్‌రావు అన్నారు. స్థానిక సంస్థల ఎన్నికల వేళ రాజకీయ లబ్ది పొందేందుకు చేస్తున్న చిల్లర డ్రామాలను ప్రజలు గమనిస్తున్నారని చెప్పారు. అక్రమ కేసులతో కేటీఆర్, బీఆర్ఎస్ నాయకుల మనోస్థైర్యాన్ని దెబ్బతీయలేరని ఎక్స్ వేదికగా వెల్లడించారు. 'మా పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్‌పై రాజకీయకక్ష సాధింపు చర్యలకు పరాకాష్ట ఇది. రాజ్యాంగబద్ధమైన పదవిలో ఉండి ప్రశ్నించే గొంతులను ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నొక్కే ప్రయత్నం చేస్తుండటం దుర్మార్గం. పూర్తి పారదర్శకతతో నిర్వహించిన ఫార్ములా ఈ-రేస్‌లో రెండేళ్లుగా కోడిగుడ్డుపై ఈకలు పీకుతున్నది కాంగ్రెస్ సర్కార్. హైదరాబాద్ బ్రాండ్ ఇమేజీని పెంచిన కేటీఆర్‌పై అక్రమ కేసులు బనాయించి ఇబ్బంది పెట్టడమే లక్ష్యంగా పెట్టుకున్నడు రేవంత్ రెడ్డి. ప్రభుత్వ వైఫల్యాలను ఎప్పటికప్పుడు ఎండగడుతున్న కేటీఆర్ పై అక్రమ కేసులు బనాయించి రాక్షసానందం పొందటం అప్రజాస్వామికం.స్థానిక సంస్థల ఎన్నికల వేళ రాజకీయ లబ్ది పొందేందుకు చేస్తున్న చిల్లర డ్రామాలను ప్రజలు గమనిస్తున్నారు. అక్రమ కేసులతో కేటీఆర్, బిఆర్ఎస్ నాయకుల మనోస్థైర్యాన్ని దెబ్బతీయలేరు. కేటీఆర్‌కు బీఆర్ఎస్ పార్టీ పూర్తి అండగా ఉంటుంది. రేవంత్ రెడ్డి దుర్మార్గ వైఖరిని న్యాయపరంగా ఎదుర్కొంటాం.' అని ట్వీట్ చేశారు.

కెటిఆర్‌పై రాజకీయ కక్షసాధింపు

బీఆర్ఎస్ పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్‌పై కక్ష సాధింపు చర్యలను మాజీ మంత్రి, ఎమ్మెల్యే వేముల ప్రశాంత్ రెడ్డి తీవ్రంగా ఖండించారు. బీఆర్ఎస్ పార్టీని కట్టడి చేయడానికి బీజేపీ, కాంగ్రెస్ కలిసి కేటీఆర్‌పై కుట్రలు చేస్తున్నాయని ఆయన మండిపడ్డారు. ఎలాంటి అవినీతి జరగని ఫార్ములా ఈ కార్ రేస్‌లో విచారణకు ఏసీబీ అనుమతి ఇస్తూ గవర్నర్ అనుమతి తెలపడంతో కాంగ్రెస్, బీజేపీలు కలిసి కేటీఆర్‌పై కుట్రలు చేస్తున్నాయనేది తేటతెల్లామైంది. ఇచ్చిన హామీలు అమలు చేయలేక ప్రజల్లో ప్రభుత్వంపై తీవ్ర వ్యతిరేకత వచ్చినపుడు, ఎన్నికలు వచ్చినపుడు ఇలాంటి కేసుల అంశాన్ని తెరపైకి తెచ్చి రేవంత్ రెడ్డి డైవర్షన్ పాలిటిక్స్ చేస్తున్నాడు అని ప్రశాంత్ రెడ్డి ధ్వజమెత్తారు. రెండేండ్లుగా ఫార్ములా ఈ రేస్‌పై విచారణ పేరుతొ కొండను తవ్వి ఎలుకను పట్టలేకపోయారు. ఇప్పుడు మళ్ళీ స్థానిక సంస్థల ఎన్నికల సమయంలో కాంగ్రెస్ పార్టీ వైఫల్యాల నుండి ప్రజల దృష్టిని మరల్చేందుకు కక్షపూరిత రాజకీయాలకు కాంగ్రెస్ తెరలేపింది. అందులో భాగంగానే విచారణ పేరిట కేటీఆర్‌ను ఇబ్బంది పెట్టాలని రేవంత్ రెడ్డి చూస్తున్నాడు. ఫార్ములా ఈ కార్ రేస్‌తో హైదరాబాద్ బ్రాండ్ ఇమేజ్‌ని పెంచి తెలంగాణ రాష్ట్రాన్ని ప్రపంచ వ్యాప్తం చేసిండు కేటీఆర్. అక్రమ కేసులతో కేటీఆర్, బిఆర్ఎస్ నాయకులను కట్టడి చేయగలం అనుకోవడం పొరపాటే. మీరెన్ని అక్రమ కేసులు పెట్టిన ప్రజలకు ఇచ్చిన హామీలు అమలు అయ్యేవరకు, కాంగ్రెస్ పార్టీ వైఫల్యాలను ప్రజల్లో ఎండగడుతూనే ఉంటాం. కేటీఆర్‌కు బీఆర్ఎస్ పార్టీ పూర్తి అండగా ఉంటుందని ప్రశాంత్ రెడ్డి పేర్కొన్నారు.

# కీలక ఖనిజ రంగంలో తెలంగాణ చొరవకు నీతి ఆయోగ్ గుర్తింపు

ఉత్పత్తి చేయడానికి గల అవకాశాలపై కలిసి పని చేసేందుకు జాతీయస్థాయి సంస్థలైన ఎన్ ఎఫ్ టి డి సి, ఐఎంఎంటీ, జె ఎన్ ఏ ఆర్ డి డి సి వంటి సంస్థలతో ఒప్పందాలు కుదుర్చుకున్నామన్నారు.అదే కాకుండా తెలంగాణ ప్రభుత్వ దిశా నిర్దేశంలో సింగరేణి కీలక ఖనిజ రంగంలో అవలంబిస్తున్న విధానాలను ఇతర రాష్ట్రాలు కూడా ఆదర్శంగా తీసుకుంటున్నాయని ఆయన పేర్కొన్నారు. ఇటీవల అసోం రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి కూడా కేంద్ర గనుల శాఖకు రాసిన లేఖలోనూ కీలక ఖనిజాల విషయంలో సింగరేణి మోడల్ను స్వీకరించాలని ప్రస్తావించడం మన రాష్ట్ర విధానాలకు జాతీయ స్థాయిలో దక్కుతున్న గుర్తింపుగా భావించవచ్చన్నారు.అలాగే గ్రీన్ ఎనర్జీ రంగంలోనూ సింగరేణి విస్తరణ కోసం ఎన్టీపీసీ అనుబంధ సంస్థ అయిన ఎన్జీఇఎల్ సంస్థతో కలిసి పని చేయడానికి కూడా ఒక ఒప్పందం కుదుర్చుకున్నామని పేర్కొన్నారు.2300 మెగావాట్ల విద్యుత్ ప్లాంట్లకు **రాజస్థాన్ క్యాబినెట్ ఆమోదం హర్షణీయం** :తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వ చొరవతో రాజస్థాన్ విద్యుత్ ఉత్పదాన్ నిగమ్ లిమిటెడ్ తో కలిసి సింగరేణి సంస్థ 2300 మెగావాట్ల థర్మల్, సోలార్ విద్యుత్ ఉత్పాదనకు కుదుర్చుకున్న ఒప్పందానికి బుధవారం ఆ రాష్ట్ర క్యాబినెట్ ఆమోదం తెలపడం హర్షనీయమని రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి శ్రీ భట్టి విక్రమార్క మల్లు పేర్కొన్నారు. ఉభయ రాష్ట్రాలకు మేలు చేసే విధంగా మరియు దేశ విద్యుత్ అవసరాలకు తగిన విధంగా సహకరించేందుకు ఈ మెగా ప్రాజెక్టును సంయుక్తంగా చేపట్టామన్నారు. రాజస్థాన్ రాష్ట్ర క్యాబినెట్ అనుమతి లభించింది కాబట్టి రాజస్థాన్ లోని సోలార్ వ్యాలీలో ఏర్పాటు చేయనున్న 1500 మెగావాట్ల సోలార్ ప్లాంట్ కు కావలసిన స్థలం త్వరగా సమకూరుతుందన్నారు. ఒప్పందంలో భాగంగా మరో ఎనిమిది వందల మెగావాట్ల ప్లాంట్ ను ప్రస్తుత మంచిర్యాల సమీపంలో గల సింగరేణి థర్మల్ విద్యుత్ ప్రాంగణంలో ఏర్పాటు చేయనుందని పేర్కొన్నారు. క్యాబినెట్ సమావేశంలో సింగరేణి - రాజస్థాన్ విద్యుత్ ఉత్పాదన నిగం లిమిటెడ్ ఒప్పందానికి అనుమతి ఇచ్చిన రాజస్థాన్ రాష్ట్ర ప్రభుత్వానికి తన అభినం దనలు శుభాకాంక్షలు తెలియజేశారు. త్వరలో సింగరేణిని జాతీయ, అంతర్జాతీయ స్థాయిలో విస్తరించేలా ప్రణాళికలు రూపొందించినట్లు పేర్కొన్నారు. వీలైనంత త్వరగా ఈ ప్లాంట్ల నిర్మాణాన్ని చేపట్టేందుకు జాయింట్ వెంచర్ కంపెనీని ఏర్పాటు చేసేలా చర్యలు తీసుకోవాలని సింగరేణి సీఎండీ శ్రీ ఎన్.బలరామ్ను ఆదేశించారు.

# స్కాలర్షిప్ బకాయిలు వెంటనే విడుదల చేయండి

**– ఆర్థిక శాఖ అధికారులకు డిప్యూటీ సీఎం ఆదేశం**

**హైదరాబాద్(జనంసాక్షి):**జూనియర్ కళాశాలు, డిగ్రీ కళాశాలలు మరియు పాలిటెక్నిక్ కళాశాలలకు సంబంధించి పెండింగ్ లో ఉన్న స్కాలర్షిప్ బకాయిలను వెంటనే విడుదల చేయాలని డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క మల్లు ఆర్థిక శాఖ అధికారులను ఆదేశించారు. గురువారం సాయంత్రం ప్రజాభవన్ లో ఆర్థిక శాఖ తో పాటు సంబంధిత శాఖ అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. రాష్ట్రంలోని జూనియర్, డిగ్రీ మరియు పాలిటెక్నిక్ కళాశాలలు 2,813 సంబంధించిన 161 కోట్ల రూపాయల బకాయిలు ఉన్నట్టుగా అధికారుల సమీక్షలో నిర్ధారించారు. మొత్తం 161 కోట్లను వెంటనే విడుదల చేయాలని డిప్యూటీ సీఎం ఆదేశించారు.

# స్థానిక సంస్థల ఎన్నికల నిర్వహణకు సన్నాహాలు

- మూడు దఫాలుగా నిర్వహణకు డిజిపి సూచన



హైదరాబాద్, నవంబర్ 20 (జనంసాక్షి) : స్థానిక సంస్థల ఎన్నికల నిర్వహణకు సంబంధించిన సన్నాహాలపై రాష్ట్ర ఎన్నికల కమిషన్ గురువారం నాడు వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించింది. రాష్ట్ర ఎలక్షన్ కమిషనర్ రాణి కుమిదిని, చీఫ్ సెక్రటరీ రామకృష్ణారావు, డైరెక్టర్ జనరల్ ఆఫ్ పోలీస్ బి.శివధర్ రెడ్డిలతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. జిల్లా కలెక్టర్లు, పోలీస్ అధికారులు మరియు సంబంధిత అధికారులు వీడియో కాన్ఫరెన్స్‌లో పాల్గొన్నారు. ఈ సందర్భంగా డైరెక్టర్ జనరల్ ఆఫ్ పోలీస్ మాట్లాడుతూ గత ఎన్నికల నిర్వహణలో ఎదురైన అనుభవాలను పరిగణనలోకి తీసుకుని, శాంతిభద్రతల నిర్వహణ సులభతరం చేయడానికి ప్రతి జిల్లాలో ఎన్నికలను మూడు దఫాలుగా నిర్వహించాలని ప్రతిపాదించారు. ఒక ప్రాంతంలోని ఎన్నికలు పూర్తయిన తర్వాత, మరొక ప్రాంతంలో ఎన్నికలకు మధ్యలో రెండు రోజుల విరామం ఉండాలని డిజిపి అభిప్రాయపడ్డారు. ఈ విరామం వలన సిబ్బందికి, భద్రతా బలగాలకు తగిన సమయం లభిస్తుందని, బందోబస్తు నిర్వహణ మరింత సమర్థవంతంగా ఉంటుందని ఆయన పేర్కొన్నారు. సర్పంచ్ ఎన్నికలు పూర్తయిన రోజు ఫలితాలు సాయంత్రం ప్రకటిస్తున్న నేపథ్యంలో ర్యాలీలు నిర్వహించే అవకాశం ఉన్నందున రెండు రోజుల విరామం అవసరమని డీజీపీ అన్నారు. రాష్ట్ర ఎన్నికల కమిషన్ సూచనల మేరకు ఎన్నికల సందర్భంగా పటిష్టమైన బందోబస్తును ఏర్పాటు చేస్తామని డీజీపీ హామీ ఇచ్చారు. ముఖ్యంగా, సమస్యాత్మక ప్రాంతాల పట్ల, అలాగే అనుమానాస్పదంగా కనిపించే వ్యక్తుల పట్ల అప్రమత్తతో వ్యవహరించాల్సిన అవసరం ఉందన్నారు. డిజిపి సూచనలు, భద్రతా అంశాల చర్చానంతరం, స్టేట్ ఎలక్షన్ కమిషనర్ జిల్లాల కలెక్టర్లు, ఇతర అధికారుల అభిప్రాయాలను అడిగి తెలుసుకున్నారు. ఎన్నికల ప్రక్రియ సజావుగా, నిష్పక్షపాతంగా జరిగేందుకు వీలుగా, మోడల్ కోడ్ ఆఫ్ కండక్ట్ ఉల్లంఘనలపై వచ్చే ఫిర్యాదులను పరిశీలించి, త్వరితగతిన చర్యలు తీసుకోవడానికి రాష్ట్రస్థాయి రివ్యూ కమిటీని ఏర్పాటు చేయాలని స్టేట్ ఎలక్షన్ కమిషన్ ఈ సందర్భంగా అధికారులకు సూచించింది. శాంతి భద్రతల అడిషనల్ డిజిపి మహేష్ ఎం భగవత్, మల్టీ జోన్ బి2 అడిషనల్ డిజిపి డిఎస్ చౌహాన్, మల్టీ జోన్ బి1 ఐజిపి ఎస్.చంద్రశేఖర్ రెడ్డి, శాంతి భద్రతల ఏఐజి రమణ కుమార్ తదితరులు సమావేశంలో పాల్గొన్నారు.

# పిల్లల బంగారు భవిష్యత్తు కోసం కృషి చేయాలి

- సీఎం ప్రజావాణి ఇంచార్జ్, రాష్ట్ర ప్రణాళికా సంఘం వైస్ చైర్మన్ డాక్టర్ జీ.చిన్నారెడ్డి
- ప్రజా భవన్‌లో 'బాలల ప్రజావాణి' నిర్వహణ



హైదరాబాద్ (జనంసాక్షి) : పిల్లల బంగారు భవిష్యత్తు కోసం కృషి చేయాల్సిన ఆవశ్యకత, బాధ్యత తల్లిదండ్రులు, గురువులకు ఉందని సీఎం ప్రజావాణి ఇంచార్జి, రాష్ట్ర ప్రణాళికా సంఘం వైస్ చైర్మన్ డాక్టర్ జీ. చిన్నారెడ్డి అన్నారు. గురువారం మహాత్మా జ్యోతిబా పూలే ప్రజా భవన్ లో ప్రపంచ బాలల హక్కుల దినోత్సవం సందర్భంగా 'బాలల ప్రజావాణి' ని నిర్వహించారు. ఈ సందర్భంగా చిన్నారెడ్డి మాట్లాడుతూ చిన్నతనం నుంచే పిల్లలను వివిధ రంగాల్లో ప్రోత్సాహించాలని, పిల్లల మనోభావాలకు అనుగుణంగా పెద్దలు ముందుకు సాగాలని పేర్కొన్నారు. ముఖ్యంగా బాలికల పట్ల గౌరవంగా ఉండాలని, బాల్య వివాహాలు చేయొద్దని చిన్నారెడ్డి సూచించారు. బాలల హక్కులను పరిరక్షించాలని అన్నారు. పిల్లల బంగారు భవిష్యత్తుకు బాటలు వేయాలని అన్నారు. పిల్లల కోసం ప్రత్యేకంగా ప్రజావాణిని నిర్వహించడం గొప్ప విషయం అని చిన్నారెడ్డి తెలిపారు. ఈ కార్యక్రమంలో చైల్డ్ రైట్స్ కమిషన్ చైర్పర్సన్ సీతా దయాకర్ రెడ్డి, సీఎం ప్రజావాణి స్టేట్ నోడల్ అధికారి, సెర్ప్ సీఈఓ దివ్య దేవరాజన్, యూనిసెఫ్ సౌత్ ఇండియా చీఫ్ జలేలం తఫెసి, చైల్డ్ రైట్స్ సంస్థ అధికారి రమేష్, వివిధ శాఖల అధికారులు, తదితరులు పాల్గొన్నారు.



## మహిళా జర్నలిస్టుల ఫిర్యాదుపై మహిళా కమిషన్ చర్యలు

హైదరాబాద్ (జనంసాక్షి) : మహిళా జర్నలిస్టుల కంప్లైంట్ పైన మహిళా కమిషన్ స్పందించింది. తక్షణమే విచారణ జరిపి నివేదిక సమర్పించాలని తెలంగాణ డీజీపీకి మహిళా కమిషన్ చైర్ పర్సన్ నేరెళ్ల శారద ఆదేశాలు జారీ చేశారు. మహిళల గౌరవం, భద్రత, స్వేచ్ఛాయుత అభిప్రాయ వ్యక్తీకరణను కాపాడటం తమ ప్రాధాన్యత అని తెలిపారు. మహిళా జర్నలిస్టులపై జరుగుతున్న ఆన్‌లైన్ హరాస్‌మెంట్, బెదిరింపులు, అసభ్య వ్యాఖ్యలపై సమన్స్ జారీ చేశామని తెలిపారు. ఈ విషయంలో మహిళా కమిషన్ ఎల్లప్పుడూ ముందుండి కఠిన చర్యలు తీసుకుంటుందని నేరెళ్ల శారద తెలిపారు. మహిళలపై ఇలాంటి దాడులు చేస్తే తప్పించుకునే అవకాశం ఉండదన్నారు. నవంబర్ 18న ఆన్ లైన్ వేదింపులపైన చర్యలు తీసుకోవాల్సిందిగా మహిళా కమిషన్‌కు హైదరాబాద్ ఉమెన్స్ జర్నలిస్టులు ఫిర్యాదు చేసిన విషయం తెలిసిందే.

## తిరుమలకు చేరుకున్న భారత రాష్ట్రపతి



తిరుమల (జనంసాక్షి) : శ్రీవారి దర్శనార్థం భారత గౌరవ రాష్ట్రపతి ద్రౌపది ముర్ము గురువారం సాయంత్రం తిరుమల చేరుకున్నారు. తిరుమలలోని శ్రీ పద్మావతి విశ్రాంతి గృహం వద్దకు చేరుకున్న ఆమెకు ఆంధ్రప్రదేశ్ హోంశాఖ మంత్రి శ్రీమతి వంగలపూడి అనిత, టీటీడీ చైర్మన్ బీ.ఆర్.నాయుడు, బోర్డు సభ్యులు పనబాక లక్ష్మీ, జానకీ దేవి, శ్రీ భానుప్రకాశ్ రెడ్డి, టీటీడీ అదనపు ఈవో చె. వెంకయ్య చౌదరి పుష్పగుచ్ఛాలు అందించి ఆహ్వానం పలికారు. ఈ కార్యక్రమంలో జిల్లా కలెక్టర్ డాక్టర్ వెంకటేశ్వర్, ఎస్పీ సుబ్బరాయుడు తదితర జిల్లా ఉన్నతాధికారులు కూడా పాల్గొన్నారు.

# ఘనంగా చుక్కా రామయ్య జన్మదిన వేడుకలు







హైదరాబాద్ (జనంసాక్షి) : ప్రముఖ విద్యావేత్త, మాజీ శాసనమండలి సభ్యులు చుక్కా రామయ్య 98వ జన్మదినోత్సవం ఆయన నివాసంలో అత్యంత ఘనంగా జరిగింది. రెండు తెలుగు రాష్ట్రాల్లో ఐఐటి చదువుకు ప్రోత్సాహాన్ని అందించి ఎందరినో తీర్చిదిద్దిన చుక్కా రామయ్య విద్యారంగానికి దిక్సూచి అని పలువురు మంత్రులు, మాజీ మంత్రులు, మాజీ గవర్నర్‌లు, పలు పార్టీల రథసారదులు రామయ్యకు జన్మదిన శుభాకాంక్షలు తెలియజేశారు. తెలంగాణ మట్టికి విశ్వఖ్యాతిని ఆర్జించి పెట్టిన ఐఐటి రామయ్య కృషి మరిచిపోలేనిదన్నారు. సిలికాన్ వాలి తెలుగు వాళ్లతో నిండిపోడానికి కారణం చుక్కా రామయ్య ప్రేరణ ఎంతో ఉందని కొనియాడారు.

మాజీ గవర్నర్ బండారు దత్తాత్రేయ, సుప్రీంకోర్టు మాజీ న్యాయమూర్తి జస్టిస్ సుదర్శన్ రెడ్డి, బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్, రాష్ట్ర మంత్రి పొన్నం ప్రభాకర్, ఎమ్మెల్యేలు తన్నీరు హరీష్‌రావు, పల్లా రాజేశ్వర్‌రెడ్డి, తలసాని శ్రీనివాస్ యాదవ్, కాలేరు వెంకటేష్, ముఠా గోపాల్, తెలంగాణ జనసమితి అధ్యక్షులు ఎం.కోదండరామ్, తెలంగాణ రచయితల వేదిక మాజీ అధ్యక్షులు జూలూరు గౌరీశంకర్, బుద్ధభవన్ డైరెక్టర్ మల్లెపల్లి లక్ష్మయ్య, మాజీ ఎమ్మెల్యే కిచ్చన్నగారి లక్ష్మారెడ్డి, మాజీ ఎమ్మెల్సీ నర్సిరెడ్డి, సిడబ్ల్యుసి సభ్యుడు గిడుగు రుద్రరాజు, ప్రొఫెసర్ హరగోపాల్, మాడభూషి శ్రీధర్, సీనియర్ సంపాదకులు రామచంద్రమూర్తి, సామాజిక కార్యకర్త కోయ చంద్రమోహన్, సారంగపాణి, పలుజిల్లాలకు సంబంధించిన విద్యాసంస్థల నిర్వాహకులు, అధ్యాపకులు, ఉపాధ్యాయులు తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా విద్యావేత్త చుక్కా రామయ్య రాసిన 'సాధకులు-బోధకులు', 'రెండవ పాఠం' పునర్ముద్రణ పుస్తకాలను పలువురు ప్రముఖులు ఆవిష్కరించారు.

ఈ సందర్భంగా మాజీ గవర్నర్ బండారు దత్తాత్రేయ మాట్లాడుతూ నిజాయితీ, నిబద్ధతగల ఉపాధ్యాయునికి నిర్వచనం చుక్కా రామయ్యేనని అన్నారు. రామయ్యను స్ఫూర్తిగా తీసుకుని తరగతి గదులను తీర్చిదిద్దవలసిన బాధ్యత ఈనాటి ఉపాధ్యాయ లోకంపై ఉందని తెలిపారు.

రెండు తెలుగు రాష్ట్రాల్లో ఐఐటి పూర్తి చేసిన అనేక మంది విద్యార్థులు ప్రపంచ దేశాల్లో స్థిరపడటానికి చుక్కా రామయ్యే కారకుడని బీఆర్ఎస్ పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ కొనియాడారు. విద్యాప్రదాతగనే కాకుండా తెలంగాణ పోరాటంలో, రాజకీయాల్లో దిక్సూచిగా తనవంతు పాత్రను పోషించారని కొనియాడారు. చుక్కా రామయ్య నూరేళ్ళు పూర్తి చేసుకోవాలన్నారు. ఆయన పుట్టినరోజును జరుపుకోవడం మనందరికీ ఎంతో స్ఫూర్తిదాయకమని తెలిపారు.

మంచి ఉపాధ్యాయునిగా నిలిచి ఎందరెందరినో తీర్చిదిద్దిన చుక్కా రామయ్య 98వ జన్మదినాన్ని జరుపుకోవడం గర్వించదగ్గ విషయమని రాష్ట్ర బీసీ శాఖమంత్రి పొన్నం ప్రభాకర్ అన్నారు. రామయ్య ఆలోచనలు తీసుకుని ముందుకు సాగితే విద్యారంగం ముందుకు సాగుతుందని చెప్పారు. ప్రజాపాలనలో విద్యకు అత్యంత ప్రాధాన్యత ఇస్తున్నమన్నారు.

జీవితాన్ని తరగతి గదికే అంకితం చేసి ఈ నేల స్ఫూర్తిని విశ్వవ్యాప్తం చేసిన చుక్కా రామయ్య ధన్యుడని మాజీ మంత్రి తన్నీరు హరీష్‌రావు కొనియాడారు. నిబద్ధత, నిమగ్నతలను నిదర్శనంగా జీవించిన వారని తెలిపారు. భోదనే జీవితంగా వృత్తికి అంకితమైన మహామనీషి అని చెప్పారు.

## 1న సామూహిక వందేమాతరం గీతాలాపన

హైదరాబాద్, నవంబర్ 20 (జనంసాక్షి) : డిసెంబర్ 1వ తేదీన పటాన్ చెరు పట్టణంలో నిర్వహించ తలపెట్టిన వందేమాతరం 150 వసంతాల సామూహిక గీతాలాపన కార్యక్రమ ఏర్పాట్లను పటాన్‌చెరు ఎమ్మెల్యే గూడెం మహిపాల్ రెడ్డి పరిశీలించారు. గురువారం సాయంత్రం వివిధ శాఖల అధికారులతో కలిసి పటాన్ చెరు పట్టణంలోని నొవపాన్ పరిశ్రమ సమీపంలో గల ఖాళీ స్థలంలో కార్యక్రమం నిర్వహించబోతున్నట్లు తెలిపారు. 30 వేల మంది విద్యార్థులు ఒకే సమయాన సామూహిక గీతాలాపన చేసేలా కార్యక్రమాన్ని తీర్చిదిద్దినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో పాల్గొనే ప్రతి ఒక్కరికి ఎటువంటి ఇబ్బందులు తలెత్తకుండా పూర్తిస్థాయి ఏర్పాట్లు చేస్తున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో పటాన్ చెరు డీఎస్పీ ప్రభాకర్, సీఐ వినాయక్ రెడ్డి, జాతీయ రహదారుల సంస్థ డీఈ రామకృష్ణ, మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ విజయ్ కుమార్, మండల విద్యా శాఖ అధికారి నాగేశ్వరరావు, తదితరులు పాల్గొన్నారు.



# విద్యార్థి ఉద్యమకారులు లేకుంటే రాష్ట్రమే లేదు

- ఎస్సీ కార్పొరేషన్ మాజీ చైర్మన్ డాక్టర్ పిడమర్తి రవి

హైదరాబాద్ (జనంసాక్షి) : తెలంగాణ రాష్ట్ర సాధనలో కవులు కళాకారుల కంటే అతి పెద్ద పాత్ర పోషించింది విద్యార్థి ఉద్యమ నాయకులు అని అప్పటి విద్యార్థి జేఏసీ చైర్మన్, ఎస్సీ కార్పొరేషన్ మాజీ చైర్మన్ డాక్టర్ పిడమర్తి రవి అన్నారు. ప్రత్యేక తెలంగాణ రాష్ట్ర ఉద్యమకారుల సమావేశం ఈరోజు బషీర్బాగ్ ప్రెస్ క్లబ్ లో నిర్వహించడం జరిగింది ఈ కార్యక్రమం లో విద్యార్థి జేఏసీ చైర్మన్ పిడమర్తి రవి గారు మాట్లాడుతూ తెలంగాణ సాధనలో కవులు కళాకారులు కంటే విద్యార్థి పాత్ర ఎక్కువగా ఉందని విద్యార్థులు లేకపోతే ఆనాడు తెలంగాణ రాష్ట్ర ఉద్యమం లేదు ఇప్పుడు తెలంగాణ లేదు అని అన్నారు. ఎంతోమంది విద్యార్థి నాయకులు వీరోచిత పోరాటం ఫలితంగానే ఆనాడు రాష్ట్రం సిద్ధించిందని రాష్ట్రం ఆవిర్భవించిన తర్వాత తెలంగాణ ఉద్యమకారులకు ప్రభుత్వాలు సమచిత స్థానం కల్పించలేదని అన్నారు. కాంగ్రెస్ ప్రజా ప్రభుత్వం ఇచ్చిన హామీ ప్రకారం తెలంగాణ రాష్ట్ర ఉద్యమకారులకు 250 గజాల ఇంటి స్థలం మరియు ఉద్యమకారులకు ఇంటికో ఉద్యోగం, అప్పుడు ఉద్యమంలో పాల్గొన్న నాయకులంతా చాలామంది వృద్యాపం, వివిధ ఆరోగ్య సమస్యలతో బాధపడుతున్నందుకు వారికి ఉద్యమకారుల కోటాలో పింఛన్ ఇవ్వాలని డిమాండ్ చేశారు. విద్యార్థి ఉద్యమ నాయకుల పైన మిగిలి ఉన్న అన్ని పోలీస్ కేసులను ఎత్తివేయాలి. డిసెంబర్ 9న దీక్ష నిర్వహిస్తున్నట్లు తెలిపారు. కాకతీయ యూనివర్సిటీ జేఏసీ చైర్మన్ రాజేష్ మాట్లాడుతూ కాకతీయ యూనివర్సిటీ విద్యార్థి నాయకులకు రాజకీయ మరియు ప్రభుత్వంలో సమిచిత స్థానం కల్పించాలని డిమాండ్ చేశారు. లేనిపక్షంలో భారత రాష్ట్ర సమితికి వచ్చిన పరిస్థితి రాబోవు రోజుల్లో కాంగ్రెస్ పార్టీ కూడా ఎదుర్కొంటుందని అన్నారు. జాగో తెలంగాణ రాష్ట్ర అధ్యక్షులు రాములు నేత మాట్లాడుతూ ప్రభుత్వ భూములు ఎక్కడ ఉంటే అక్కడ తెలంగాణ రాష్ట్ర ఉద్యమకారులు ఆధీనం చేసుకొని ఇంటి నిర్మాణాలు చేపట్టాలని ఉద్యమకారులకు పిలుపునిచ్చారు. ఇప్పటివరకు తెలంగాణ రాష్ట్ర ఉద్యమ కారులకు రాష్ట్ర ప్రభుత్వంలో సముచిత స్థానం కల్పించకపోవడం బాధాకరమని కేవలం ఒక సామాజిక వర్గానికే సమిచిత స్థానం కల్పించడం ఆలోచించాల్సిన విషయమని అన్నారు. ఈ కార్యక్రమంలో నాయకులు యాకూబ్ రెడ్డి, దామోదర్, ఫరూక్, జేకె, శ్రీనివాస్ రెడ్డి, ఓయూ నాయకులు ఎమ్‌డీ రహీం, హనుమంతరావు అస్మక శంకర్ సాంబశివ గౌడ్, రమణ, స్టాలిన్, ఉపేందర్, గుంటి ప్రభాకర్, బోరెల్లి సురేష్ గణేష్ ముదిరాజ్, అంజి తదితరులు పాల్గొన్నారు.

# రోడ్డు ప్రమాదాల నివారణకు పటిష్ట చర్యలు

- మంచిర్యాల జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్




మంచిర్యాల ప్రతినిధి, నవంబర్ 20 (జనంసాక్షి) : జిల్లాలో రోడ్డు ప్రమాదాల నివారణకు పటిష్టమైన చర్యలు చేపట్టాలని జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్ అన్నారు. గురువారం మంచిర్యాల జిల్లాలోని నస్పూర్ లో గల సమీకృత జిల్లా కార్యాలయాల భవన సమావేశ మందిరంలో డి.సి.పి. ఎ.భాస్కర్, బెల్లంపల్లి సబ్ కలెక్టర్ మనోజ్ లతో కలిసి పోలీస్, రెవెన్యూ, రవాణా, జాతీయ రహదారులు, రోడ్లు భవనాలు, విద్యుత్, పంచాయతీ రాజ్ శాఖల అధికారులు, మున్సిపల్ కమిషనర్లు, సంబంధిత అధికారులతో రోడ్డు ప్రమాదాల నివారణపై రోడ్డు భద్రత కమిటీ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ ..జిల్లాలో రోడ్డు ప్రమాదాల నివారణ పై పటిష్టమైన చర్యలు చేపట్టాలని తెలిపారు. మున్సిపల్ పరిధిలోని రోడ్లపై చెత్త, ఆటంకాలను వెంటనే తొలగించాలని, ట్రాఫిక్ పోలీసు విభాగం రోడ్లపై అనధికార వాహన నిలుపుదల, నిబంధనల ఉల్లంఘన పట్ల కఠిన చర్యలు తీసుకోవాలని తెలిపారు. రోడ్లపై తక్కువ ఎత్తు గల బీమ్‌లు, తక్కువ విజిబిలిటీ ఉన్న చోట్ల లైటింగ్ ఏర్పాటు చేయాలని, జాతీయ రహదారులపై ప్రమాదాలు జరిగే ప్రాంతాలలో జాగ్రత్త సూచిక బోర్డులు ఏర్పాటు చేయాలని తెలిపారు. రోడ్లపై అదుపు తప్పిన, ఓవర్ లోడెడ్ వాహనాలపై చర్యలు తీసుకోవాలని తెలిపారు. మున్సిపల్ కమిషనర్లు సెల్లార్ స్థలాలు కేవలం పార్కింగ్ కోసం మాత్రమే ఉపయోగించేలా చర్యలు తీసుకోవాలని తెలిపారు. విద్యుత్ శాఖ అధికారులు రహదారుల మధ్య ఏర్పాటు చేసిన విద్యుత్ స్తంభాలను వెంటనే తొలగించాలని తెలిపారు. గ్రామీణ ప్రాంతాల్లో కేజ్ వీల్స్, ట్రాక్టర్ కేజ్ వీల్స్ వినియోగాన్ని నిలిపి వేసేందుకు అవగాహన కార్యక్రమాలు చేపట్టాలని, జిల్లా వ్యాప్తంగా వేగ పరిమితి బోర్డులు, హెచ్చరిక బోర్డులు, జాగ్రత్త సూచనలు ఏర్పాటు చేయాలని సూచించారు. కూరగాయల వ్యాపారులు రోడ్లపై విక్రయాలు చేయకుండా ప్రత్యేక మార్కెట్ స్థలాన్ని గుర్తించి ఏర్పాట్లు చేయాలని మున్సిపల్ కమిషనర్లను ఆదేశించారు. రహదారులపై సంచరించే పశువులను గోశాలలకు తరలించేందుకు మున్సిపల్ అధికారులు పోలీసు శాఖ సమన్వయంతో చర్యలు తీసుకోవాలని తెలిపారు.

# కేసులు పెట్టడంలో బీజేపీ నెంబర్ వన్

- దేశంలో కక్ష్యపూరిత రాజకీయాలు
- బీసీ ఉద్యమం డిల్లీ వరకు చేరాలి..
- సీఎం రేవంత్ రెడ్డి బీసీ బిల్లు అంశంపై మోడీతో చర్చించలి
- ప్రభుత్వాలు మారిన ప్రజా సమస్యలు పరిష్కారం కావడం లేదు
- సీఎం సీఎం అని కవితపై నినాదాలు..



రంగారెడ్డి జిల్లా ప్రతినిధి (జనంసాక్షి) : కేసులు పెట్టడంలో దేశంలో బీజేపీ నెంబర్ వన్ పార్టీ అని దేశంలో కక్ష్యపూరితమైన రాజకీయాలు జరుగుతున్నయాని జాగృతి అధ్యక్షురాలు కల్వకుంట్ల కవిత అన్నారు. గురువారం రంగారెడ్డి జిల్లాలోని శేరిలింగంపల్లి, రాజేంద్రనగర్ మియాపూర్ షాబాద్ షాద్ నగర్ నియోజకవర్గాలలో జనంబాట కార్యక్రమంలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా జాగృతి అధ్యక్షురాలు కవిత మాట్లాడుతూ...తెలంగాణ రాష్ట్రంలో ప్రభుత్వాలు మారిన ప్రజల సమస్యలు పరిష్కారం కావడం లేదన్నారు. సీఎం రేవంత్ రెడ్డి బీసీ బిల్లు అంశంపై ఏనాడు కూడా ప్రధాని నరేంద్ర మోడీతో ఒక్కసారి కూడా చర్చించలేదన్నారు. బీసీల రిజర్వేషన్ల కోసం ఢిల్లీలో యుద్ధం చేయాలన్నారు. కాంగ్రెస్ పార్టీ కామారెడ్డి బీసీ డిక్లరేషన్ హామీ ఉత్తదనన్నరు. బీసీలకు విద్య, ఉద్యోగ ,రాజకీయ రంగాలలో 42 శాతం రిజర్వేషన్లను అమలు చేసే వరకు జాగృతి పోరాటం చేస్తుందన్నారు. కేంద్ర ప్రభుత్వం ఎస్సీ, ఎస్టీ,రిజర్వేషన్లను తొలగించే కుట్ర చేస్తుందన్నారు. బీసీలకు చట్టసభలో రాజ్యాంగపరమైన హక్కులు రావాలన్నారు. బీసీలు ముఖ్యమంత్రులు కావాలన్నారు. తెలంగాణ రాష్ట్రంలో వారసత్వంగా వచ్చిన భూములు పోయాయన్నారు. హైదారాబాద్ ప్రక్కన ఉన్న రంగారెడ్డి జిల్లాలో పేదలకు సొంత ఇల్లు లేని నిరుపేదలు ఉన్నారన్నారు. ప్రభుత్వాలు మారిన పేదల కష్టాలు ఏమాత్రం తీరలేదన్నారు. బస్తీలలో నివసిస్తున్న ప్రజా సమస్యలు పాలకులు పట్టించుకోవడం లేదన్నారు. షాద్ నగర్ ప్రభుత్వ ఆసుపత్రిలో సరైన సౌకర్యాలు సరైన వైద్య సిబ్బంది లేక ఆసుపత్రికి వచ్చే రోగులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని పేదవాళ్లు మాత్రమే ప్రభుత్వ ఆసుపత్రికి వస్తుంటారని అలాంటి వారికి వైద్య సిబ్బంది సకాలంలో స్పందించి సేవలు అందించాలన్నారు ఉమ్మడి మహబూబ్ నగర్ జిల్లా ముఖ్యమంత్రి జిల్లా అని వెంటనే 100 పడకల ఆసుపత్రి ప్రారంభించి పేదలకు న్యాయం చేయాలన్నారు కాంగ్రెస్ ప్రభుత్వం ప్రజలను మభ్యపెట్టే మాటలు మానేసి మంచి చేయాలన్నారు. రాష్ట్రంలో సామాన్యులపై పోలీసుల దురాగతాలు రోజురోజుకు పెరిగిపోతున్నాయన్నారు. ప్రజలకు మొఖం చూపించలేక ప్రతిపక్ష నాయకులపై కేసులు పెడుతున్నారన్నారు కేశంపేట మండలం తొమ్మిది రేకుల గ్రామంలో రీజినల్ రింగ్ రోడ్డు వల్ల భూముల కోల్పోతున్న రైతులను పరామర్శించారు రైతులకు ధైర్యం కల్పించారు పెద్దవాళ్ల భూములు కాపాడేందుకే పేదవాళ్ళ భూములు లాక్కుంటున్నారని రీజినల్ రింగ్ రోడ్డులో భూములు కోల్పోతున్న రైతులకు మేలు జరిగే వరకు పోరాడుతామన్నారు రైతులకు అన్యాయం చేసే వారెవరైనా పోరాటం చేయడానికి రైతులు సిద్ధమవ్వాలన్నరు రీజనల్ రింగ్ రోడ్ కు సంబంధించి మరోసారి రి సర్వే చేయాలని కేంద్రమంత్రి నితిన్ గట్కారిని కలిసి రైతుల సమస్యలపై చర్చించేందుకు కృషి చేస్తానన్నరు ప్రజా సమస్యలను పరిష్కరించే వరకు జాగృతి పోరాటం చేస్తుందన్నారు ఇదే క్రమంలో కవిత జనంబాట కార్యక్రమంలో జాగృతి కార్యకర్తలు పెద్ద ఎత్తున సీఎం సీఎం అంటూ కవితపై నినాదాలు చేశారు.

# సాహిత్య శిఖరం...

## గన్నమరాజు గిరిజా మనోహర్ బాబు



**(74వ జన్మదిన సందర్భంగా హృదయపూర్వక శుభాకాంక్షలు)**

తెలుగు సాహిత్యంలో కొందరు వ్యక్తులు ఒక్క పేరుతోనే ఒక యుగాన్ని గుర్తుచేస్తారు. అలాంటి అపురూప వ్యక్తిత్వం గన్నమరాజు గిరిజా మనోహర్ బాబు. ఆయన పేరు వినగానే మనసులో ముందు 'సహృదయ' సాహిత్య సాంస్కృతిక సంస్థ, ఆ తర్వాత మహాభారత దర్శనం, భాగవత సుధా స్రవంతి, రామకథా పరిమళం, గీతామృతం, ఉపనిషచ్చంద్రిక, శతక కవుల గోష్ఠి, ప్రతాపరుద్ర సభ, పోతన విజయం, గోలకొండ విజయం – ఇలా అనేక సాహిత్య సాంస్కృతిక కార్యక్రమాల సజీవ చిత్రాలు కదలాడతాయి. నటుడు, కవి, రచయిత, ప్రవచనకర్త, సంపాదకుడు, సంస్థాపకుడు, పరిశోధకుడు – ఈ ఏడు ముఖాలతో తెలంగాణ నేల నుంచి పుట్టి ఉభయ తెలుగు రాష్ట్రాల సాహిత్యాకాశాన్ని నిండా వెలిగించిన ధీరఘుంటం ఆయనే. నేడు (నవంబర్ 20) ఆ మహనీయుడి 74వ జన్మదినం. ఈ సందర్భంగా ఆ సాహిత్య సార్వభౌముడి అపురూప సేవా యాత్రను గౌరవపూర్వకంగా స్మరించుకోవడం మన తరానికి ధన్యభాగ్యం.

### ఆలంపూర్ బీజం నుంచి ఓరుగల్లు శిఖరం వరకు

1951 నవంబర్ 20న మహబూబ్‌నగర్ జిల్లా ఆలంపూర్‌లో శకుంతలమ్మ – రామేశ్వరరావు దంపతులకు జన్మించిన గిరిజా మనోహర్ బాబు గ్రామీణ వాతావరణంలోనే ప్రాథమిక విద్య పూర్తి చేశారు. సంస్కృతం ఆ రోజుల్లోనే ఆయన రక్తంలో ఇంకిపోయింది. హైదరాబాద్ ఓరియంటల్ కాలేజీలో తెలుగు–సంస్కృతం పండిట్ డిప్లొమాలు సాధించి, ఉస్మానియా విశ్వవిద్యాలయంలో తెలుగులో ఎం.ఏ. పూర్తి చేశారు. ఆయన చేతి రాత – గుండ్రని దస్తూరీ, కొన్నిసార్లు బాపు లిపి శైలిలో – చూడగా ముచ్చటగా ఉంటుంది. ఆ కాలంలో తెలుగు టైపింగ్ లేని రోజుల్లో సీనియర్ పండితులు తమ పి.హెచ్.డి. సిద్ధాంత గ్రంథాలు ఆయన దస్తూరీలోనే రాయించుకునేవారు.

1978 జనవరి 6న జూనియర్ లెక్చరర్‌గా వృత్తి జీవితం ప్రారంభించిన ఆయన సత్తుపల్లి, ఖమ్మం, వర్ధన్నపేట, మహబూబాబాద్, హుజూరాబాద్, హనుమకొండలో 33 ఏళ్లు అధ్యాపకుడిగా సేవ చేశారు. పాఠ్యపుస్తకాలు బోధించడం మాత్రమే కాదు, విద్యార్థుల మనసుల్లో సాహిత్యం, సంస్కృతి పట్ల అభిరుచి నాటారు. 2009లో రిటైర్‌మెంట్ తర్వాత ఆయన జీవితం పూర్తిగా సాహిత్య సేవకే అర్పితమైంది.

### సహృదయం: సాహిత్య సాంస్కృతిక దీపస్తంభం

1996లో హనుమకొండలో స్థాపించిన 'సహృదయ' సాహిత్య సాంస్కృతిక సంస్థ ఆయన జీవితంలో అతి ముఖ్యమైన అధ్యాయం. వ్యవస్థాపక ప్రధాన కార్యదర్శిగా మొదలై, ఉపాధ్యక్షుడిగా, ఇప్పుడు అధ్యక్షుడిగా 28 ఏళ్లుగా నిర్వహిస్తున్న ఈ సంస్థ పేరుకు తగ్గట్టుగానే హృదయంతో కూడిన సాహిత్యాన్ని ప్రజలకు అందిస్తోంది. గత 28 ఏళ్లలో ఈ సంస్థ ద్వారా జరిపిన కార్యక్రమాలు తెలుగు సాహిత్య చరిత్రలో బంగారు అక్షరాలతో లిఖించదగినవి.

### జ్ఞానయజ్ఞాలు: మహాగ్రంథాలను ప్రజల గుండెలకు

- ప్రాచీన మహాగ్రంథాలను సామాన్యుల భాషలో అందించడంలో ఆయనకు ఎవరూ సాటి రారు.
- మహాభారత దర్శనం – 18 పర్వాలు, 18 మంది పండితులు
- భాగవత సుధా స్రవంతి – 12 స్కంధాలు, 12 మంది విద్వాంసులు
- రామకథా పరిమళం – విశ్వనాథ సత్యనారాయణ 'రామాయణ కల్పవృక్షం'పై 100 రోజుల ప్రవచనాలు
- ఉపనిషచ్చంద్రిక – 10 ఉపనిషత్తులు, 10 రోజులు
- గీతామృతం – 18 అధ్యాయాలు, 18 మంది పండితులు
- వేదసూక్త కౌముది – 10 రోజులు
- రామాయణం – మానవ ధర్మం – బ్రహ్మశ్రీ చాగంటి కోటేశ్వరరావు గారి ప్రవచనాలు

ఈ కార్యక్రమాలు పండితుల కోసం మాత్రమే కాదు, సామాన్య ప్రేక్షకులకు సుపరిచితమైన భాషలో, హృదయానికి హత్తుకునేలా జరిగాయి.

### సజీవ చిత్రణ: చరిత్రను కళ్లకు కట్టిన నటుడు

సాహిత్యాన్ని చదవడం, వినడం మాత్రమే కాదు, కళ్లకు కట్టినట్లు చూపగలిగిన అరుదైన నైపుణ్యం ఆయనది. "శతక కవుల గోష్ఠి", "ప్రతాపరుద్ర సభ", "రామసభ", "పోతన విజయం", "కృష్ణాపత్రిక దర్బారు", "వందే మాతరం", "గోలకొండ విజయం" – ఈ రూపకాల్లో చారిత్రక కవుల పాత్రలు ధరించి, వారి సంభాషణలు, వ్యక్తిత్వాన్ని ప్రేక్షకుల ముందుకు తెచ్చిన వైనం అద్భుతం. హనుమకొండ ప్రభుత్వ జూనియర్ కళాశాలలో "అల్లూరి సీతారామరాజు" ఏకపాత్రాభినయం ఆనాటి విద్యార్థుల గుండెల్లో శాశ్వత ముద్ర వేసింది.

### లిఖిత వారసత్వం: పుస్తకాల్లో శాశ్వతం

సంపాదకత్వంలో వెలువడిన గ్రంథాలు తెలుగు సాహిత్య భాండాగారానికి అమూల్య కానుకలు.

'రసహృదయ', 'కథకు శతమానం', 'శతక సాహిత్యం – సామాజిక నైతిక విలువలు', కేంద్ర సాహిత్య అకాడమీ పురస్కార గ్రంథం 'గడియారం రామకృష్ణ శర్మ ఆత్మకథ', 'తెలుగు కథ వెలుగులు', 'ఓరుగల్లు కళా వైభవము' – ఇవి ఆయన సంపాదకీయ నైపుణ్యానికి నిదర్శనాలు. స్వీయ రచనలు 'సాహిత్య సుధా చయనిక', 'శతక సమీరం', 'వెలుగు దారి' సరళంగా, గాఢంగా ఉంటాయి.

### పురస్కారాలు: సేవకు సమాజం ఇచ్చిన గౌరవం

సాహితీ విరించి, తెలుగు విశ్వవిద్యాలయం కీర్తి పురస్కారం, దేవరకొండ బాలగంగాధర తిలక్ పురస్కారం, సంకీర్తన జీవన సాఫల్య పురస్కారం, శాతవాహన విశ్వవిద్యాలయం పురస్కారం, తెలుగు భాషా దినోత్సవ పురస్కారం, జాతీయ సాహిత్య పరిషత్ పురస్కారం – ఈ గౌరవాలు ఆయన సేవకు సమాజం ముడిపెట్టిన బంగారు బిరుదులు.

### ఇప్పటికీ మారుమోగే స్వరం


74 ఏళ్ల వయసులోనూ ఆకాశవాణి, దూరదర్శన్, భక్తి టీవీ, ఎస్వీబీసీ, ఎఫ్‌ఎం రేడియోలు, తిరుమల బ్రహ్మోత్సవాలు, గోదావరి పుష్కరాలు, శ్రీరామనవమి వ్యాఖ్యానాలు – ఆయన స్వరం ఇప్పటికీ తెలుగు ఇళ్లల్లో మారుమోగుతోంది. హైదరాబాద్ నుంచి విశాఖ వరకు, విజయవాడ నుంచి రాజమండ్రి వరకు సాహిత్య వేదికలన్నీ ఆయన ప్రసంగం కోసం ఎదురుచూస్తాయి.

గన్నమరాజు గిరిజా మనోహర్ బాబు ఒక్క మాటలో చెప్పాలంటే % సజీవ సాహిత్య వారసత్వం. ఆయన జీవితం సాహిత్య సేవకు సమర్పితమైన మహావ్రతం. ఆ మహనీయుడికి జన్మదిన శుభాకాంక్షలు. ఆయన స్ఫూర్తి, సేవ మరెన్నో దశాబ్దాలు తెలుగు సాహిత్యాన్ని, సంస్కృతిని వెలిగించాలని మనసారా కోరుకుందాం. (సారూ... మీ సేవకు, మీ స్ఫూర్తికి నమస్సుమాంజలి!)



డాక్టర్ కోలాహలం రామ్ కిశోర్
9849328496.

## గ్రంథాలయ శాస్త్రం: డిజిటల్ యుగంలో బంగారు భవిష్యత్తు



పాత కాలంలో "లైబ్రేరియన్" అంటే పుస్తకాల మధ్య కూర్చుని దుమ్ము దులిపే వ్యక్తి అనే ఇమేజ్ ఉండేది. ఇవాళ ఆ చిత్రం పూర్తిగా మారిపోయింది. ఇప్పుడు గ్రంథాలయ, సమాచార శాస్త్రం అంటే బిగ్ డేటా, ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్, క్లౌడ్ లైబ్రరీలు, డిజిటల్ ఆర్కైవ్‌లు, ఓపెన్ యాక్సెస్, జ్ఞాన నిర్వహణ, డేటా క్యూరేషన్, మెటాడేటా స్టాండర్డ్స్, టాక్సానమీ డెవలప్‌మెంట్ %–% ఇవన్నీ కలిసిన అత్యాధునిక రంగం. గూగుల్ నుంచి ఐఎస్‌ఆర్‌ఓ వరకు, హార్వర్డ్ నుంచి కాకతీయ యూనివర్సిటీ వరకు, యునెస్కో నుంచి బైజూస్ వరకు ఈ రంగం నిపుణులకు ఎర్ర తివాచీ బిఛ్చాయిస్తోంది. బి.ఎల్.ఐ.సీ., ఎం.ఎల్.ఐ.సీ., పి.జీ.డి.ఎల్.ఏ.ఎన్. కోర్సులు పూర్తి చేసిన విద్యార్థులకు దేశంలోనే కాకుండా విదేశాల్లోనూ ఆకర్షణీయమైన ఉద్యోగాలు, భారీ జీతాలు ఎదురుచూస్తున్నాయి.

### కోర్సుల వివరాలు – మూడు మెట్లు, మూడు రకాల భవిష్యత్తులు

**బ్యాచిలర్ ఇన్ లైబ్రరీ అండ్ ఇన్ఫర్మేషన్ సైన్స్ (బి.ఎల్.ఐ.సీ.)**

ఇది రంగానికి మొదటి అడుగు. గ్రంథాలయ నిర్వహణ, డ్యూయీ డెసిమల్ వర్గీకరణ (డీడీసీ), యూనివర్సల్ డెసిమల్ క్లాసిఫికేషన్ (యూడీసీ), కేటలాగింగ్ నియమాలు (ఏఏసీఆర్–2), ప్రాథమిక డిజిటల్ టూల్స్, రిఫరెన్స్ సర్వీసెస్, యూజర్ స్టడీస్ – ఇవన్నీ నేర్పిస్తారు. ఈ డిగ్రీతోనే ప్రభుత్వ పాఠశాలలు, జూనియర్ కాలేజీలు, చిన్న గ్రంథాలయాల్లో జూనియర్ లైబ్రేరియన్, అసిస్టెంట్ లైబ్రేరియన్ పోస్టులు సాధ్యమవుతాయి.

**మాస్టర్ ఇన్ లైబ్రరీ అండ్ ఇన్ఫర్మేషన్ సైన్స్ (ఎం.ఎల్.ఐ.సీ.)**

ఇది రంగంలో బలమైన రెక్కలు అందించే డిగ్రీ. డిజిటల్ లైబ్రరీలు, ఇన్స్టిట్యూషనల్ రిపాజిటరీలు, జ్ఞాన నిర్వహణ (నాలెడ్జ్ మేనేజ్‌మెంట్), ఇన్ఫర్మేషన్ ఆర్కిటెక్చర్, డేటా క్యూరేషన్, రీసెర్చ్ డేటా మేనేజ్‌మెంట్, ఓపెన్ ఎడ్యుకేషనల్ రిసోర్సెస్ (ఓఈఆర్), బిబ్లియోమెట్రిక్స్, సైంటోమెట్రిక్స్ – ఇలాంటి అధునాతన అంశాలు ఉంటాయి. ఈ డిగ్రీ ఉంటే లైబ్రేరియన్, ఇన్ఫర్మేషన్ సైంటిస్ట్, డిజిటల్ ఆర్కైవిస్ట్, రీసెర్చ్ డేటా మేనేజర్ లాంటి ఉన్నత పోస్టులు సొంతమవుతాయి.

**పోస్ట్ గ్రాడ్యుయేట్ డిప్లొమా ఇన్ లైబ్రరీ ఆటోమేషన్ అండ్ నెట్‌వర్కింగ్ (పి.జీ.డి.ఎల్.ఏ.ఎన్.)**

ఇది టెక్నాలజీ ఆధారిత గ్రంథాలయాలకు ప్రత్యేకంగా తయారు చేసే కోర్సు. కోహా, లిబ్‌సిస్, ఈ–గ్రంథాలయం, డి–స్పేస్, గ్రీన్‌స్టోన్, ఓమేకా, ఆర్‌ఎఫ్‌ఐడీ టెక్నాలజీ, బార్‌కోడ్ సిస్టమ్స్, క్లౌడ్ లైబ్రరీ సొల్యూషన్స్, మార్క్–21, డబ్లిన్ కోర్, ఓఏఐ–పీఎంహెచ్ ప్రోటోకాల్స్ – ఇవన్నీ లోతుగా నేర్పిస్తారు. ఈ కోర్సు పూర్తి చేస్తే ఐటీ–ఆధారిత గ్రంథాలయాల్లో సీనియర్ టెక్నికల్ ఆఫీసర్, సిస్టమ్ లైబ్రేరియన్, డిజిటల్ రిసోర్స్ మేనేజర్ పోస్టులు సులువుగా దక్కుతాయి.

### ఉద్యోగ అవకాశాలు – ఎక్కడెక్కడ ఎదురుచూస్తున్నాయి?

**ప్రభుత్వ, అర్ధ ప్రభుత్వ రంగం :** రాజా రామ్‌మోహన్ రాయ్ లైబ్రరీ ఫౌండేషన్, జాతీయ గ్రంథాలయం (కోల్‌కతా), ఢిల్లీ పబ్లిక్ లైబ్రరీ, రాష్ట్ర కేంద్రీయ గ్రంథాలయాలు, జిల్లా గ్రంథాలయాలు. యూజీసీ–నెట్/సెట్ క్వాలిఫై అయితే కేంద్రీయ విశ్వవిద్యాలయాలు (ఢిల్లీ, హైదరాబాద్, జేఎన్‌యూ), రాష్ట్ర విశ్వవిద్యాలయాలు (ఉస్మానియా, కాకతీయ, ఎస్వీ యూనివర్సిటీ), డీమ్డ్ యూనివర్సిటీలు, ఇంజినీరింగ్–మెడికల్–లా కాలేజీల్లో లైబ్రేరియన్, డిప్యూటీ లైబ్రేరియన్, అసిస్టెంట్ లైబ్రేరియన్ పోస్టులు. ఐసీఏఆర్, సీఎస్ఐఆర్, డీఆర్‌డీఓ, ఐఎస్‌ఆర్‌ఓ, ఐసీఎంఆర్, డీఎస్టీ, డీబీటీ, నీతి ఆయోగ్, పార్లమెంటు గ్రంథాలయం లలో ఇన్ఫర్మేషన్ ఆఫీసర్, సైంటిఫిక్ ఆఫీసర్, డాక్యుమెంటేషన్ ఆఫీసర్ పోస్టులు. భెల్, ఓఎన్‌జీసీ, ఎన్టీపీసీ, ఐఓసీ, ఎస్ఏఐఎల్, హెచ్ఏఎల్ లాంటి పీఎస్‌యూల్లో ఇన్ఫర్మేషన్ మేనేజ్‌మెంట్ స్పెషలిస్ట్, టెక్నికల్ ఇన్ఫర్మేషన్ ఆఫీసర్ పోస్టులు.

**ప్రైవేట్ రంగం – ఇక్కడే అసలు బంగారు గని**

గూగుల్, మైక్రోసాఫ్ట్, అమెజాన్, ఐబీఎం, యాక్సెంచర్, డెలాయిట్, పీడబ్ల్యూసీ, కేప్‌జెమినీ లలో రీసెర్చ్ అనలిస్ట్, ఇన్ఫర్మేషన్ ఆర్కిటెక్ట్, డేటా క్యూరేటర్, టాక్సానమీ స్పెషలిస్ట్, కంటెంట్ స్ట్రాటజిస్ట్ పోస్టులు. ఫార్మా కంపెనీలు – డాక్టర్ రెడ్డీస్, హెటెరో, డివీస్, నోవార్టిస్, ఫైజర్ లలో ఆర్ అండ్ డీ డాక్యుమెంటేషన్, క్లినికల్ డేటా మేనేజ్‌మెంట్, రెగ్యులేటరీ అఫైర్స్ డాక్యుమెంటేషన్. మీడియా హౌస్‌లు – ఈనాడు, సాక్షి, హిందూ, టైమ్స్ ఆఫ్ ఇండియా, ఎన్డీటీవీ, బీబీసీ లలో డిజిటల్ ఆర్కైవిస్ట్, కంటెంట్ క్యూరేటర్, మీడియా రీసెర్చ్ అనలిస్ట్.



డాక్టర్. జీ. రాధికా రాణి,
అసిస్టెంట్ ప్రొఫెసర్, హెడ్
డిపార్ట్మెంట్ ఆఫ్ లైబ్రరీ అండ్
ఇన్ఫర్మేషన్ సైన్స్, కాకతీయ
యూనివర్సిటీ, వరంగల్.

## నా సలహా!

మీ ఆరోగ్యం మీ చేతిలో
మీ ఆరోగ్యం మీ నడకలో
మీ ఆరోగ్యం మీ పడకలో
మీ ఆరోగ్యం మీ నిద్రలో
మీ ఆరోగ్యం మీ తిండిలో

మీ ఆరోగ్యం మీ ఉప్పులో
మీ ఆరోగ్యం మీ నూనె లో
మీ ఆరోగ్యం మీ నీటి లో
మీ ఆరోగ్యం మీ ధ్యానంలో
మీ ఆరోగ్యం మీ ఆసనాల్లో
మీ ఆరోగ్యం ఎండపొడ లో

మీ ఆరోగ్యం విటమిన్స్ లో
మీ ఆరోగ్యం ప్రోటీన్స్ లో
మీ ఆరోగ్యం పండ్ల లో

మీ ఆరోగ్యం ఆకుకూరల్లో
మీ ఆరోగ్యం కోడిగుడ్లలో
మీ ఆరోగ్యం తెల్లసొనలో
ఇప్పుడు పచ్చసొన లో

మీ ఆరోగ్యం మీ నవ్వులో
అ హ హ హ ఆహా హా హా
నవ్వండి నవ్వండి నవ్వండి
లోపలపడుస్తూనేఉంటారు
సమస్యలెక్కడికి పోతాయి!

అందరూ భిషగ్రత్నలే!
వైద్య శిఖామణులే!
వారిచ్చిన 'సలహా'లు
మనకు శిరోధార్యాలు!
నాసలహాకూడావినండి
మీ ఆరోగ్యం మీ 'బుద్ధి' లో!
బుద్ధులు మంచివి కాకపోతే
మీ సుద్దులు మారిపోతాయి

మీ చేతలు మారిపోతాయి!
బుద్ధి అన్నిటికి మూలం!
దాన్ని సరిజేసు కోండి -మీకు
నూరేళ్లు ఆరోగ్యం ఖాయం!!

మన బుద్ధులనిండా కులాలు
మతాలు ఎక్కువతక్కువలు
ప్రక్క వాళ్ళమీద ఈర్ష్య లు
అరిషడ్వర్గాలతో నిండిపోతే
నువ్వెన్నిచేసినా ఏమీలేదు!

అవినీతి వదలరు
లంచాలు వదలరు
నిజాయితీ అనేదే లేదు
డబ్బుకోసం ఏ 'నీచం'
ఐనా సిద్ధపడతారు!
అందుకోసం ఎంత
టెన్షన్ ఐనా పడతారు!
గుండెజబ్బులాగుతాయా

అయ్యప్ప'మాల'వేస్తారు
'మాల'అయ్యప్పను
గుళ్ళోకి రానివ్వరు!
అందరంహిందుఅంటారు
ఇంకెందుకు ఆ మాల'?
వివక్ష బుద్ధి మారదు!

ప్రేమ కరుణ దయ సహకారం
సమభావం సౌభ్రాత్రంవీటితో
నీ హృదయం నిండి పోవాలి
రోగాన్ని రమ్మను చూద్దాం!
రాదు!మీరంటే దానికి భయం

ఒక 'మహాపురుష్ ' - స్త్రీ
బుద్ధి ప్రళయాంతకమన్నాడు
వాడి'బుద్ధి'పురుషాహంకారం
మరొకడిది కులాహంకారం
మత,ధన అహంకారాలు!!
ఇవన్నీ కుళ్లబెట్టుకుంటే

మీరు ఏం చేసినా ఆరోగ్యం
శ్రీమతేరామానుజాయన్నమః
మీ చేతిలో మాత్రం ఉందా?
ఏంజరిగినా 'దైవేచ్ఛ'కదూ!

(అన్యదా భావించకండి
హాస్యాన్ని ఎంజాయ్
చెయ్యండి )



-తమ్మినేని అక్కిరాజు
డల్లాస్ (అమెరికా )

## దేశం

సిరుల అహం
పైడి టాయిలెట్ కుండీ
నీళ్లి ఈల్లుట
పేదల దేశం
పనికి పాట్లు
కూలినాలికి పోట్లు
డొక్కల గీతం
ఆకలిదేశం
పేగు రాగాలు
శ్మశానపు దారులు
సంపన్న దేశం
ఆకలి బాట
జనతా విప్లవాలు
సర్వకాలాలు
సమతా దేశం

రేడియమ్
9291527757

# మానవతా వాదానికి ఎల్లలు లేవు

**అన్నింటిని పట్టించుకునేదే మానవతా వాదం**
**అనుబంధాలు సంబంధాలే అన్నిటిలో కీలకం**
**అన్నిటిని పట్టించుకున్నపుడే వాటి పై పట్టు ఉంటుంది.**
**సంబంధాలు తెగి పోయాక మిగిలేది శూన్యమే!!**

మానవతా వాదానికి ఏ ఎల్లలు లేవు. మానవతా వాదానికి మనుషులంతా ఒకటే. కుల మతాల వివక్షలు, వర్గ భేదాలు, జాతి భేదాలు, స్త్రీ పురుష భేదాలు, దేశాల సరిహద్దులు లేనిదే మానవతా వాదం. ప్రతి మనిషి పట్ల స్పందించడమే మానవీయ సంస్కృతి. నా భాష కాదు, నా దేశం కాదు. నా కులం వర్గం కాదు అనుకోవడం మానవతావాదం కాదు. మహోన్నత మానవీయ సంస్కృతికి తెలుపు, నలుపు, ఎరుపు తేడాలు లేవు. అదే నిజమైన మానవతా వాదం.

ఉన్నవాల్లు లేని వాల్లు, అంటూ కార్మికులు పారిశ్రామిక వేత్తలు, కర్షకులు పని పాటల వాల్లు, ఆ దేశం ఈ దేశం, ఆ కులం, ఈ కులం, ఆ మతం ఈ మతం అంటూ వెతికి పట్టుకొని స్పందించడం మానవతా సంస్కృతికి పరిధులు, పరిమితులు గిరి గీసుకోవడమే. అవి మనిషిని గిడస బారుస్తాయి. ఉదాత్త మానవుడిని కురచ మానవుడిగా కుదిస్తాయి. రెడ్ క్రాస్, స్కౌట్, ఎన్‌సిసి, ఎన్‌ఎస్‌ఎస్ వంటి సంస్థలు మానవీయ విలువలు, సంస్కృతి నుండి ఆవిర్భవించాయి.

రాజ్యం రాజ్యాంగం పార్టీలు ఉద్యమాలు అన్నిటిని అందరిని పట్టించుకోవాలి. అందరిని పట్టించుకోవాలి. భారత రాజ్యాంగం అన్నిటిని పట్టించుకుంటుంది. అందరిని పట్టించుకుంటుంది. ఏదైనా తేడా వస్తే ప్రతి పక్షాలు, పత్రికలు, న్యాయ వ్యవస్థ, ఉద్యమాలు పట్టించుకుంటాయి. పట్టించుకోవాలి. అన్ని దేశాల జాతుల వేదికైన ఐక్య రాజ్య సమితి అన్నిటిని పట్టించుకోవాలి. కాని పట్టించు కోవడం లేదు.

దేన్నయినా పట్టించుకోనపుడు, మార్చాలనుకున్నపుడు సంఘ సంస్కరణలు , అనేక ఉద్యమాలు ముందుకు వస్తాయి. పరిష్కరించాలని కోరుతాయి. లేదా తామే పరిష్కారానికి పూను కుంటాయి. సమాజాన్ని మార్చుతాయి. మానవతా వాదులు అన్నిటి పట్ల స్పందించాలి. అన్నింటిని , అందరిని పట్టించుకోవాలి. ప్రతిదీ పట్టించుకున్నపుడే వాటిలో మానవీయ సంస్కృతి , అనుబంధాలు, మానవీయ ప్రేమ వెల్లి విరుస్తాయి.; ఒదరు పని మనుషులను మనుషులుగా చూడరు. పేదలను కొందరు అరే ఒరే, ఒసే ఏమే అంటూ కించ పరుస్తారు. అవమానిస్తారు. ఆత్మ విశ్వాసం దెబ్బ దీస్తారు. మీది చిన్న కులం, అంటరాని కులం అంటూ అవమానిస్తారు. ఆత్మ విశ్వాసం దెబ్బదీస్తారు. అలాంటి వారంతా మానవత్వం కోల్పోయిన క్రూర , దుష్ట మానవులు.

### అనుబంధాలు సంబంధాలే అన్నిటిలో కీలకం

పిల్లలను తల్లిదండ్రులు పట్టించుకుంటేనే వారిపై పట్టు ఉంటుంది. అది అనుబంధం కావచ్చు. ప్రేమ కావచ్చు. వారి ఆలన పాలన, ఆరోగ్యం, అవసరాలు, ఆలోచనలు లక్ష్యాలు ఎప్పటికప్పుడు పట్టించుకుంటేనే వారి మధ్య బంధం, అనురాగం, అనుబంధం కొనసాగుతుంది. లేని ఎడల వాళ్ల ఇష్టం వచ్చినట్టు తెలిసి తెలియక అనేక తప్పులు చేయ వచ్చు. గాలికి ధూళికి పెరగవచ్చు. గంజాయి, సిగరెట్లు మద్యానికి మలుపు తిరగవచ్చు. అట్లే ఉపాధ్యాయులు విద్యార్థులను పట్టించుకుంటేనే వారిపై పట్టు ఉంటుంది. గురు శిష్య సంబంధాలు, స్ఫూర్తి గౌరవాలు కొనసాగుతాయి. రాజకీయ నాయకులు, పార్టీలు ప్రజల సమస్యలను, అవసరాలను, ఆశలను, ఆలోచనలను పట్టించుకుంటేనే ప్రజలపై పట్టు ఉంటుంది. సజీవ సంబంధాలు కొనసాగుతాయి. అది చాతగాని వాల్లు అప్పటికప్పుడు పైసలు ఇచ్చి, తాగిచ్చి, తినిపిచ్చి, ఊరికి చందాలిచ్చి, ఓట్లు రిగ్గింగ్ చేసి ఓట్లేయించుకుంటారు.

మానవీయ సంస్కృతి , విలువలు, కళలు, శాస్త్రాలు, సాహిత్యం, సైన్సు, అభివృద్ధి , సంక్షేమం, నూతన అన్వేషణలు, డిస్కవరీలు, తదితరాలను పట్టించుకుంటేనే వాటిపై పట్టు ఉంటుంది. పరస్పర సంబంధాలు, అభివృద్ధి ఎదుగుల సాధ్యమవుతుంది. అంతదాకా మానవ సమాజం సాధించిన వేమిటో తెలుసుకొని పట్టించుకొని కృషి చేస్తే ఆ రంగాలపై పట్టు ఉంటుంది. ఆ పట్టు ఆధిపత్యం కావచ్చు. అనుబంధం, అనురాగం, నూతన అన్వేషణలకు అవకాశం కావచ్చు. ఏదైనా పట్టించుకొని సంబంధ బాంధవ్యాలు కొనసాగిస్తేనే పరస్పరం ఐక్యత, సదవగాహన కంటిన్యూ అవుతుంది. అది కొరవడితే అవి ఎండిపోతాయి. బిర్ర బిగుసుకు పోతాయి. భార్యా భర్తలైనా, తల్లిదండ్రులు పిల్లలైనా, కార్మికులు పారిశ్రామిక వేత్తలైనా , ఉపాధ్యాయులు విద్యారథులైనా పరస్పర సంబంధాలు తెగిపోతే మిగిలేది ఏమిటి?!

కాంగ్రెస్ పార్టీ దశాబ్దాల పాటు గెలిచి పాలించి ఇపుడు ఓడిపోతున్నదంటే ప్రజలతో సజీవ సంబంధాలు కొడిగట్టుకు పోయాయని అర్థం. కమ్యూనిస్టులకు నక్సలైట్లకు, మావోయిస్టులకు, బీయస్పీ, జనతా దళ్ పార్టీలకన్నిటికీ ఇదే వర్తిస్తుంది.

### మార్క్సిస్టులు వైరుధ్యాలను పట్టించుకొని సంబంధాలను వదిలేసారు.

మార్క్సిస్టులకు, కమ్యూనిస్టులకు పరిష్కారం కన్నా మడి కట్టుకొని దడి కట్టుకోవడం బాగా ఇష్టం. విడిపోయి బతకడం అంటే మరీ ఇష్టం. ప్రపంచ కార్మికులు ఏక కమ్మంటారు. కాని తాము వందల ముక్కలుగా విడి పోతారు. విడి పోవడానికి సాకులు వెతుకుతారు. కలిసి పని చేయడానికి అవకాశాలు వెతకరు. ఇలా ఎందుకు జరుగుతుంది? కమ్యూనిస్టులు ఎక్కువగా సిద్దాంతాలు చెప్తారు. సిద్దాంతాలను పట్టించుకుంటారు. ఇంటి సంగతులు మాట్లాడుమంటే ప్రపంచ సంగతులు మాట్లాడుతారు. అలా ప్రపంచాన్ని ప్రపంచ సిద్దాంతాలను ప్రపంచ ఉద్యమాలను పట్టించుకుంటారు. వాటికనువుగా ఇంటిని విశ్లేషిస్తారు. ఎవరైనా తన భార్య ఆరోగ్యం గురించి పట్టించుకుంటారు. కొందరు తమ దొర, భూస్వామి భార్య ఆరోగ్యం గురించి, నీళ్లు పోసుకున్న విషయం గురించి ఎన్నో నెల అని చర్చిస్తూ తన భార్య ఆరోగ్యం గురించి పెద్ద సమస్యే కాదన్నట్టు ప్రవర్తిస్తారు. కమ్యూనిస్టులు మార్క్సిస్టులు కూడా దేశీయ సమస్యలు సమస్యలే కాదన్నట్టు అంతర్జాతీయ విషయాలు చర్చిస్తూ విభేదిస్తూ విడి పోతుంచారు. అంతర్జాతీయ పరిస్తితులను బట్టి , ఆ కదలికలు జ్ఞానాన్ని బట్టి స్థానిక దేశీయ సంగతులను పట్టించుకుంటారు. అట్లా అని వీరికి అంతర్జాతీయంగా పట్టు ఏమీ లేదు.

### మార్క్సిజం ఆనాడు అన్నిటిని పట్టించుకుంది కానీ!

మార్క్సిజం అలా అంతర్జాతీయ సిద్దాంతంగా ప్రారంభమైంది. ఆనాటికి తమకు కనపడ్డ సిద్దాంతాలను, ఉద్యమాలను, దేశాలను పట్టించుకున్నారు మార్క్స్, ఎంగెల్సు. అట్లా వారు మార్క్సిజంలో డార్వినిజం కలపుకున్నారు. హెగెలిదం కలపుకున్నారు. అరిస్టాటిలిజంను కలుపుకున్నార. లుడ్విగ్ ఫ్యూబా ఇజం కలుపుకున్నారు. అలెగ్జాండ్రా కొలెలొంటాయ్ ను కలుపుకున్నారు. ఫ్రెంచి సోషలిజం, సోషలిస్టు ప్రౌధాన్ ను విమర్శిస్తూనే కలుపుకున్నారు.. ఏన్సెంట్ సొసైటీ మోర్గాన్ ను కలుపుకున్నారు. మోర్గాన్ పరిశోధననే పునాదిగా చేసుకున్నారు. బ్లాంక్విస్టులను విమర్శిస్తూనే కలుపుకున్నారు. ఆ తరువాత లెనిన్ కుపుకున్న వాటికి లెనినిజం అని పేరు పెట్టి లెనినిజం ను కలుపుకున్నారు. అట్లా మావో ఆచరణను, ఆలోచనలను మావోఇజం అని పేరు పెట్టి మావో ఇజంను కలుపుకున్నారు. వీరద్దరు దేశ అధినేతలయ్యారు గనక వాల్ల పేర పెట్టి మరీ కలుపుకున్నారు. అధికారంలో లేని మార్క్సిస్టులు చెప్పినవి, ఆచరించినవి కలుపు కోలేదు. అట్లా మార్క్సిస్టు అయిన గ్రామ్సీని , జార్జి లూకాస్ ను కలుపు కోలేదు. ఫెమినిజం ను కలుపు కోలేదు. బేద్కరి జంను కలుపు కోలేదు. అధికారంలో లేరని కలుపు కోలేదా? మరి ఎందుకు కలుపు కోలేదు? ఆయా కాలాల్లో మార్క్స అనంతరం కొత్త పరిస్థితులలో ముందుకు తెచ్చిన, మార్క్సిస్టు అయిన యం ఎన్ రాయ్ రాయిజంను ఎందుకు కలుపు కోలేదు. సైమన్ ది బోవర్ గారి ఫెమినిజం ను ఎందుకు కలుపు కోలేదు? జాతుల సమస్యను కలపుకున్నారు. కుల సమస్య ను అందుకు పరిష్కారం చూపిన అంబేద్కరిజంను ఎందుకు కలుపుకోలేదు? భక్తి ఉద్యమాలను కలుపుకున్నారు. బుద్దిజం ను ఎందుకు కలుపు కోలేదు? క్యాపిటలిజానికి పరిష్కారం ను చూపారు. మతవాదానికి పరిష్కారం చూపిన పెరియార్ రామస్వామి నాయకర్ను ఎందుకు కలుపుకోలేదు. బిర్సా ముండాను, కొమురం భీంను కలుపకున్నారు. అందరికీ విద్య అనే శాంతియుత నిశ్శబ్ద విప్లవం తెచ్చిన నారాయణ గురువును ఎందుకు కలుపు కోలేదు? మార్టిన్ లూదర్ కింగ్ జూనియర్ ను ఎందుకు కలుపు కోలేదు. ప్రజాస్వామ్యానికి నిర్వచన మిచ్చిన అబ్రహాం లింకన్ ను ఎందుకు కలుపు కోలేదు? శాంతి అహింసలతో సాధించ వచ్చున్నగాంధీని ఎందుకు కలుపు కోలేదు? వీరికి పరిష్కారం కన్నా సిద్దాంత ఆధిపత్యం ముఖ్యమా? కలుపుకుంటే వాల్ల ముళ్లేమైనా పోతుందా?

విద్యయే విముక్తి సాధనం అన్న మహాత్మా జ్యోతిబా ఫూలేను ఎందుకు కలుపు కోలేదు. ? వీరందరిని కలుపు కోవడంలో మార్క్సిస్టులకున్న అవరోధాలేమిటి? శరద్ పాటిల్ ఆదిమ కమ్యూన్ అంటూ ఎన్నడూ లేదని నిర్ధారిస్తే సత్యాన్ని ఎందుకు అంగీకరించడం లేదు? సమగ్ర సామాజిక వికాసమే సమగ్ర సామాజిక విప్లవం అని ఆచరించి చూపిన మార్క్సిస్టు శంకర్ గుహ నియోగిని ఎందుకు అంగీకరించడం లేదు? మార్క్సిస్టులు మంది దగ్గర ఉద్యోగాలు చేయడం ఎందుకు? తామే ఆరెసెస్ వలె,




పెరియార్ అనుచరుల వలె, తామే స్వయంగా స్కూల్లు పెట్టలేదు. తామే ఎందుకు ఉపాధి కల్పించే స్థాయికి సహకార రంగాన్ని అభివృద్ధి పరచ లేదు? అందుకున్న ఆచరణాత్మక అవరోధాలేముటి? అందరికి విద్య కోసం మార్క్సిస్టులు స్వయంగా బడులు కాలేజీలు , వైద్యం కోసం వైద్యశాలలు ఎందుకు నడపడం లేదు? సహకార వ్యవస్థలో పని చేసి గొప్ప ఆదర్శాలను ఎందుకు ఆచరణలో పెట్టడం లేదు? సర్పంచులుగా గ్రామాలను ఆదర్శ వంతంగా ఎందుకు తీర్చి దిద్దడం లేదు?

మార్క్సిజం మానవాళి కోసం అయినపుడు మానవులందరి సమస్యల కోసం అందరిని ఎందుకు కలుపుకొని పోవడం లేదు? ఇలా పట్టించుకొని పట్టు ఉంచుకోక పోవడం వల్ల

### అందుకే ప్రజలు ఓట్లు వేయడం లేదు. మద్దతు ఇవ్వడం లేదు.

వ్యక్తిగత ఆదర్శాలతో, త్యాగాలతో ప్రజల జీవన ప్రమాణాలు పెరుగవు. ప్రజల జీవన ప్రమాణాలు పెంచే కృషి చేస్తేనే పెరుగుతాయి. జీవితం గెలుచుకునే బాట చూపి మద్దతుగా వెంట నడిస్తేనే ప్రజలు ఎదుగుతారు. గౌరవిస్తారు. గుండెల్లో పెట్టుకుంటారు. ప్రజల కష్ట సుఖాల్లో పాలు పంచుకుంటూ ఉన్న సితినుంచి అత్యున్నత స్థితికి ఎదిగించడమే అసలు కర్తవ్యం. అందుకు అవరోధంగా నిలిచే సిద్దాంతాలను, భావాలను, భౌతిక పరిస్తితులను మార్చుకుంటూ వెళ్లడమే!! !! ప్రతిదీ మారుతుంది అని చెప్పే మార్క్సిజం తనను తాను మార్చుకోలేక పోవడమే, కాలాను గుణంగా అన్నిటిని కలుపుకొని అందరిని కలుపుకొని ఎదగ లేక పోవడమే వారి విషాదం. మానవతా వాదులు అన్నిటిని పట్టించుకుంటారు. పట్టించుకోవాలి. ఏ కులానికో మతానికో, జాతికో దేశానికో వర్గానికో, జెండర్ కో పరిమితమై కుదించుకు పోతే వారిని మిగతా సమాజం ఎందుకు పట్టించుకుంటుంది? ఎవరికి వారు ఆలోచించుకోవాలి. ఎవరినీ పట్టించు కోకుండా, దేన్నీ పట్టించు కోకుండా...తనకు కష్టం వచ్చినపుడు అందరు కావాలని సహకరించాలని ఏడిస్తే అపుడు ఎవరు కలిసి వస్తారు? అలా కలిసి వచ్చే వారే మానవతావాదులు.



- బి ఎస్ రాములు
సామాజిక తత్వ వేత్త
ఫో: 8331966987

# మతోన్మాదుల అరాచాకాలపై పోరాడేది కమ్యూనిస్టులే..

- ఈసీఐఎల్ చేరుకున్న సిపిఐ బస్సు జాతా
- ఘన స్వాగతం పలికిన నేతలు



**కాప్రా, నవంబర్ 20 (జనం సాక్షి) :** దేశంలో రానున్న రోజులలో మతోన్మాదుల మెడలు వంచేది కమ్యూనిస్టులేనని సిపిఐ రాష్ట్ర సహాయ కార్యదర్శి ఈటీ. నర్సింహా అన్నారు.డిసెంబర్ 26వ తేదీన ఖమ్మంలో జరగనున్న సీపీఐ శతవసంతాల ముగింపు బహిరంగ సభ సందర్భంగా సీపీఐ రాష్ట్ర సమితి ఆధ్వర్యంలో బాసర నుండి ప్రారంభమైన సీపీఐ బస్సు జాతా మేడ్చల్ జిల్లా ఈసీఐఎల్ చేరుకుంది. ఈసీఐఎల్ లోని అంబేద్కర్ కూడలి వరకు సీపీఐ ఉప్పల్ నియోజకవర్గ నాయకత్వం భారీ ఎత్తున జాతా బృందానికి స్వాగతం పలికారు. ఈ సందర్భంగా సిపిఐ జాతీయ కార్యవర్గ సభ్యురాలు పశ్యపద్మ, వలి ఉల్లా ఖాద్రి, ఉప్పలయ్య,నరేంద్ర ప్రసాద్‌లకు పార్టీ నాయకులు పూలమాలలు,ఎర్రని కండువాలు వేసి స్వాగతం పలకడం జరిగింది. ముఖ్య అతిధిగా సీపీఐ రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు విఎస్. బోస్ హాజరయ్యారు. అనంతరం ఆయన మాట్లాడుతూ ఇటీవల దేశంలో అనేక రాష్ట్రాలకు జరిగిన అసెంబ్లీ ఎన్నికల్లో ప్రధాన ప్రతిపక్షమైన కాంగ్రెస్ పార్టీ బీజేపీని ఓడించడంలో చతికిల పడిందని అన్నారు. మరోవైపు ప్రపంచ వ్యాప్తంగా అనేక దేశాలలో కమ్యూనిస్టులు పురోగమిస్తున్నారని అన్నారు. భారత దేశంలో మావోయిస్టులు తుపాకీ గొట్టం ద్వారానే రాజ్యాధికారం అన్న తమ పంథాను వీడి ప్రజాస్వామ్య ఉద్యమాలలో కమ్యూనిస్టులతో కలిసి రావాలని అన్నారు.దేశంలో చీలిపోయిన కమ్యూనిస్టులు సైతం ఏకం కావాలని పిలుపునిచ్చారు. దేశంలో నిరుద్యోగం, అధిక ధరలు పెరిగి పోతున్నాయని, రూపాయి పతనంతో మరింత ఆర్థిక మాంద్యం ఏర్పడిందని అన్నారు.ఈ క్రమంలో ప్రజలు కమ్యూనిస్టుల వైపు చూస్తున్నారని, దేశంలో మతోన్మాద శక్తులను ఎదుర్కొనేందుకు కమ్యూనిస్టులే ప్రత్యామ్నాయంగా నిలిచారని అన్నారు. భారత కమ్యూనిస్టు పార్టీ అనేక సంఘాలను నిర్మాణం చేసిందని, విద్యార్థి యువజన మహిళా కార్మిక కర్షక మేధావి వర్గాలతో వారి సమస్యల పరిష్కారం కోసం నిరంతరం కృషి చేయాలని ప్రజా సంఘాలకు దిశానిర్దేశం చేసిందన్నారు. మావోయిస్టు పార్టీ నాయకులను పట్టుకొని కాల్చి చంపి ఎన్కౌంటర్ అంటూ తప్పుడు ప్రకటనలు ఇస్తున్నది.బూటకపు ఎన్కౌంటర్ లు, బిజెపికి చేస్తున్న మానవ హననానికి వ్యతిరేకంగా ప్రజా స్వామిక వాదులు,రోడ్ల మీదికి రావాలని అన్నారు. అశేష త్యాగాలు చేసిన కమ్యూనిస్టు పార్టీ మరింత త్యాగాలకు సిద్ధపడుతూ భవిష్యత్తులో బిజెపి చేస్తున్న దుర్మార్గ రాజకీయాలను తిప్పి కొట్టడానికి కార్యకర్తలు సిద్ధంగా ఉండాలని పిలుపునివ్వడం జరిగింది. అదే విధంగా జాతాకు నాయకత్వం వహిస్తున్న సీపీఐ జాతీయ కార్యవర్గ సభ్యురాలు పశ్య పద్మలి. మాట్లాడుతూ 100 వసంతాల సీపీఐ అశేష త్యాగాలు చేసిందని, అధికార కాంక్ష ఉదేశ్యంతో కాకుండా నిత్యం ప్రజా సమస్యల పరిష్కారమే అజెండాతో ప్రజల మన్ననలు పొందిన ఏకైక రాజకీయ పార్టీ సీపీఐ అని అన్నారు. కానీ నేడు స్వార్థ ప్రయోజనాల కోసమే రాజాకీయాలు చేస్తున్నారని ప్రజలు గమనించాలని, అందుకే ప్రజల కోసం నిరంతరం ఉద్యమించే సీపీఐ ను ఆదరించాలని వారు అన్నారు. అదేవిధంగా విద్యార్థులు, నిరుద్యోగుల పట్ల పాలకుల నిర్లక్ష్య పూరిత విధానాలు మారాలని చదువు పూర్తి చేసిన వెంటనే ఉద్యోగాలు ఇవ్వాల్సిన బాధ్యత ప్రభుత్వాలపై వున్నదని వారు అన్నారు. ఈ కార్యక్రమంలో సీపీఐ మేడ్చల్ జిల్లా కార్యదర్శి ఉమా మహేష్, సీపీఐ రాష్ట్ర సమితి సభ్యులు జీ. దామోదర్ రెడ్డి,సాయిలు గౌడ్,సీపీఐ జిల్లా కార్యవర్గ సభ్యులు శంకర్ రావు, ధర్మేంద్ర,సత్య ప్రసాద్,శంకర్, రచ్చ కిషన్,నర్సింహా, సీపీఐ ఉప్పల్ నియోజకవర్గ నేతలు నారా నర్సింహా,బాబురావు,సాంబశివరావు, జాన్, మిరియాల సాయిలు,స్వరూప, రాజేశ్వరి... ఏఐవైఎఫ్, ఏఐఎస్ఎఫ్ నేతలు గిరిబాబు, వికాస్, నదీమ్, మహేష్, అజీమ్, సమీర్, శబాజ్, షోయబ్ లతో పాటు సుమారు100 మంది పాల్గొన్నారు.

## పాఠశాలల్లో పరిశుభ్రతపై సమీక్ష



**మెదక్, నవంబర్ 20 (జనం సాక్షి) :** స్పెషల్ క్యాంపెయిన్ 5 సందర్భంగా రెండు రోజులపాటు జిల్లాలోని పలు పాఠశాలలను సందర్శించిన రాష్ట్ర పరిశీలకులు అసిస్టెంట్ డైరెక్టర్ సమగ్ర శిక్ష మల్లికార్జున్, డైరెక్టర్ స్కూల్ ఎడ్యుకేషన్ మరియు సమగ్ర శిక్ష ఆదేశాల మేరకు 31 అక్టోబర్ నుండి 25 నవంబర్ వరకు ఈ స్పెషల్ క్యాంపెయిన్ 5.%ా% కొనసాగుతుందని ఈ సందర్భంగా పాఠశాలలో తరగతి గదులు టాయిలెట్స్ పాఠశాల పరిసరాలు వంటగది వంటి ప్రదేశాలు శుభ్రంగా ఉండేటట్లు చూడాలని ఆదేశించారు. జిల్లాలోని ఆరు మండలాలలో వివిధ పాఠశాలలను సందర్శించిన సందర్భంలో పరిశీలనకు వచ్చిన అంశాలను నేడు జిల్లా విద్యా శిక్షణ సంస్థ యందు మండల విద్యాధికారులు, ఉన్నత పాఠశాలల ప్రధానోపాధ్యాయులతో సమీక్షించారు. ప్రభుత్వ బాలుర ఉన్నత పాఠశాల మెదక్, జెడ్ పి హెచ్ ఎస్ బూరుగుపల్లి పాఠశాలల ప్రధానోపాధ్యాయులను అభినందించారు. ఈ అవకాశాన్ని ప్రధానోపాధ్యాయులందరూ సద్వినియోగం చేసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా ఇంచార్జి విద్యాధికారి విజయ, సమగ్ర శిక్ష కోఆర్డినేటర్లు సుదర్శనమూర్తి, రాజు, జిల్లా సైన్స్ అధికారి రాజిరెడ్డి, ఆయా మండల విద్యాధికారులు ప్రధానోపాధ్యాయులు పాల్గొన్నారు.

## సెల్ టవర్ నిర్మాణాన్ని నిలిపివేయాలి



**మెదక్, నవంబర్ 20 (జనం సాక్షి) :** ఔరంగాబాద్ యస్.సి కాలనీ నివాస గృహముల మధ్యలో జియో సిగ్నల్ నెట్వర్క్ సెల్ టవర్‌ను నిర్మిస్తున్నటువంటి పనులను తక్షణమే నిలిపివేయాలని యువజన అంబేద్కర్ సంఘం నాయకులు డిమాండ్ చేశారు. గోప్యంగా జరుగుతున్న నివాస గృహాలకు ఆనుకొని సెల్ టవర్ నిర్మిస్తే విపరీతమైన రేడియేషన్ ప్రభావం ప్రాణనష్టం జరుగుతుంది అని అన్నారు. ఔరంగాబాద్ ఒకటో వాడు ఎస్సీ కాలనీలో సెల్ టవర్ కారణంగా జరిగే ప్రమాదాలు వివరిస్తూ స్కూల్ మరియు చిన్న పిల్లలకు వృద్ధులకు అనేక అనారోగ్య సమస్యలతో నివసించే మనుషుల ప్రాణాలకు హానికరమైన ప్రమాదాలు ఏర్పడే ప్రమాదం ఉంది. కావున దీని వలన రేడియేషన్, అంటూ, వ్యాదులు, వచ్చే ప్రమాదం ఉన్నందున ఇట్టి టవర్ నిర్మాణ%శీ% సంబంధం లేని ఇతర గత అనుమతులు చూపిస్తూ మా కాలనీ కాలనీగృహాలకు అనుకొని మధ్యలో నిర్మాణాలకు లేని అనుమతులు ఉన్నయంటూ జియో టవర్ మేనేజ్మెంట్ నిర్వాహకులు దబాయిస్తూ చాటుమాటున హడావిడిగా దొంగ నిర్మాణాలను ప్రస్తుతం జరుగుతున్నటువంటి పనులను ఆపివేయగలరని కాలనీ వాసులందరమూ అభ్యర్థిస్తూ మా ఫిర్యాదు పై తక్షణమే చర్యలు తీసుకోవాలని కోరారు.ఈ కార్యక్రమంలో ఔరంగాబాద్ యస్.సి. కాలనీ హవేలీ ఘనపూర్ మండలం అంబేద్కర్ యువజన సంఘం అధ్యక్షులు కిరణ్ కుమార్, ఎమ్మార్పీఎస్ మెదక్ జిల్లా నాయకులు అస్తరుగళ్ల బాలరాజ్, మరియు నాయకులు బాబు, లక్ష్మణ్, దయాకర్,భాను, శీను, స్వామి, ఉదయ్, కార్తీక్, అంజద్, తదితరులు నాయకులు పాల్గొన్నారు.

# మహిళలకు రక్షణ కల్పించడంలో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు విఫలం

- ఎస్ఎఫ్ఐ కేంద్ర కమిటీ సభ్యురాలు మమత
- చేవెళ్లలో విద్యార్థినీల నినాదాలతో దద్దరిల్లిన భారీ ర్యాలీ




**చేవెళ్ల, నవంబరు 20 (జనంసాక్షి) :** మహిళలకు రక్షణ కల్పించడంలో కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు విఫలం అయ్యాయని ఎస్ఎఫ్ఐ కేంద్ర కమిటీ సభ్యురాలు మమత అన్నారు. గురువారం రోజున చేవెళ్లలో భారత విద్యార్థి ఫెడరేషన్ విద్యార్థినీల నినాదాలతో భారీ ర్యాలీ నిరహించి రంగారెడ్డి జిల్లా గర్ల్స్ కన్వెన్షన్ నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా ఎస్ఎఫ్ఐ కేంద్ర కమిటీ సభ్యురాలు మమత హాజరైనారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ... మహిళలకు రక్షణ కల్పించడంలో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు పూర్తిగా విఫలమైందని అగ్రహం వ్యక్తం చేసారు. షి టీమ్స్ ఎక్కడ కూడా సరిగ్గా పని చేయడం లేదని మహిళలపై హత్యచారాలు రోజు రోజుకి పెరిగి పోతున్నాయని వాటిని అరికట్టడంలో కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు పూర్తిగా విఫలమవుతున్నాయని అన్నారు. దేశవ్యాప్తంగా బిజెపి ప్రభుత్వం అధికారంలోకి వచ్చినప్పటి నుండి అధికంగా హత్యాచార ఘటనలు పెరిగిపోతున్నాయన్నారు. భేటీ బచావో బేటి పడావో అని నినాదాలు ఇవ్వడానికి ప్రభుత్వాలు పనికి వస్తున్నాయి కానీ నిజంగా జరిగే దుర్మార్గాలను అరికట్టడంలో ఏమాత్రం కూడా రాష్ట్ర కేంద్ర ప్రభుత్వాలు లేకుండా వ్యవహరిస్తున్నాయన్నారు. కళాశాలలో మహిళలపై ర్యాగింగ్ ఘటనలు ప్రతిరోజు చూస్తున్నామని ఇంజనీరింగ్ మెడికల్ కళాశాలలో హత్యాచారం జరుగుతున్న కానీ వాటిని ఆచారంలో పెట్టడంలో ఎందుకు నిర్లక్ష్యంగా ప్రభుత్వాలు ఉండటం సిగ్గుచేటు అని ఆగ్రహం వ్యక్తం చేశారు. సంక్షేమ హాస్టల్ వసతివి హాల్లో ఉన్న విద్యార్థినిలకు క్రమ శిక్షణా తరగతులు నిర్వహించాలన్నారు. వారికి అండగా ఉంటూనే ఆడపిల్లను పుట్టనిద్దాం, చదవనిద్ధం కాపాడుకుందాం విద్యార్థులకు స్కూటీల హామీలు నెరవేర్చాలని డిమాండ్ చేశారు. సంక్షేమ హాస్టల్ వసతి గృహాలో విద్యార్థులకు ఉన్న సమస్యలను పరిష్కరించాలన్నారు. పేద విద్యార్థులు వసతి గృహాలకు విధులను కేటాయించడంలో పూర్తిగా విఫలమైందని, కేంద్ర ప్రభుత్వం నూతన జాతీయ విద్యా విధానాన్ని తీసుకువచ్చి అమలు చేయాలని ఆమె కోరారు. అనంతరం జిల్లా కన్వెన్షన్ కమిటీ 10 మంది సభ్యులతో ఎన్నుకున్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా గర్ల్స్ కన్వీనర్ గా అంబిక, జిల్లా కో కన్వీనర్ కీర్తన, కమిటీ సభ్యులు, అమ్ములు, అక్షిత, మానస, నందిని, నవమి, మౌనిక, ప్రియాలను ఎన్నుకున్నారు. ఈ కార్యక్రమంలో ఎస్ఎఫ్ఐ జిల్లా అధ్యక్ష కార్యదర్శులు కె.వై.ప్రణయ్, బి.శంకర్, ఎస్ఎఫ్ఐ రంగారెడ్డి జిల్లా ఉపాధ్యక్షులు శ్రీకాంత్, తరంగ్, ఎస్ఎఫ్ఐ రంగారెడ్డి జిల్లా సహాయ కార్యదర్శి బేగరి అరుణ్ కుమార్, ఎస్ఎఫ్ఐ చేవెళ్ల డివిజన్ అధ్యక్షుడు శ్రీనివాస్, సహాయ కార్యదర్శి, చరణ్ గౌడ్, ఎస్ఎఫ్ఐ రంగారెడ్డి జిల్లా కమిటీ సభ్యులు, సింధు, వంశీ, ఎస్ఎఫ్ఐ చేవెళ్ల మండల అధ్యక్ష కార్యదర్శులు ఇర్ఫాన్, మాల చందు, ఎస్ఎఫ్ఐ చేవెళ్ల డివిజన్ సభ్యులు యశ్వంత్, పవన్ కుమార్, విష్ణు, నవీన్, విష్ణు గుప్త, తదితరులు పాల్గొన్నారు.

## మున్సిపల్ కార్మికులపై సూపర్‌వైజర్ పెత్తనం అరికట్టాలి



**నిజాంపేట్, నవంబర్ 20 (జనం సాక్షి) :** నిజాంపేట్ మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలో పని చేసే పారిశుద్ధ్య సిబ్బందిని, కార్మికులను కొంత మంది సూపర్వైజర్లు ఇబ్బందులకు గురిచేస్తున్నారని ఈ విషయంపై తమ దృష్టికి రావడంతో ఏఐటీయూసీ ఆధ్వర్యంలో నిజాంపేట్ మున్సిపల్ కార్పొరేషన్ కమిషనర్ షబ్బీర్ అలీ, శానిటైజర్ ఇంచార్జ్ జయ్ రాజ్ కి పిర్యాదు చేయడం జరిగిందని. ఏ ఐ టి సి రాష్ట్ర కౌన్సిల్ సభ్యులు పాల బిందెల శ్రీనివాస్ తెలిపారు. అనంతరం ఏఐటీయూసీ రాష్ట్ర కౌన్సిల్ సభ్యులు పాలభిందెల శ్రీనివాస్ మాట్లాడుతు గతంలో నిజాంపేట్ మున్సిపల్ కార్పొరేషన్ మూడు గ్రామాలుగా ఉండేది అని అప్పుడు గ్రామపంచాయతీ ఆధ్వర్యంలో కార్మికులు పని చేసేవారని వారికీ ఆ గ్రామపంచాయితీ జీతాలు ఇచ్చేది అన్ని గుర్తు చేశారు. అప్పుడు కార్మికులకు ఎలాంటి కష్టం వచ్చిన కార్మిక సంఘం పేర్లు ఏదైనా బాచుపల్లి, ప్రగతినగర్ చల్ల.సుధీర్ రెడ్డి, నిజాంపేట్ ఆశి. యాదయ్య, నాయకత్వం వహించేది.అన్ని అన్నారు. వారి నాయకత్వంలో కార్మికులు సిబ్బంది పని చేసే వారు అన్ని అన్నారు. ఇప్పుడు ఉమ్మడి నిజాంపేట్ మున్సిపల్ కార్పొరేషన్ గా ఏర్పాటు అయినా తరువాత కొంత మంది స్వార్థం రాజకీయాల కోసం అనేక విధాలుగా కార్మికులకు, సూపర్వేజర్లు, వార్డు అధికారులు ఇబ్బంది చేస్తున్నారని అన్నారు. నేటికీ ఏఐటీయూసీ ఆధ్వర్యంలో అందరిని కలుపుకొని అనేక పోరాటాలు నిర్వహిస్తున్నామని అందుకే కార్మికలకు ఇబ్బంది. కల్పించే సూపర్వేజర్లను, ఇతరులను బదిలీ చేయాలనీ వారు డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమం ఏఐటీయూసీ మున్సిపల్ అధ్యక్షులు ఆశి. యాదయ్య, పొన్నికంటి దస్తగిరి తదితరులు పాల్గొన్నారు.

## పిల్లల హక్కులను కాపాడాలి

- జడ్పీ సీఈవో వెంకట్ రెడ్డి



**జడ్చర్ల, నవంబర్ 20 (జనంసాక్షి) :** ప్రతి ఒక్కరూ పిల్లల హక్కులను కాపాడాలని జెడ్పి సీఈవో వెంకట్ రెడ్డి అన్నారు. ప్రపంచ చిన్నారుల దినోత్సవం సందర్భంగా గురువారం పిల్లల మాటలను ఆలకించడం (ఎల్.టి.సి) కార్యక్రమాన్ని బాదేపల్లి జిల్లా పరిషత్ బాలుర ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు చంద్రకళ అధ్యక్షతన జడ్చర్ల ఎంపీడీవో కార్యాలయ సమావేశ మందిరంలో నిర్వహించారు. కార్యక్రమానికి హాజరైన జడ్పీ సీఈవో వెంకట్ రెడ్డి కార్యక్రమాన్ని ఉద్దేశించి మాట్లాడుతూ బాలల హక్కులు పరిరక్షించే ఉద్దేశంతో ప్రతి సంవత్సరం నవంబర్ 20న ప్రపంచ చిన్నారుల దినోత్సవం నిర్వహించడం జరుగుతుందని, పిల్లల సంరక్షణ, అక్రమ రవాణా నిషేధం గురించి ప్రభుత్వం చేపట్టే చర్యలను వివరించారు. కార్యక్రమంలో పాల్గొన్న 12-15,16-18 సంవత్సరాల విద్యార్థులతో సురక్షిత, అసురక్షిత, సంతోషం, బాధాకర సంఘటనల గురించి వారికి ఇచ్చిన సమయంలో స్వేచ్ఛగా వారి అభిప్రాయాలు తెలియజేయాలని సూచించారు. అనంతరం ఎల్టిసి ఫెసిలియేటర్లో విద్యార్థులను గ్రూపులుగా విధించి విద్యార్థుల నుంచి మూడు విభాగాలుగా సమాచారం సేకరించారు. కార్యక్రమంలో ఎంపీడీవో విజయ్ కుమార్, తాహసిల్దార్ నర్సింగ్ రావు, ఎల్టిసి ఫెసిలియేటర్లు, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

## హిజ్రాల ఆగడాలకు పోలీస్‌లు చెక్

- 60 మంది హిజ్రాలకు పోలీస్‌ల కౌన్సెలింగ్
- జిల్లా ఎస్పీ పరితోష్ పంకజ్

**సంగారెడ్డి ప్రతినిధి, నవంబర్ 20 (జనం సాక్షి) :** రోజురోజుకు హిజ్రాల ఆగడాలు మితిమీరుతుండడంతో పోలీసులు వారికి చెక్ పెట్టారు. సంగారెడ్డి జిల్లా ఎస్పీ పరితోష్ పంకజ్ ఆదేశానుసారం, అమీన్పూర్ పోలీసు స్టేషన్ పరిధిలో కార్యకలాపాలు నిర్వహిస్తున్న సుమారు 60-మంది హిజ్రాలకు అమీన్పూర్ ఎస్‌హెచ్ఓ నరేష్, ఇన్స్పెక్టర్ కౌన్సెలింగ్ నిర్వహించడం జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. వివాహాలు, శుభకార్యాలయాలు, ఇతర ప్రజా ప్రదేశాలలో ప్రజలను బయభ్రాంతులకు గురిచేస్తూ, నేర పూరిత చర్యలకు దిగుతూ ఇబ్బందులకు గురిచేస్తూ బలవంతపు డబ్బు వసూలు చేస్తే సహించేది లేదని హెచ్చరించారు. చట్టానికి లోబడి, సమాజంలో అందరిలా సాదారణ జీవన విధానాన్ని అనుసరించాలని సూచించారు. శుభకార్యాలయాలు, వ్యాపార సంస్థలు, ఇళ్లకు వెళ్లి ప్రజలను బయభ్రాంతులకు గురిచేస్తూ, నేర పూరిత చర్యలకు దిగుతూ బలవంతపు డబ్బు వసూలు చేయడం వంటి కార్యకలాపాలకు పాల్పడినట్లయితే సంబంధిత వ్యక్తులపై చట్టరిత్య కేసులు నమోదు చేయాలని ఎస్‌హెచ్ఓలకు ఆదేశించినట్లు తెలిపారు. జిల్లాలో ఎక్కడైనా ఇలాంటి ఘటనలు జరిగినట్లయితే, వెంటనే స్థానిక పోలీస్ స్టేషన్‌కు సమాచారం అందించాలని జిల్లా ఎస్పీ ప్రజలకు సూచించారు.



## తొలగించిన బస్టాప్‌లను తిరిగి పునరుద్ధరించండి



**కాప్రా, నవంబర్ 20 (జనం సాక్షి) :** నాగారం మున్సిపాలిటీ పరిధిలోని పలు ప్రాంతాల్లో తొలగించిన బస్టాప్ ఏమో తిరిగి పునరుద్ధీకరించాలని నాగారం మున్సిపల్ బీజేపీ అధ్యక్షులు కొండబోయిన నాగరాజు యాదవ్ ఆధ్వర్యంలో గురువారం నాగారం మున్సిపల్ కమిషనర్ భాస్కర్ రెడ్డిని కలిసి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నాగారం మున్సిపాలిటీ పరిధిలోని రాంపల్లి, ఆర్ఎల్ నగర్, ఎస్వీ నగర్, దమ్మాయిగూడ రోడ్లలో రోడ్డు విస్తరణలో భాగంగా బస్‌స్టాప్‌లను తొలగించారు. అదే స్థానంలో బస్ స్టాప్ ను పునర్నిర్మించాలని అన్నారు. అనంతరం మాజీ జెడ్పీటీసీ సభ్యులు మునిగంటి సురేష్ మాట్లాడుతూ, ప్రజలకు ఎంతో ఉపయోగకరంగా ఉన్న బస్‌స్టాప్ లు తొలగించడం వల్ల ప్రజలకు ఇబ్బందులు ఏర్పడుతున్నాయని, రాబోయే ఎండాకాలంలో మహిళలు, వృద్ధులు, రోగులు అనేక విధాలుగా ఇబ్బందులకు గురయ్యే అవకాశముందని తెలిపారు. అందువల్ల, తక్షణమే ఈ బస్‌స్టాప్‌లు ఉన్న స్థానంలోనే మళ్లీ నిర్మించాలని ప్రజల తరఫున నాగారం మున్సిపాలిటీ బీజేపీ నాయకత్వం అధ్యక్షుడు నాగరాజు యాదవ్ ఆధ్వర్యంలో కోరారు.అలాగే, బస్‌స్టాప్ లేకపోవడం వల్ల సరైన బస్టాప్ పాయింట్లు తెలియక ప్రజలు అయోమయానికి గురవుతున్నారని తెలిపారు. యుద్ధ ప్రాతిపదికన,. ప్రస్తుతం ఉన్నా బస్టాప్ పాయింట్ల వద్ద ఫ్లెక్స్ రూపంలో 'బస్‌స్టాప్' అని సూచించే బోర్డులు ఏర్పాటు చేయాలని మున్సిపల్ కమిషనర్ కి విజ్ఞప్తి చేశారు.ఈ కార్యక్రమంలో మాజీ కౌన్సిలర్ బిజా శ్రీనివాస్ గౌడ్, సీనియర్ నాయకులు బొమ్మిడి బుచ్చిరెడ్డి, నక్క కిషోర్ గౌడ్, అంకర్ల శ్రీనివాస్, మామిడి జంగారెడ్డి, పోతంశెట్టి వెంకటేశ్వరరావు, సూర్యశేఖర్ రెడ్డి, సురేందర్ రెడ్డి, వల్లాల శ్రీనివాస్ గౌడ్, ఎలసాని నాగరాజు యాదవ్, జూపల్లి నరేష్, సతీష్ రెడ్డి, శ్రీనివాస్ యాదవ్, వినయ్ రెడ్డి, వెంకటచారి, శ్రీకాంత్ యాదవ్, మధు గౌడ్ అలాగే ఎస్వీ నగర్ కాలనీవాసులు పాల్గొన్నారు.

# జాతీయ రహదారి 163ని త్వరితగతిన పూర్తి చేయాలి

- సీఎం రేవంత్ రెడ్డి ప్రత్యేక దృష్టి
- చేవెళ్ల, పరిగి, తాండూరు ఎమ్మెల్యేలు



**చేవెళ్ల, నవంబరు 20 (జనంసాక్షి) :** హైదరాబాద్-బీజాపూర్ జాతీయ రహదారి 163ని త్వరితగతిన పూర్తి చేసేలా సీఎం రేవంత్ రెడ్డి ప్రత్యేక దృష్టి సారించారని చేవెళ్ల, పరిగి, తాండూరు ఎమ్మెల్యేలు యాదయ్య, రామ్మోహన్ రెడ్డి, మనోహర్ రెడ్డి, కొడంగల్ నియోజకవర్గం బాధ్యులు ఎనుముల తిరుపతిరెడ్డి తెలిపారు. చేవెళ్ల మున్సిపల్ కేంద్రంలోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో గురువారం విలేకర్ల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ...సీఎం రేవంత్ రెడ్డి తెలంగాణ పోలీస్ అకాడమీ నుండి మన్నెగూడ వరకు 46 కి.మి హైదరాబాద్-బీజాపూర్ జాతీయ రహదారి 163పై ప్రత్యేక దృష్టి పెట్టారన్నారు. ఇప్పటికే రోడ్డు దక్కించుకున్న గుత్తేదారును పనులు త్వరితగతిన పూర్తిచేసేలా సీఎం ఆదేశాలు జారీ చేశారన్నారు. గత ప్రభుత్వం నిర్లక్ష్యం కారణంగానే రోడ్డు నిర్మాణ పనులు జరగలేదన్నారు. అంతేగాకుండా రోడ్డుకిరువైపుల ఉన్న మర్రిచెట్లను తొలగించవద్దని గతంలో గ్రీన్ ట్రిబ్యునల్ లో పర్యావరణ ప్రేమికులు కేసు వేసిన సంగతి అందరికి తెలిసిందే అని, కాగా ఇటీవల తెలంగాణ ప్రభుత్వం, సీఎం రేవంత్ రెడ్డి, రాష్ట్ర ప్రభుత్వ అధికారులు పర్యావరణ ప్రేమికులతో మాట్లాడి ప్రత్యామ్నాయ మార్గాలను చూపి గ్రీన్ ట్రిబ్యునల్ నుంచి కేసును వెనక్కి తీసుకునేలా పాటుపడ్డారని వివరించారు. హైదరాబాద్-బీజాపూర్ జాతీయ రహదారి 163 పనులకు సంబంధించి ప్రభుత్వం ఇప్పటికే అధికారులకు, రోడ్డు నిర్మిస్తున్న గుత్తేదారుకు పలు సూచనలు చేశామన్నారు. విస్తరణ పనుల్లో నాణ్యత, పని వేగం, గుత్తేదారు, అధికారులతో సమన్వయం వంటి అంశాలపై సంబంధిత అధికారులతో నిత్యం సమీక్షలు నిర్వహించి రోడ్డు పనులను మరింత వేగంగా చేయాలని, నాణ్యతతో రోడ్డు నిర్మాణం జరిగేలా చూస్తామని అన్నారు. అదే విధంగా రహదారి విస్తరణ పనులు జరుగుతున్న సమయంలో ఆయా ప్రాంతాలకు ప్రయాణాలు సాగించే ప్రజలకు, వాహనదారులకు అసౌకర్యం కలగకుండా అవసరమైన అన్ని చర్యలు అధికారులు తీసుకుంటారని తెలిపారు. ఈ రహదారి పూర్తికావడం వల్ల చేవెళ్ల, వికారాబాద్, తాండూర్, పరిగి పరిసర ప్రాంతాలకే కాకుండా కర్ణాటక ప్రాంత ప్రజలకు ఊరట లభిస్తుందన్నారు. అంతేగాకుండా ఈ ప్రాంతాలు మరింత అభివృద్ధి చెందే అవకాశముందన్నారు. దీంతోపాటు రవాణా సౌకర్యం మెరుగు పడుతుందన్నారు. చేవెళ్ల నియోజకవర్గంతో పాటు పరిగి, తాండూరు, వికారాబాద్ ప్రజలు ఎన్నో ఏళ్లుగా ఎదురుచూస్తున్న ఈ రహదారి పనులు త్వరితగతిన పూర్తి కావడానికి తెలంగాణ ప్రభుత్వం, సీఎం రేవంత్ రెడ్డి పూర్తి స్థాయిలో కృషి చేస్తున్నారని తెలిపారు. హైదరాబాద్ బీజాపూర్ జాతీయ రహదారి రోడ్డు పనులు నిర్ణీత గడువు లోగా పూర్తి చేయించేలా పాటుపడుతామన్నారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు మల్గారి జనార్ధన్ రెడ్డి, రాష్ట్ర పొల్యూష్యన్ బోర్డ్ మెంబర్ చింపుల సత్యనారాయణ రెడ్డి, చేవెళ్ల, సర్దానగర్ మార్కెట్ కమిటీ చైర్మన్ లు పెంటయ్య గౌడ్, పీసరి సురేందర్ రెడ్డి, డీసీసీ ఉపాధ్యక్షుడు బండారు ఆగిరెడ్డి, ముడిమ్యాల సొసైటీ చైర్మన్ గోనె ప్రతాప్ రెడ్డి, రాములు, ఆలంపల్లి వీరేందర్ రెడ్డి, సోలిపురం బల్వంత్ రెడ్డి, మర్పల్లి క్రిష్ణారెడ్డి, కాలే శ్రీకాంత్, మాజీ దావల్గారి గోపాల్ రెడ్డి, గుండాల రాములు, పడాల రాములు, శ్రీనివాస్ గౌడ్, మల్గారి కార్తిక్ రెడ్డి, బొల్లారం వెంకట్ రెడ్డి, మల్గని నరేందర్ గౌడ్, వెంకటేష్ తదితరులు పాల్గొన్నారు.

# మిల్లర్లు బకాయిపడ్డ 400 కోట్ల ధాన్యం రికవరీ చేయండి

- రాష్ట్ర ఆబ్కారీ, పర్యాటక సాంస్కృతిక శాఖ మంత్రి జూపల్లి కృష్ణారావు



**వనపర్తి బ్యూరో, నవంబర్ 20 (జనంసాక్షి) :** రైతులు ఆరుగాలం కష్టపడి పండించిన పంటను ఇబ్బందులు కల్పించకుండా కొనుగోలు చేసి డబ్బులు త్వరగా అందే విధంగా చూడాల్సిన బాధ్యత అధికారుల పై ఉందని రాష్ట్ర ఆబ్కారీ, పర్యాటక సాంస్కృతిక శాఖ మంత్రి జూపల్లి కృష్ణారావు ఆదేశించారు. గురువారం ఉదయం వనపర్తి జిల్లా ఐ.డి. ఒ.సి సమావేశ మందిరంలో స్థానిక శాసన సభ్యులు తూడి మేఘా రెడ్డి, జిల్లా కలెక్టర్ ఆదర్శ్ సురభి తో కలిసి వరి కొనుగోలు పై ఐ.కే.పి., సహకార సంఘం కొనుగోలు కేంద్రాల యజమానులు, రైస్ మిల్లర్లు, ఎపియం లతో సమీక్ష నిర్వహించారు.రైతులు వడ్లు కొనుగోలు కేంద్రానికి వడ్లు తెచ్చినప్పుడు 17 శాతం తేమ శాతం , తాలు, మట్టి లేకుండా చూసుకొని తూకం చేసి అక్కడే రైతుకు రషీదు ఇవ్వాల్సి ఉంటుంది.కానీ అలా జరగడం లేదని, రైతులు రైస్ మిల్లు చుట్టూ తిరుగుతూ తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. రైతు నుండి వడ్లు కొన్న వెంటనే ట్యాబ్ ఎంట్రీ చేసి రైతుకు రసీదు ఇవ్వాలనీ, ట్యాబ్ ఎంట్రీ చేయకుండా వడ్లు లారీ ఎక్కించవద్దని కొనుగోలు కేంద్రాల నిర్వాహకులను ఆదేశించారు. వనపర్తి జిల్లాలో మొత్తం 173 రైస్ మిల్లులు ఉండగా ఈ సంవత్సరం 81 మిల్లులకు ధాన్యం కేటాయించేందుకు అనుమతించడం జరిగిందన్నారు. మిగిలిన మిల్లులు సకాలంలో ధాన్యం అప్పగించనందున ధాన్యం కేటాయించడంలేదని, 39 మిల్లులపై కేసులు సైతం నమోదు చేసినట్లు మంత్రి దృష్టికి తెచ్చారు. మిల్లుకు ధాన్యం కేటాయించాలంటే ముందుగా కనీసం 10 శాతం బ్యాంకు గ్యారంటీ ఇవ్వాల్సి ఉంటుందని కానీ ఇప్పటివరకు కేవలం 46 మిల్లులు మాత్రమే బ్యాంకు గ్యారంటీ ఇచ్చినట్లు చెప్పారు.

స్పందించిన స్థానిక శాసన సభ్యులు తూడి మేఘా రెడ్డి మిగతా రాష్ట్రాల్లో మిల్లర్లు వంద శాతం బ్యాంకు గ్యారంటీ ఇస్తున్నారని, ఇక్కడ కేవలం 10 శాతం బ్యాంకు గ్యారంటీ ఇవ్వడానికి ఇబ్బందులు ఏమున్నాయని మిల్లర్లను ప్రశ్నించారు. వెంటనే మిల్లర్లు అందరూ బ్యాంక్ గ్యారంటీ ఇచ్చి ధాన్యం దించుకోవాలి, ఇతర జిల్లాకు ధాన్యం వెళ్లకుండా చూడాలని సూచించారు. అదేవిధంగా జిల్లాలో కొనుగోలు చేసిన దొడ్డు వడ్లు వారం రోజుల నుంచి కొనుగోలు కేంద్రం నుండి తరలించడం లేదని రైతులు తన దృష్టికి తెచ్చారని, కొనుగోలు చేసిన దొడ్డు వడ్లు యుద్ధప్రాతిపదికన మిల్లులకు తరలించేందుకు చర్యలు తీసుకోవాలని సూచించారు. తేమ కొలిచే యంత్రాలలో వ్యత్యాసాలు ఉన్నాయని కొనుగోలు కేంద్రాల నిర్వాహకులు, మిల్లర్లు మంత్రి దృష్టికి తీసుకురాగా అవసరమైతే ఒకే రకమైన తేమ కొలిచే యంత్రాలు కొని కొనుగోలు కేంద్రాల నిర్వాహకులకు, మిల్లర్లకు అందజేసి వారి నుండి డబ్బులు వసూలు చేసుకోవాలని కలెక్టర్‌ను సూచించారు.

ఇందిరా గాంధీ జన్మదినం సందర్భంగా ప్రజా ప్రభుత్వం 18 సంవత్సరాల వయస్సు నిండిన ప్రతి పేద మహిళకు ఒక ఇందిరమ్మ చీరను ఉచితంగా ఇవ్వడం జరుగుతుందని, మండలాల వారిగా షెడ్యూలు చేసుకొని ప్రజా ప్రతినిధులను భాగస్వాములు చేస్తూ చీరల పంపిణీ కార్యక్రమం సజావుగా పూర్తి చేయాలని మంత్రి సూచించారు. అదనపు కలెక్టర్ రెవెన్యూ ఎన్ ఖీమ్యా నాయక్, వనపర్తి మార్కెట్ కమిటి చైర్మన్ బి. శ్రీనివాస్ గౌడ్, పెబ్బేరు మార్కెట్ కమిటి చైర్మన్ ప్రమోదిని, గ్రంథాలయ చైర్మన్ గోవర్ధన్ సాగర్, జిల్లా అధికారులు, రైస్ మిల్లర్లు, కొనుగోలు కేంద్రాల నిర్వాహకులు, ఏపీఎం లు, ఎ ఈ ఓ లు, తదితరులు పాల్గొన్నారు.

## గ్రంథాలయాలు..విజ్ఞానా బాండాగారాలు..



**నారాయణపేట, నవంబర్ 20 (జనం సాక్షి) :** గ్రంథాలయాలు విజ్ఞాన బాండా గారాలని పుస్తకపఠనం ద్వారా జ్ఞానం పెరుగుతుందని, చిన్ననాటి నుండే గ్రంథాలయంలో పుస్తకాలను చదవడం ద్వారా పోటీ పరీక్షలకు ఉపయోగకరమైనపుస్తకాలతోపాటు ప్రపంచం విషయాలను తెలుసు కోవచ్చునని జిల్లా కాంగ్రెస్ మాజీ అధ్యక్షులు కుంభం శివకుమార్ రెడ్డి జిల్లా గ్రంథాలయ చేర్మెన్ వార్ల విజయకుమార్ అన్నారు. గురువారం ఎమ్మెల్యే క్యాంప్ కార్యాలయంలో 58వ జాతీయ గ్రంథాలయ వారోత్సవాల సందర్భంగా జిల్లా గ్రంథాలయశాఖ ఆధ్వర్యంలో విద్యార్థులకు నిర్వహించిన వ్యాస రచన, ముగ్గుల పోటీ, చిత్రలేఖనం దేశభక్తి పాటల పోటీలలో గెలుపొందిన విజేతలకు బహుమతి ప్రధానోత్సవ కార్యక్రమానికి వారు ముఖ్య అతిథులు హాజరై విజేతలకు బహుమతులను అందించారు. ఇకార్యక్రమంలో మార్కెట్ చేర్మెన్ సదాశివా రెడ్డి లై బ్రేరి కార్యదర్శి ఎం ప్రతాప్ మాజీ మార్కెట్ చేర్మెన్ బండి వేణుగోపాల్ కాంగ్రెస్ పార్టీ పట్టణఅధ్యక్షులు సలీమ్ మార్కెట్ డైరెక్టర్ శరణప్ప ఆర్టీసీ డైరెక్టర్ పోషల్ రాజేష్ గుండ్ మల్ మాజీ సర్పంచ్ సురేష్ రెడ్డి కోస్గి మాజీ సర్పంచ్ శ్రీలత నరేందర్ లైబ్రెరియాన్ శిల్ప రాంమోహన్ శ్రీకాంత్ రఘు తదితరులు పాల్గొన్నారు.

## మెనూ ప్రకారం భోజనం అందించాలి

- కలెక్టర్ కె.హైమావతి



**నంగునూరు, నవంబర్ 20 (జనం సాక్షి) :** నంగునూరు మండలంలోని కస్తూర్బాగాంధీ బాలికల విద్యాలయాన్ని జిల్లా కలెక్టర్ కె.హైమావతి ఆకస్మికంగా సందర్శించి మధ్యాహ్న భోజన ప్రక్రియను క్షేత్రస్థాయిలో పరిశీలించారు. అన్నం, పప్పు, కాకరకాయ, సాంబారు, గుడ్డు వండినట్లు వంట సిబ్బంది తెలపగా ఆహార పదార్థాలు తనికి చేసి నాణ్యత మెరుగు పరచాలని పప్పులో ఆకుకూరలు వేసి రుచికరంగా వండాలని వంట సిబ్బందిని ఆదేశించారు. ఎదిగే పిల్లలు కావున పౌష్టికాహారం అందించాలని ప్రతిరోజు విద్యార్థులకు నెయ్యి పెట్టాలని స్వయంగా నెయ్యి వడ్డించారు. విద్యాలయంలో 260 గాను 230 మంది విద్యార్థులు హాజరు ప్రకారం వంట సరుకులు అందించినట్లు ఎస్ఓ కలెక్టర్ కి తెలిపారు. కామన్ డైట్ మెనూ పాటించాలని కూరగాయలు దొరకట్లేదని సాకులు చెప్తే ఉపేక్షించేది లేదని హెచ్చరించారు. రిజిస్టర్ లు తనికి చేస్తూ రిజిస్టర్ రాయడంలో జాప్యం చేయవద్దని ప్రిన్సిపల్ నుండి వంట సిబ్బంది వరకు మీ యొక్క విధులు సక్రమంగా నిర్వహించాలని విధుల్లో నిర్లక్ష్యం వహిస్తే కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. పిల్లలకు తరుచు హెల్త్ చెకప్ చెయ్యాలని, హిమోగ్లోబిన్ శాతం చెక్ చెయ్యాలని శాతం తగ్గిన వారికి కొత్త డైట్ లేదా దగ్గరలోని ప్రాంతీయ ఆసుపత్రికి పంపించాలని ఏఎన్ఎం నీ ఆదేశించారు.

## డ్రగ్స్ లేని సమాజాన్ని నిర్మిద్దాం



**మల్దకల్, నవంబర్ 20 (జనంసాక్షి) :** మండల కేంద్రంలోనిప్రభుత్వ జూనియర్ కళాశాలలో గురువారం విశ్వహిందూ పరిషత్, బజరంగ్ దళ్ ఆధ్వర్యంలో కేంద్ర ప్రభుత్వం తలపెట్టిన నష ముక్త భారత్ అభియాన్ కార్యక్రమంలో భాగంగా విద్యార్థులకు డ్రగ్స్ పై అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఎస్సైనందికర్ మాట్లాడుతూ మత్తు పదార్థాలకు త్వరగా అలవాటు పడే వ్యక్తులు యువతని అని భావించి డ్రగ్స్ అమ్మేవారు యువకుల్ని టార్గెట్ చేసుకొని వారికి అలవాటు చేసి బానిసలుగా మారుస్తున్నారని తెలిపారు. యువకులు ఒక మంచి లక్ష్యంతో చదువు, భవిష్యత్తుపై ఆలోచన చేస్తూ డ్రగ్స్ బారిన పడకుండా,చెడు అలవాట్లకు లోను కాకుండా తల్లిదండ్రుల ఆశయ సాధన ధ్యేయంగా కష్టపడాలన్నారు. విద్యార్థులు ఎప్పుడైతే తమ భవిష్యత్తు తల్లిదండ్రుల ఆశయం మేరకు లక్ష్యసాధనలో దృష్టి పెడతారో అప్పుడు డ్రగ్స్,చెడు అలవాట్ల బారిన పడకుండా ఉంటారన్నారు. ఇన్చార్జి ప్రిన్సిపల్ నరసింహ మాట్లాడుతూ సమాజాన్ని నిర్మించడంలో యువత కీలకమని వారికి ఇలాంటి అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తే వారు అలవాటు పడకుండా సమాజాన్ని మంచివైపు నడిపిస్తారనిఆయన అన్నారు. ఈ కార్యక్రమంలోభజరంగ్ దళ్ జిల్లా సంయోజక్ మనికృష్ణ, వి.హెచ్.పీ జిల్లా అధ్యక్షులు ఫణిమోహన్ రావ్,జిల్లా సహా కార్యదర్శులు మనోజ్ రెడ్డి, కె.వెంకటేష్,రవికుమార్, ఆర్ఎస్ఎస్ అయిజ ఖండ కార్యవాహ వాగుబాయి తిరుమలేష్,కళాశాల అధ్యాపక బృందం రామాంజనేయులు గౌడ్, గోవర్ధన్ శెట్టి, రామాంజనేయులు,శివ ప్రసాద్,తిరుమలేష్, కె.తిమ్మప్ప, అధ్యాపకులు,విద్యార్థులు పాల్గొన్నారు.

# స్థానిక సంస్థ ఎన్నికలు సమర్ధవంతంగా నిర్వహించాలి

**మెదక్ జిల్లా బ్యూరో, నవంబర్ 20 (జనం సాక్షి) :** రాష్ట్రంలో స్థానిక సంస్థల ఎన్నికలను సమర్ధవంతంగా నిర్వహించాలని రాష్ట్ర ఎన్నికల సంఘం కమిషనర్ రాణి కుముదిని అన్నారు. గురువారం హైదరాబాద్ నుండి రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి రామకృష్ణారావు, రాష్ట్ర డి.జి.పి. శివధర్ రెడ్డి, ఇతర ఎన్నికల సంఘం అధికారులతో కలిసి వీడియో కాన్ఫరెన్స్ ద్వారా అన్ని జిల్లాల ఎన్నికల అధికారులు – కలెక్టర్లు, పోలీసు ఉన్నతాధికారులు, అదనపు కలెక్టర్లు, పంచాయతీ అధికారులతో సర్పంచ్, వార్డు సభ్యుల ఎన్నికల నిర్వహణ, ఓటరు జాబితా అభ్యంతరాలు, పోలింగ్ కేంద్రాలు, రిజర్వేషన్ల ప్రక్రియ, శాంతిభద్రతల అంశాలపై సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా రాష్ట్ర ఎన్నికల సంఘం కమిషనర్ మాట్లాడుతూ సర్పంచ్, వార్డు సభ్యుల ఎన్నికల నిర్వహణ ప్రశాంత వాతావరణంలో సమర్ధవంతంగా నిర్వహించాలని, ఎలాంటి అవకతవకలకు అవకాశం లేకుండా చర్యలు తీసుకోవాలని తెలిపారు. ఎన్నికలను 3 విడతలలో నిర్వహించేందుకు అవసరమైన కార్యచరణ రూపొందించాలని తెలిపారు. ఎన్నికల సమయంలో రాష్ట్ర, జిల్లా స్థాయిలో ఎన్నికల ప్రవర్తన నియమావళి సమర్ధవంతంగా అమలు చేయాలని, ఎన్నికల పరిశీలకులకు శిక్షణ అందించడం జరుగుతుందని, జిల్లా స్థాయిలో ఏర్పాటు చేసే ఎన్నికల నిర్వహణ కమిటీ సభ్యుల జాబితా సమర్పించాలని తెలిపారు. 2011 ఎన్నికల జాబితా ప్రకారం షెడ్యూల్డ్ కులాలు, షెడ్యూల్డ్ తెగలు, 2024 ఎస్ ఈ ఈ ఈ పి సి సర్వే ప్రకారం వెనుకబడిన తరగతులకు రిజర్వేషన్లు కేటాయించడం జరుగుతుందని తెలిపారు. జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ రాహుల్ రాజ్ మాట్లాడుతూ జిల్లాలో గ్రామపంచాయతీలు, వార్డు సభ్యుల స్థానాలకు ఎన్నికల నిర్వహణ కొరకు రాష్ట్ర ఎన్నికల సంఘం ఆదేశాల ప్రకారం ఏర్పాట్లు చేయడం జరుగుతుందని తెలిపారు. నిబంధనల ప్రకారం రిజర్వేషన్ల ప్రక్రియ చేపడతామని, స్థానిక సంస్థల ఎన్నికల నిర్వహణకు అవసరమయ్యే సిబ్బంది, ఎన్నికల సామాగ్రిని సమకూర్చేందుకు చర్యలు తీసుకుంటామని తెలిపారు. రాష్ట్ర ఎన్నికల కమిషన్ నిబంధనల ప్రకారం జిల్లాలో ఎన్నికలను ప్రశాంతంగా నిర్వహించేందుకు చర్యలు తీసుకుంటామని తెలిపారు. ఈ కార్యక్రమంలో జిల్లా ఎస్పీ శ్రీనివాసరావు అదనపు ఎస్పి మహేందర్ జెడ్పి సీఈఓ ఎల్లయ్య, జిల్లా పంచాయతీ అధికారి యాదయ్య, జిల్లా రెవెన్యూ అధికారి భుజంగరావు, ఎన్నికల విభాగం అధికారులు, సంబంధిత అధికారులు తదితరులు పాల్గొన్నారు.



## ఇందిరమ్మ ఇంటి నిర్మాణ లక్ష్యాలను వేగవంతంగా పూర్తి చేయాలి

- గద్వాల జిల్లా కలెక్టర్ బి.యం. సంతోష్

**గద్వాల నడిగడ్డ, నవంబర్ 20 (జనం సాక్షి) :** ఇందిరమ్మ ఇండ్ల నిర్మాణపు పనులను వేగవంతముగా పూర్తి చేయాలని జిల్లా కలెక్టర్ బి.యం. సంతోష్ అన్నారు. గురువారం ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణపు పనుల పురోగతిపై కలెక్టర్ కార్యాలయంలోని కాన్ఫరెన్స్ హల్ లో అన్ని మండలాల ఎంపీడీఓ లు, మున్సిపల్ కమీషనర్ లతో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మండలాల వారిగా పనుల పురోగతిని అడిగి తెలుసుకొని వంద శాతం ఇంటి నిర్మాణ పనుల లక్ష్యాలను చేరుకోవాలని,ప్రత్యేక చొరవ తీసుకుని వివిధ దశలలో ఉన్న వాటిని వేగవంతంగా పూర్తి చేసేందుకు చర్యలు చేపట్టాలన్నారు. అవసరమైన ఇసుక అందుబాటులో వచ్చినందున పనులను వేగవంతం చేసి జిల్లాను రాష్ట్ర స్థాయిలో టాప్ టెన్ లో నిలుపాలన్నారు. గద్వాల నియోజకవర్గంలో కొత్తగా 300 మంది లబ్ధిదారులకు ఎంపిక చేసి ప్రొసీడింగ్స్ అందించడం జరిగిందని, గ్రామ పంచాయతీ ఎన్నికల కోడ్ అమలులో రాకముందే మార్కెట్ పనులు పూర్తి చేయాలన్నారు. ఇప్పటికే మంజూరు అయి నిర్మాణాలకు ఆసక్తి చూపని 1,197 మంది గృహల స్థానంలో కొత్త లబ్ధిదారులను ఎంపిక చేసి ప్రతిపాదనలు అందజేస్తే అమోదించడం జరుగుతుందన్నారు. ఈ పనులు అన్నింటిని సోమవారం వరకు పూర్తి చేయాలన్నారు. పురోగతిలో ఉన్న పనులను వేగంగా పూర్తి చేయాలని ఆదేశించారు. ఈ కార్యక్రమంలో అదనపు కలెక్టర్ నర్సింగరావు,హౌసింగ్ పిడి శ్రీనివాస్ రావు, డిపిఓ నాగేంద్రం, ఎంపీడీఓ లు, మున్సిపల్ కమీషనర్లు, ఏపీవో లు తదితరులు పాల్గొన్నారు.



## ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ కేసులను త్వరితగతిన పరిష్కరించాలి

- నాగర్‌కర్నూల్ పార్లమెంట్ సభ్యులు డాక్టర్ మల్లు రవి




**నాగర్‌కర్నూల్ జిల్లా బ్యూరో, నవంబర్ 20 (జనంసాక్షి) :** ఎస్సీ,ఎస్టీ అట్రాసిటీ కేసులను త్వరితగతిన పరిష్కరించి బాధితులకు సత్వర న్యాయం అందించాలని నాగర్ కర్నూల్ పార్లమెంట్ సభ్యులు డాక్టర్ మల్లు రవి అన్నారు. గురువారం నాగర్ కర్నూల్ జిల్లా కలెక్టరేట్ లోని వీడియో కాన్ఫరెన్స్ సమావేశ మందిరంలో జిల్లా విజిలెన్స్ అండ్ మానిటరింగ్ కమిటీ,పిసిఆర్,1955 మరియు పిఓఏ యాక్ట్ 1989 అమలుపై సమీక్షా సమావేశంలో నాగర్ కర్నూల్ జిల్లా కలెక్టర్ బాదావత్ సంతోష్ చైర్మన్,నాగర్ కర్నూల్ పార్లమెంట్ సభ్యులు డాక్టర్ మల్లు రవి, శాసనమండలి సభ్యులు కుచుకుళ్ళ దామోదర్ రెడ్డి, ఎమ్మెల్యేలు డాక్టర్ వంశీకృష్ణ, కసిరెడ్డి నారాయణరెడ్డి, విజిలెన్స్ మానిటరింగ్ కమిటీ సభ్యులు, సమక్షంలో జిల్లా విజిలెన్స్ అండ్ మానిటరింగ్ కమిటీ సమావేశం జరిగింది. ఈ సందర్భంగా నాగర్ కర్నూల్ పార్లమెంట్ సభ్యులు డాక్టర్ మల్లు రవి, మాట్లాడుతూ ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ కేసుల్లో ఎంక్వైరీ వేగంగా పూర్తి చేసి ఛార్జ్ షీట్ వేస్తే, బాధితులకు న్యాయంతో పాటు ప్రభుత్వ నిబంధనల మేరకు పరిహారం వెంటనే అందజేసి, పేద ప్రజలకు సరైన అవగాహన కల్పించి ఎస్సీ ఎస్టీల అభ్యున్నతికి కృషి చేయాలని నాగర్కర్నూల్ పార్లమెంట్ సభ్యులు డాక్టర్ మల్లు రవి అధికారులకు సూచించారు. ఎమ్మెల్యేలు డాక్టర్ వంశీకృష్ణ,కసిరెడ్డి నారాయణరెడ్డి మాట్లాడుతూ ఆయ నియోజకవర్గాల పరిధిలోని ఎస్సీ ఎస్టీ కేసులకు సంబంధించిన వివరాలు భూతగాదాలు బాధితుల నష్టపరిహారం సంబంధిత శాఖల అధికారులను అడిగి తెలుసుకున్నారు. సలహాలు సూచనలను ఎస్సీ ఎస్టీ కమిటీకి తెలిపారు. ఎస్సీ ఎస్టీలకు సత్వర న్యాయం జరిగేలా అధికారులు కృషి చేయాలని ఎమ్మెల్యేలు ఈ సందర్భంగా తెలిపారు.

## ఆశా కార్యకర్తలకు, ఆశ యూనిఫామ్ చీరలు పంపిణీ

**గద్వాల నడిగడ్డ, నవంబర్ 20 (జనం సాక్షి) :** జోగులాంబ గద్వాల జిల్లా జిల్లా వైద్య ఆరోగ్యశాఖ కార్యాలయంలో ఇన్చార్జ్ డిపిహెచ్ఎన్ఓ వరలక్ష్మి ఆధ్వర్యంలో గురువారం ఆశా కార్యకర్తలకు యూనిఫామ్ చీరలను జిల్లా వైద్య ఆరోగ్యశాఖ వైద్యాధికారినీ సంధ్య కిరణ్మయి పంపిణీ చేశారు. ఈ సందర్భంగా డిపిహెచ్ఎన్ఓ వరలక్ష్మి మేడం మాట్లాడుతూ జోగులాంబ గద్వాల జిల్లా లో మొత్తం 604 మంది ఆశా కార్యకర్తలకు 1,212 చీరలు సరఫరా ఐనవని, ఒక్కొక్కరికి రెండు చీరలు చొప్పున పీహెచ్సీ మెడికల్ ఆఫీసర్ ద్వారా,వారి వారి పీహెచ్సీల యందు త్వరలో ఆశల అందరికీ యూనిఫామ్ ఇస్తారని సందర్భంగా తెలిపారు. ఆశా కార్యకర్తలు వారి డ్యూటీ నందు యూనిఫామ్ ధరించి అన్ని ఆరోగ్య కార్యక్రమాలలో పాల్గొనాలని ఈ సందర్భంగా తెలిపారు. ఈ కార్యక్రమంలో ప్రోగ్రామ్ ఆఫీసర్ డాక్టర్ ప్రసూనారాణి, డిప్యూటీ డెమో కోట్ల మధుసూదన్ రెడ్డి, జిల్లా ఎన్సిడి కోఆర్డినేటర్ శ్యాంసుందర్, రామాంజనేయులు,గద్వాల అర్బన్ హెల్త్ సెంటర్, ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు.



# ఆయిల్ ఫామ్ ఫ్యాక్టరీ పనులను త్వరితగతిన పూర్తి చేయాలి

- త్వరలో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి చేతుల మీద ఫ్యాక్టరీ ప్రారంభం
- సిద్దిపేట జిల్లా కలెక్టర్ హైమావతి



**నంగునూర్, నవంబర్ 20 (జనం సాక్షి) :** ఆయిల్ ఫామ్ ఫ్యాక్టరీ పనులను త్వరితగతిన పూర్తి చేయాలని త్వరలో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి చేతులైన ప్రారంభించడం జరుగుతుందని సిద్దిపేట జిల్లా కలెక్టర్ కే హైమావతి అన్నారు. గురువారం రోజు నంగునూర్ మండలంలోని నర్మేట గ్రామంలో 300కోట్లతో నిర్మాణం చేస్తున్న ఆయిల్ ఫామ్ ప్యాక్టరీనీరాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి చేతుల మీదుగా త్వరలో ప్రారంభానికి ముందస్తు ఏర్పాట్లను జిల్లా కలెక్టర్ కె. హైమావతి క్షేత్రస్థాయిలో పరిశీలించారు. ఫ్యాక్టరీ లోపల బీటీ రోడ్ నిర్మాణం, డ్రైనేజీ నిర్మాణం వేగం పెంచాలని ఇంజనీరింగ్ అధికారులకు తెలిపారు. రోడ్ వెంబడి చెట్ల పొదలు తొలగించాలి. పబ్లిక్ మీటింగ్ కి వివిధ జిల్లాల నుండి ప్రజల సమీకరణ కోసం వాహనాల ఏర్పాటు పార్కింగ్ కోసం పక్కన గల టిజిఐఐసి స్థలం లో చదును చెయ్యాలని, విఐపి పార్కింగ్, హెలిప్యాడ్ తయారి చేయాల్సిందిగా అర్ అండ్ బి అధికారులను ఆదేశించారు. ముఖ్యమంత్రి పర్యటనలకు కావలసిన అన్ని అనుమతులు తీసుకుని ప్రారంభానికి సంబంధించిన పనులను పక్కా ప్రణాళికలతో పగడ్బందిగా సిద్ధం చెయ్యాలని ఆయిల్ ఫ్రైడ్ అధికారులను ఆదేశించారు. అందరూ అధికారులు సమన్వయం తో పని చేసి ప్రారంభానికి సిద్ధం చెయ్యాలని ఆదేశించారు. అనంతరం మండలంలోని నర్మేట గ్రామంలో వరి ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని జిల్లా కలెక్టర్ సందర్శించారు. ట్యాబ్ ఎంట్రీ లో జాప్యం కాకుండా చూసుకోవాలని డిఎం సివిల్ సప్లై ను ఫోన్ ద్వారా ఆదేశించారు. పేమెంట్ వివరాలు ఆరా తీశారు. ఇక్కడ లోడ్ చేసిన వడ్లు ఉమామహేశ్వర అంక్షాపూర్, శ్రీనివాస్ మిల్ ముంద్రాయి పంపించిస్తున్నట్లు సిబ్బంది కలెక్టర్ కి తెలిపారు. వాతావరణ శాఖ సూచనలు పాటించాలని అకాల వర్షాలు కురుస్తాయని రాత్రి సమయంలో రైతులు ధాన్యం పైన టార్పలిన్ కవర్లు కప్పుకోవాలని సూచించారు. తేమశాతం రాగానే వెంటనే గన్నీలలో నింపి లోడ్ అయ్యేలా పని చెయ్యాలని సెంటర్ సిబ్బందిని ఆదేశించారు. ఈ కార్యక్రమంలో ఆర్డీఓ సదానందం, జిల్లా ఉద్యానవన శాఖ అధికారి సువర్ణ, జిల్లా వ్యవసాయ శాఖ అధికారి స్వరూప రాణి, ఆయిల్ ఫ్రైడ్ మేనేజర్ సుధాకర్ రెడ్డి, ఆయిల్ ఫ్రైడ్ ఇంజనీర్ శ్రీకాంత్ రెడ్డి, ఇతర శాఖల అధికారులు, తదితరులు ఉన్నారు.

# బాలలు ప్రశ్నించడం నేర్చుకోవాలి

- బావి జీవితానికి బంగారు బాటలు వేసుకోవాలి
- జిల్లా కలెక్టర్ డాక్టర్ సత్య శారద



వరంగల్ ప్రతినిధి, నవంబర్ 20 (జనంసాక్షి): బాలలు తమ హక్కుల పట్ల అవగాహన కలిగి భావి జీవితానికి బంగారు బాటలు వేసుకోవడానికి బాలలు భయాన్ని వీడి ప్రశ్నించడం నేర్చుకోవాలని జిల్లా కలెక్టర్ డాక్టర్ సత్య శారద పేర్కొన్నారు. గురువారం అంతర్జాతీయ బాలల హక్కుల దినోత్సవం సందర్భంగా జిల్లా బాలల సంరక్షణ యూనిట్, డాన్బాస్కో ఎన్.జీ.ఓ సంయుక్త ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన వాకథాన్ ను కలెక్టర్ జెండా ఊపి ప్రారంభించారు. నగరంలోని కాశీబుగ్గ నుండి ఓ సిటీ గ్రౌండ్స్ వరకు జరిగిన ఈ ర్యాలీలో పాఠశాలలు, బాలల సంరక్షణ సంస్థల విద్యార్థులు పాల్గొన్నారు. అనంతరం ఓ సిటీ గ్రౌండ్స్ లో జరిగిన జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ నేటి సమాజంలో పిల్లలు అనేక సమస్యలు ఎదుర్కుంటున్నారని, వాటి నుండి బయట పడాలంటే వారి భయాన్ని వదిలి గొంతెత్తి ప్రశ్నించడం అలవాటు చేసుకోవాలని తెలిపారు. అంతేకాక ప్రతీ పిల్లవాడు ఆరోగ్య కరమైన, ఆహ్లాద కరమైన జీవితాన్ని గడపాలని ఆకాంక్షించారు. బాలలు వారి హక్కుల పట్ల అవగాహన కలిగి ఉంటూనే బాధ్యతతో వ్యవహరించాలని సూచించారు. పాఠశాలల్లో వారు ఎదుర్కుంటున్న సమస్యలను ప్రభుత్వ దృష్టికి తెచ్చేందుకు అందుబాటులో ఉన్న పిర్యాదుల పెట్టెలను ఉపయోగించు కోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో అదనపు కలెక్టర్ సంధ్యారాణి, మాట్లాడుతూ బాలలు ఎదుర్కుంటున్న సమస్యల పరిష్కారానికి జిల్లా బాలల సంరక్షణ యూనిట్లు, చైల్డ్ వెల్ఫేర్ కమిటీలు పనిచేస్తున్నాయని, అత్యవసర సహాయం కోసం 1098 కు ఫోన్ చేసి సంప్రదించి వారి సమస్యలకు పరిష్కారాన్ని పొందాలని కోరారు. ఈ సందర్భంగా ఉత్తమ ప్రతిభ కరబర్చిన వారికి కలెక్టర్, ఆదనపు కలెక్టర్ లు బహుమతులు ప్రదానం చేశారు. ఈ కార్యక్రమంలో జిల్లా సంక్షేమ అధికారి రాజమణి, జిల్లా వైద్య, ఆరోగ్య అధికారి సాంబశివరావు, జిల్లా యువజన, క్రీడాల అధికారి అనిల్, జిల్లా బాలల సంక్షేమ అధికారి ఉమా, చైల్డ్ వెల్ఫేర్ కమిటీ చైర్మన్ వసుధ, సభ్యులు మధు, షాహెదా, సుజాత, మండల విద్యా అధికారి వెంకటేశ్వర రావు, చైల్డ్ హెల్ప్ లైన్ కోఆర్డినేటర్ కల్పన,డాన్బాస్కో ఎన్. జీ. ఓ కోఆర్డినేటర్ సంతోష్, షేర్ ఎన్. జీ. ఓ కోఆర్డినేటర్ శిరీష తదితరులు పాల్గొన్నారు.

# గన్‌మెన్లు లేకుండా బస్టాండ్‌కు..

- బీఆర్ఎస్ నాయకులు విసిరిన సవాల్ స్వీకరించిన నాయిని రాజేందర్‌రెడ్డి
- ఒంటరిగా వెళ్లిన ఎమ్మెల్యే



హనుమకొండ ప్రతినిధి నవంబర్ 20 (జనంసాక్షి) : హనుమకొండ బిఆర్ఎస్ పార్టీ నాయకులు మీడియా సమావేశంలో మాట్లాడుతూ హనుమకొండ అభివృద్ధిలో వెనుకబడి ఉందని ప్రజలందరికీ న్యాయం చేయని ఎమ్మెల్యే పై ప్రజలందరూ అసంతృప్తిగా ఉన్నారని గన్ మెన్ లు లేకుండా దమ్ముంటే బస్టాండు వెళ్లగలవా అని సవాల్ విసిరగా వారికి వరంగల్ పశ్చిమ నియోజకవర్గం శాసనసభ్యులు నాయిని రాజేందర్ రెడ్డి చెంప పెట్టు సమాధానం ఇచ్చారు.బీఆర్ఎస్ నాయకుల సవాల్ కు గురువారం ఎమ్మెల్యే ఒంటరిగా హనుమకొండ బస్టాండ్ కు చేరుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తాను ఎప్పుడూ ప్రజాక్షేత్రంలోనే ఉంటూ ప్రజల పక్ష నిలబడ్డానే కానీ హంగు ఆర్భాటాలకు ముందు వరుసలోలేనని వెల్లడించారు.గతంలో ప్రతిపక్ష హోదాలో ఉన్నప్పుడు కూడా యూనివర్సిటీ విషయాలపై సవాల్ విసిరినప్పుడు కనీసం ముందుకు రాని నాయకులు ఇప్పుడు గన్మెన్లు లేకుండా తిరగాలని తనపై సవాల్ వేయడమంటే హాస్యాస్పదమని అన్నారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే సవాలు స్వీకరించి స్థానికంగా ఉన్న చిరు వ్యాపారులను ఆత్మీయంగా పలకరిస్తూ అభివృద్ధి విషయాలపై వారిని నేరుగా అడిగి తెలుసుకున్నారు.

# గల్ఫ్ జీవితం నుంచి విముక్తి..

- టీజీడబ్ల్యూడబ్ల్యూసీ సాయంతో భారత్ చేరిన మండల వాసి




దస్తురాబాద్, నవంబర్ 20 (జనంసాక్షి): మండలానికి చెందిన ఎండీ సలీమ్ గల్ఫ్ దేశం ఒమాన్-మస్కట్‌లోని గేట్ వే ఫెసిలిటీ మేనేజ్మెంట్ కంపెనీలో 11 నెలలుగా విధులు నిర్వహిస్తున్నాడు. నాలుగు నెలల క్రితం హెవీ కెమికల్ లిక్విడ్‌తో పని చేయడం వలన అతని చేతి వేళ్లకు ఇన్ఫెక్షన్ ఏర్పడడంతో కంపెనీ అతని స్వంత డబ్బులతో చికిత్స చేయించినప్పటికీ మస్కట్‌లో సరైన వైద్యం అందలేదు. భారత్‌కు వెళ్లి చికిత్స చేయించుకోవాలనే అభిలాషను కంపెనీ యాజమాన్యానికి తెలియజేయగా, సలీమ్ చేయవల్సిన రెండేళ్ల అగ్రిమెంట్ పూర్తి కాలేదనే కారణంతో కంపెనీ రూ. 1,15,000 (500 రియళ్లు) డిపాజిట్ కోరిందని ఆయన తెలిపారు. పై విషయం టీజీడబ్ల్యూడబ్ల్యూసీ రాష్ట్ర జనరల్ సెక్రటరీ పాలజీ శ్రీనివాసు దృష్టికి రాగానే, ఆయన కంపెనీ యాజమాన్యంతో మాట్లాడి డిపాజిట్ మొత్తాన్ని 100 రియాళ్లకు (రూ. 23,000) తగ్గింపజేశారు. సలీమ్ వద్ద డబ్బులు లేకపోవడంతో టీజీడబ్ల్యూడబ్ల్యూసీ ఒమన్ శాఖ సభ్యులు కలిసి ఆర్థిక సహాయం అందించి విమాన టికెట్ సదుపాయం కల్పించారు. ఎమ్ సలీమ్ స్వదేశానికి చేరుకునేలా టీజీడబ్ల్యూడబ్ల్యూసీ ఒమన్ శాఖ చర్యలు తీసుకుందని ఆయన అన్నారు. ఈ సందర్భంగా సలీమ్ కుటుంబ సభ్యులు పాలజీ శ్రీనివాసుకు కృతజ్ఞతలు తెలియపరిచామని తెలిపారు.

# డ్రగ్స్ రహిత సమాజమే మనందరి లక్ష్యం

- వరంగల్ పోలీస్ కమిషనర్ సన్ ప్రీత్ సింగ్



వరంగల్ బ్యూరో, నవంబర్ 20 (జనం సాక్షి) : డ్రగ్స్ రహిత సమాజమే మనందరి లక్ష్యమని వరంగల్ పోలీస్ కమిషనర్ తెలిపారు. వరంగల్ పోలీస్ కమిషనరేట్ పరిధిలో మత్తు పదార్థాల నియంత్రణకై చేపట్టిన చర్యల్లో భాగంగా, మత్తు పదార్థాల వినియోగించే వారితో పాటు, వీటిని విక్రయాలకు పాల్పడే వారిని గుర్తించేందుకు, అలాగే యువత మత్తు పదార్థాలకు దూరంగా వుండాలని తెలిపే విధంగా డ్రగ్స్ కంట్రోల్ టీం అధ్వర్యంలో సే నో టు డ్రగ్స్ నినాదంతో రూపొందించిన ప్రచార గొడ పత్రికలను వరంగల్ పోలీస్ కమిషనర్ గురువారం అధికారులతో కలసి కమిషనరేట్ కార్యాలయములో అవిష్కరించారు. అనంతరం పోలీస్ కమిషనర్ మాట్లాడుతూ మత్తు పదార్థాల వినియోగంతో యువత భవిష్యత్తు ప్రశ్నార్థకంగా మారిందని, యువత భవితవ్యాన్ని కాపాడుకోవడం మనందరి ప్రధాన కర్తవ్యమని, మత్తు పదార్థాల నియంత్రణలో ప్రజలు సైతం పరోక్షంగా తమ వంతు సహకారాన్ని అందించాల్సి వుంటుందని. ఇందుకోసం ఎవరైన మత్తు పదార్థాల విక్రయాలు, వినియోగాలకు పాల్పడితే తక్షణమే 8712584473, 8712685299 నంబర్లకు సమచారం అందించి డ్రగ్స్ రహిత సమాజంకై మీరు భాగస్వాములు కావాలని, సమాచారం అందించిన వారి వివరాలను గోప్యంగా వుంచబడుతాయని వరంగల్ పోలీస్ కమిషనర్ తెలియజేసారు. ఈ కార్యక్రమములో పరిపాలన విభాగం అదనపు డిపిపి రవి, స్పెషల్ బ్రాంచ్ ఏసిపి జితేందర్ రెడ్డి, ఆర్.ఐ శివకేశవులు, ఇన్స్‌స్పెక్టర్ సతీష్, ఆర్.ఎస్.ఐలు పూర్ణచందర్ రెడ్డి, మనోజ్ రెడ్డి,నాగరాజు, ర్యాపిడో సంస్థ ప్రతినిధులు దర్గారావు,సందీప్ పాల్గోన్నారు.

## బాలలు ఉన్నత లక్ష్యాలను ఎంచుకోవాలి

- నగర మేయర్ గుండు సుధారాణి



వరంగల్ ఈస్ట్, నవంబర్ 20(జనం సాక్షి) : వరంగల్ నవంబర్ 20:-విద్యార్థులు చిన్నప్పటి నుండే ఉన్నత మైన లక్ష్యాలను ఏర్పరుచుకోవాలని గ్రేటర్ వరంగల్ నగర మేయర్ గుండు సుధారాణి అన్నారు. ఆటో నగర్ లోని స్థానిక ప్రభుత్వ బారుల పరిశీలక గృహం లో గురువారం బాలల వారోత్సవాల ముగింపు కార్యక్రమం లో వారు ముఖ్య అతిధిగా పాల్గొని మాట్లాడుతూ విద్యారంగానికి ప్రభుత్వం పెద్దపీట వేస్తోందన్నారు. ప్రతీ విద్యార్థి చిన్నప్పటి నుండే ఉన్నత మైన లక్ష్యాలను ఏర్పరుచుకొని జీవితం లో ఎదగాలని తెలిపారు. చెడు అలవాట్లకు దూరంగా ఉండాలని, సోషల్ మీడియా ను సవ్యంగా వాడాలని లేదంటే జీవితం ఘుడి తప్పుతుందని తెలిపారు. మంచి మార్గం లో ఉండాలని ఆకాంక్షించారు. కాసేపు వారి తో మాట్లాడి చిన్నారులకు పండ్లు పంపిణి చేశారు. అనంతరం పరిశీలిక గృహం వాతావరణం, పరిసరాలను పరిశీలించారు. ఈ కార్యక్రమం లో జూవేనైల్ బోర్డు సభ్యులు మేరుగు సుభాష్, డా,, కే. గోపికరాణి, సూపరిటెండెంట్ రమణ మూర్తి, ఉపాధ్యాయుడు చందర్ రావు హోమ్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

# వైద్యుల నిర్లక్ష్యం బాలుడు మృతి






- ఆస్పత్రిపై దాడి చేసిన బంధువులు

మంచిర్యాల ప్రతినిధి , నవంబర్ 20 (జనంసాక్షి) : నాలుగు నెలల బాలుడికి శ్వాస సరిగా తీసుకోకపోవడంతో మంచిర్యాల పట్టణంలోని పిల్లల ఆస్పత్రికి తరలించడంతో రెండు రోజుల పాటు వైద్యం చేసి కార్డియో ఎటాక్ అయి చనిపోయాడని వైద్యులు చెప్పడంతో ఆగ్రహానికి గురైన బంధువులు ఆస్పత్రిపై దాడి చేశారు. మంచిర్యాల పట్టణంలోని రాఘవేంద్ర హాస్పిటల్ వైద్యుల నిర్లక్ష్యం మూలంగానే తమ బాబు మృతి చెందాడని తల్లిదండ్రులు ఆరోపించారు. పూర్తి వివరాల్లోకెళ్తే జగిత్యాల జిల్లాకు చెందిన శేఖర్, సౌందర్య దంపతులకు కార్తీక్ నాలుగు నెలల బాబు ను తీసుకొని తన అత్తగారి ఇళ్ళైన మంచిర్యాల జిల్లాలోని దేవపూర్ గ్రామానికి వచ్చారు. గత రెండు రోజుల కిందట బాబుకు శ్వాస ఆడక పోవడంతో మంచిర్యాల పట్టణంలోని రాఘవేంద్ర పిల్లల ఆసుపత్రికి తరలించారు. పరీక్షించిన వైద్యులు రెండు రోజులుగా చికిత్స అందించారు. నిన్న అర్ధరాత్రి కార్డియా అటాక్ రావడంతో తల్లిదండ్రులకు సమాచారం ఇవ్వకుండా చికిత్స విషయంలో నిర్లక్ష్యం చేసి తమ కుమారుని మృతికి కారకులయ్యారని ఆరోపిస్తూ మృతుడి కుటుంబ సభ్యులు, బంధువులు ఆస్పత్రి అద్దాలను ధ్వంసం చేశారు. మంచిర్యాల పట్టణం పోలీసులు సంఘటన స్థలానికి చేరుకొని విచారణ చేపట్టారు. వైద్యులు సిబ్బంది నిర్లక్ష్యం కారణంగానే తమ కుమారుడు మృతి చెందాలని బాధితులు ఆరోపిస్తూ ఆసుపత్రి ఎదుట ఆందోళన దిగారు. అర్ధరాత్రి నుండి ఆసుపత్రి వద్ద పోలీసులు బందోబస్తు ఏర్పాటు చేశారు. అధికారులు స్పందించి కుమారుడి మృతికి కారకులైన వైద్యులు సిబ్బందిపై కఠిన చర్యలు తీసుకోవాలని బాధిత తల్లిదండ్రులు బంధువులు చేశారు.

# ఇసుక అక్రమ రవాణాకు పాల్పడితే కఠిన చర్యలు

- మంచిర్యాల జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్



మంచిర్యాల ప్రతినిధి, నవంబర్ 20, (జనంసాక్షి) : ఇసుక అక్రమ రవాణాకు పాల్పడితే కఠిన చర్యలు తీసుకోవడం జరుగుతుందని జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్ అన్నారు. గురువారం మంచిర్యాల జిల్లాలోని నస్పూర్ మండలం తాళ్లపల్లి సమీపంలో గల గోదావరి నది తీరం వద్ద సాండ్ రీచ్ ను నస్పూర్ మండల తహసిల్దార్ సంతోష్ తో కలిసి సందర్శించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ... ప్రభుత్వం వినియోగదారుల సౌకర్యార్థం ఇసుక రీచ్ లను ఏర్పాటు చేసి నిబంధనల ప్రకారం ఆన్ లైన్ లో ఇసుక బుక్ చేసుకున్న వినియోగదారులకు రవాణా చేస్తుందని తెలిపారు. నిరుపేదల కోసం ప్రభుత్వం చేపట్టిన ఇందిరమ్మ ఇండ్ల పథకంలో లబ్ధిదారులకు ఇంటి నిర్మాణం కోసం ఇసుకను ఉచితంగా అందిస్తుందని, ప్రభుత్వ అభివృద్ధి పనులకు రీచ్ ల ద్వారా ఇసుకను అందించడం జరుగుతుందని తెలిపారు. ఈ నేపథ్యంలో ఇసుక అక్రమ రవాణా జరగకుండా సంబంధిత శాఖల అధికారులు పర్యవేక్షించాలని, నిబంధనలు ఉల్లంఘించిన వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని తెలిపారు. ఇసుక రీచ్ కు రాకపోకల కొరకు అవసరమైన తాత్కాలిక దారి ఏర్పాటుకు చర్యలు తీసుకోవాలని అధికారులకు సూచించారు. అనంతరం జిల్లాలోని హాజీపూర్ మండలం ముల్కల్లా సమీపంలోని ఇసుక రీచ్ ప్రాంతాన్ని హాజీపూర్ మండల తహసిల్దార్ శ్రీనివాస్ రావు దేశ్ పాండే తో కలిసి సందర్శించి అధికారులకు పలు సూచనలు చేశారు.

### ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని పరిశీలించిన కలెక్టర్

మంచిర్యాల జిల్లా హాజీపూర్ మండలంలోని గుడిపేట, నంనూర్ గ్రామాలలో ఏర్పాటు చేసిన వరి ధాన్యం కొనుగోలు కేంద్రాలను సందర్శించారు. ప్రభుత్వం రైతుల వద్ద నుండి నిబంధనల ప్రకారం ధాన్యం కొనుగోలు చేసి మద్దతు ధర చెల్లిస్తుందని, ఈ క్రమంలో రైతుల వద్ద నుండి నాణ్యమైన ధాన్యాన్ని కొనుగోలు చేసేలా కేంద్రాల నిర్వహకులు చర్యలు తీసుకోవాలని తెలిపారు. వరి ధాన్యం విక్రయించేందుకు కొనుగోలు కేంద్రాలకు వచ్చే రైతుల సౌకర్యం త్రాగునీరు, నీడ మౌలిక వసతులు కల్పించడంతో పాటు గోనె సంచులు, టార్పాలిన్లు, తూకం యంత్రాలు, తేమ యంత్రాలు, ప్యాడి క్లీనర్లు ఇతర సదుపాయాలు సమకూర్చడం జరిగిందని, రైతులకు ఎలాంటి ఇబ్బంది తలెత్తకుండా కొనుగోలు ప్రక్రియ చేపట్టాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో సంబంధిత అధికారులు తదితరులు పాల్గొన్నారు.

# తొర్రూరు పీఏసీఎస్ చైర్మన్ కాకిరాల హరిప్రసాద్ పదవీ కాలం పొడిగింపు



తొర్రూరు, నవంబర్ 19 (జనంసాక్షి) : తొర్రూరు పిఏసిఎస్ చైర్మన్ పదవి కాలం పొడగిస్తున్నట్లు మహబూబాబాద్ డిసిఓ ఎన్ వెంకటేశ్వర్లు బుధవారం ఉత్తర్వులు జారీ చేశారు. తొర్రూర్ ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘం కార్యకలాపాలు నిరంతరాయంగా కొనసాగేందుకు, ప్రస్తుతం పనిచేస్తున్న కమిటీ పదవీకాలాన్ని ప్రభుత్వం తదుపరి ఆదేశాలు వచ్చే వరకు పొడిగిస్తూ జిల్లా కోఆపరేటివ్ ఆఫీసర్ వెంకటేశ్వర్లులు ఉత్తర్వులు జారీ చేశారు.

మేనేజింగ్ కమిటీ పదవీకాలం ముగియడంతో నియమించబడిన కమిటీపై హైకోర్టులో దాఖలైన వాదనల నేపథ్యంలో, కోర్టు ఇచ్చిన ఇంటరిమ్ ఆదేశాల ప్రకారం ప్రస్తుత కమిటీనే కొనసాగించాల్సిందిగా సూచించడంతో, దానిని అమలుచేస్తూ ఈ నిర్ణయం తీసుకున్నట్లు అధికారి తెలిపారు.తొర్రూర్ పిఏసీఎస్ వ్యవహారాలు సక్రమంగా నడవేందుకు కాకిరాల హరి ప్రసాద్ రావు ఛైర్మన్‌గా కొనసాగుతుండగా, కమిటీలో పదమూడు మంది సభ్యులు కొనసాగుతారు. ప్రభుత్వ నియంత్రణలో, రెజిస్ట్రార్ సూచనల మేరకు అన్ని కార్యక్రమాలు నిర్వహించాలని ఆదేశించారు.

కమిటీ కార్యకలాపాలపై దృష్టి సారించి రైతులకు సేవలు నిరంతరాయంగా అందేలా చర్యలు తీసుకోవాలని అధికారులూ సూచించారు. డి సి ఓ ఇచ్చిన ఆదేశాలతో చైర్మన్ హరిప్రసాదరావు కార్యక్రమాలు కొనసాగిస్తుండడంతో గ్రామాల్లోని ప్రజలు రైతులు హర్షం వ్యక్తం చేస్తున్నారు..

# ఫోర్జరీ సంతకాలతో ఇల్లునే కబ్జా చేశారు



- చర్యలు తీసుకోవాలని బాధితుడు వేడుకోలు

జయశంకర్ భూపాలపల్లి బ్యూరో, (జనంసాక్షి): భూపాలపల్లి కారల్ మార్క్స్ కాలనీలో ఉన్న తన పెంకుటిల్లును ఫోర్జరీ సంతకాలతో కబ్జా చేశారని, వారిపై వెంటనే తగు చర్యలు తీసుకోవాలని బాధితుడు రాజగట్టు తెలిపాడు. భూపాలపల్లిలో గురువారం ఆయన స్థానిక విలేకరులతో మాట్లాడుతూ మొగుళ్లపల్లి తహసీల్దార్ కార్యాలయంలో విధులు నిర్వహిస్తున్న జూనియర్ అసిస్టెంట్ పోర్జరీ సంతకాలతో కబ్జా చేశాడని, మున్సిపాలిటీలో నమోదు చేసుకున్నాడని తెలిపాడు. ఈ విషయంపై కలెక్టర్, మున్సిపల్ కమిషనర్ కు ఆధారాలతో ఎన్నిసార్లు ఫిర్యాదు చేసినా పట్టించుకోవడం లేదని ఆవేదన వ్యక్తం చేశాడు. తాను 2000 సంవత్సరంలో భూపాలపల్లికి చెందిన వెలిశెట్టి రాజయ్య తనకు శేఖర్ వద్ద నుండి అట్టి ఇల్లును భూమిని కొనిచ్చాడని పేర్కొన్నారు. ఆ క్రమంలో స్టాంపు కాగితంతో పాటు వెలిశెట్టి రాజయ్య, ముద్దసాని రాజయ్య, చిలకని నర్సింగంలు సాక్షులుగా ఉన్నారని చెప్పారు. 2000-2004 వరకు ఆ ఇంటిలో నివాసం ఉండి తన పేరు మీద గ్రామపంచాయతీ నెంబర్, నల్లాను తీసుకున్నట్లు పేర్కొన్నారు. అనంతరం తనకు బంధువుగా ఉన్న లక్ష్మణ్ వద్ద కొంత అప్పుగా తీసుకున్నానని, ఆ తర్వాత వడ్డీతో సహా చెల్లించడం జరిగిందన్నారు. 2004 నుండి తాను ఆర్టీసీలో ఉద్యోగ రీత్యా మంథనిలో నివాసం ఉంటున్నానని తెలిపారు. సదరు ఉద్యోగి భూపాలపల్లి ఆర్డీవో కార్యాలయంలో విధులు నిర్వహిస్తున్నప్పుడు తన పలుకుబడితో మున్సిపల్ కార్యాలయంలో నా ఇల్లు ను విక్రయించినట్లు దొంగ కాగితాలు సృష్టించి మున్సిపల్ లో ఆన్లైన్లో ఇంటిని చేర్చుకున్నాడని వాపోయారు. ఈ విషయంపై పలుమార్లు లక్ష్మణ్ తో మాట్లాడితే నీకు ఇల్లు ఎక్కడిది, అది నాదే అంటూ నా పైనే కేసులు పెడుతూ భయభ్రాంతులకు గురి చేశాడని అన్నారు. తప్పుడు పత్రాలతో నా ఇంటిని కబ్జా చేసిన రెవెన్యూ ఉద్యోగి లక్ష్మణ్ పై విచారణ జరిపి వెంటనే చర్యలు తీసుకోవాలని, నాకు తగిన న్యాయం చేయాలని బాధితుడు రాజగట్టు కోరారు.



# తుది దశలో ఉన్న ఇందిరమ్మ ఇండ్లను పరిశీలించిన జిల్లా కలెక్టర్

- ఇందిరమ్మ ఇండ్ల నిర్మాణాలు త్వరగా పూర్తి చేసుకోవాలి
- హనుమకొండ జిల్లా కలెక్టర్ స్నేహ శబరీష్

హనుమకొండ ప్రతినిధి నవంబర్ 20 (జనం సాక్షి) : ఇందిరమ్మ ఇండ్ల నిర్మాణ పనులను లబ్ధిదారులు త్వరగా పూర్తి చేసుకోవాలని హనుమకొండ జిల్లా కలెక్టర్ స్నేహ శబరీష్ అన్నారు. గురువారం హనుమకొండ జిల్లా హసన్ పర్తి మండలం చింతగట్టు లో జనగాని సంధ్యారాణి, రాజ్యలక్ష్మి అనే లబ్ధిదారులకు మంజూరైన ఇందిరమ్మ ఇండ్ల నిర్మాణ పనులు తుది దశ కు చేరుకోగా అధికారులతో కలిసి కలెక్టర్ నిర్మాణ పనుల పురోగతిని పరిశీలించి లబ్ధిదారులతో మాట్లాడారు.ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ ఇండ్ల నిర్మాణ పనులను ఆలస్యం చేయకుండా త్వరగా పూర్తి చేసుకోవాలన్నారు. అనంతరం హసన్పర్తి మండలం జయగిరి ప్రాథమిక సహకార సంఘం ఆధ్వర్యంలో ఏర్పాటుచేసిన వరి ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని సందర్శించి రికార్డులను పరిశీలించారు. వరి ధాన్యం ఇప్పటివరకు ఎంత కొనుగోలు చేశారని సంబంధిత అధికారులను అడిగి తెలుసుకున్నారు.ఈ కార్యక్రమంలో గృహ నిర్మాణ శాఖ ప్రాజెక్ట్ డైరెక్టర్ హరికృష్ణ, తహసిల్దార్ కిరణ్ కుమార్, ఇతర అధికారులు పాల్గొన్నారు.

జనంసాక్షి
www.janamsakshi.org
శుక్రవారం
21 నవంబర్ 2025

# సగం ధరకే బంగారం అంటూ నకిలీ బంగారం అమ్మకం

- లక్షలు కొల్లగొడుతున్న అంతర్రాష్ట్ర ముఠా
- ఆట కట్టించిన మిర్యాలగూడ పోలీసులు
- 5 లక్షల నగదు, 200 గ్రాముల నకిలీ బంగారు నాణేలు, కారు స్వాధీనం



**మిర్యాలగూడ, నవంబర్ 20 (జనంసాక్షి) :** ఎటువంటి పరిచయాలు లేకున్నా అన్నా బావున్నారా.. నేను మీ ఊర్లో గతంలో పలనా వాళ్ళ దగ్గర పనిచేశా..మా వాళ్లకు గుప్త నిధులు దొరికాయి. బంగారం మీకు తక్కువ ధరకు ఇప్పిస్తా.. కావాలంటే బంగారం పరీక్ష చేసుకున్నాకే పైకం ఇవ్వండి అంటూ. నమ్మకంగా నమ్మబలుకుతూ..ఆపై నకిలీ బంగారం అంటకడుతూ రెండు తెలుగు రాష్ట్రాలలో లక్షలు కొల్లగొడుతున్న కర్ణాటకకు చెందిన అంతర్రాష్ట్ర ముఠా ఆట కట్టించారు మిర్యాలగూడ టూ టౌన్,నల్లగొండ సిసిఎస్ పోలీసులు. గురువారం స్థానిక సబ్ డివిజనల్ పోలీస్ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో డిఎస్పీ కె. రాజశేఖర్ రాజు నిందితుల వివరాలను వెల్లడించారు.కర్ణాటక రాష్ట్రం బళ్ళారి జిల్లా కుడ్లిగి మండలం, హురిలి కలు, కొరచరహళ్లి కి చెందిన గోవిందప్ప, మహేష్, లోహిత్, నాగప్ప, ప్రసన్న గంగప్ప లు ముఠా గా ఏర్పడి ఈజీగా లక్షలు కొల్లగొట్టేందుకు పథకం వేశారు.దానిలో భాగంగా ప్రస్తుతం బంగారం రేట్లు ఆకాశాన్ని అంటుతున్న తరుణంలో ప్రజల అమాయకత్వాన్ని, అత్యాశను ఆసరాగా చేసుకుని తమకు గుప్త నిధులు దొరికాయని, బంగారు నాణేలను తక్కువ ధరకే అందజేస్తామని నమ్మబలుకుతూ ముందుగా ఒరిజినల్ బంగారు నాణ్యాలు ఇస్తూ వాటిని పరీక్షించుకుని నమ్మకం కుదిరాకే కొనుగోలుకు రావాలంటూ నమ్మబల్కుతూ వచ్చారు. వాటిని పరీక్షించి నిజమైన బంగారం కావడంతో తక్కువ ధరకు బంగారం వస్తుందని ఆశతో అనేకమంది ముఠా సూచన మేరకు పెద్ద మొత్తంలో డబ్బులు తీసుకుని కర్ణాటకకు వెళ్లి డబ్బులు అందించేవారు. అనుమానంతో మరొకసారి పరీక్షించుకుంటామంటే పోలీసులు ఇస్తారంటూ నాన హంగామా చేసి భయపెట్టి వాళ్లకు నకిలీ బంగారం అంటగట్టి డబ్బులతో ఉడయించేవారు. ఈ క్రమంలో జగిత్యాల జిల్లా కోరుట్ల టౌన్ కు చెందిన కారపు శ్యాంసుందర్, తన మిత్రుడైన ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం పలనాడు జిల్లా పిడుగురాళ్ల కు చెందిన స్నేహితుడి వద్దకు వెళ్లి తిరిగి వెళుతున్న క్రమంలో మిర్యాలగూడ పట్టణంలోని ఉషారాణి హోటల్ వద్ద ఆగిన క్రమంలో సదరు నిందితులు అతనితో మాటలు కలిపి బంగారం విషయం వెల్లడించారు. వారి మాయ మాటలు నమ్మి తక్కువ ధరకు బంగారం వస్తున్నదన్న ఆశతో వారికి 12 లక్షలు ఇచ్చేందుకు ఒప్పందం చేసుకున్నారు. అతన్ని కర్ణాటకలోని బనికల్ వద్ద కలవాలంటూ తెలిపారు. కానీ అనుమానం వచ్చిన బాధితుడు తాము ముందుగా కలిసిన మిర్యాలగూడ ఉషారాణి హోటల్ వద్దనే కలుస్తానని తెలుపటంతో సరేనని అక్కడికి చేరుకున్న నిందితులు నకిలీ బంగారాన్ని 250 గ్రాములు అప్పగించారు. మరోసారి అనుమానించిన బాధితుడు వాటిని పరీక్షించు కోవాలని తెలపడంతో పోలీసులు వస్తున్నారంటూ మాయ మాటలతో భయభ్రాంతులకు గురిచేసి, 12 లక్షల నగదు తీసుకొని కారులో హుడాయించారు. దీంతో తనకు ఇచ్చింది నకిలీ బంగారం అని తేలడంతో మోసపోయానని గ్రహించిన బాధితుడు మిర్యాలగూడ టూ టౌన్ పోలీసులకు ఫిర్యాదు చేశాడు. కేసులు ఛాలెంజ్ గా తీసుకున్న టూ టౌన్ పోలీసులు, సిసిఎస్ పోలీసులు సంయుక్తంగా పథకం ప్రకారం వలపన్ని కేసును చేదించారు. నిందితుల్లో గోవిందప్ప పట్టుబడగా, మిగిలిన నిందితులు పరారీలో ఉన్నారు. పట్టుబడ్డ నిందితుడి వద్ద ఐదు లక్షల నగదు, 200 గ్రాముల నకిలీ బంగారు బిళ్ళలు, ఒక కారు, సెల్ ఫోన్ స్వాధీనం చేసుకున్నారు. మిగిలిన నిందితులను త్వరలోనే పట్టుకుంటామని తెలిపారు. కేసును చాకచక్యంగా ఛదించిన సిసిఎస్ సిఐలు జితేందర్ రెడ్డి, చంద్రశేఖర్ రెడ్డి, మిర్యాలగూడ టూ టౌన్ సిఐ జె.సోమనర్సయ్య, ఎస్సై రాంబాబు, సిసిఎస్ ఎస్ఐ దాచేపల్లి విజయకుమార్, హెడ్ కానిస్టేబుల్స్ విష్ణువర్ధన్ గిరి, పుష్పగిరి, కానిస్టేబుల్ వెంకట్, మహేష్, సాయి, రామకృష్ణ, లక్ష్మయ్య రాజశేఖర్ లను ప్రత్యేకంగా అభినందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఇలాంటి మోసాల పట్ల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని కోరారు. ఎవరైనా మాయమాటలతో మభ్యపెట్టినట్లయితే వెంటనే పోలీసులకు సమాచారం అందించాలని కోరారు. కాగా మిర్యాలగూడ పట్టణంలోని అనేకమంది బాధితులు ఈ ముఠాభారినపడి లక్షలు పోగొట్టుకున్నట్లుగా విశ్వసనీయ సమాచారం. ఓ బంగారు నగల తయారీ వ్యాపారి కూడా 23 లక్షల పోగొట్టుకొని, ఊరు వదిలి వెళ్ళిపోయినట్లు సమాచారం.

## పదవ తరగతిలో నూరు శాతం ఉత్తీర్ణత సాధించాలి

- కలెక్టర్ తేజస్ నంద్ లాల్ పవార్



**సూర్యాపేట ప్రతినిధి, నవంబర్ 20 (జనంసాక్షి) :** పదవ తరగతి వార్షిక పరీక్షలకు ప్రణాళిక ప్రకారం మంచిగా చదివి నూరు శాతం ఉత్తీర్ణత సాధించాలని జిల్లా కలెక్టర్ తేజస్ నంద్ లాల్ పవార్ విద్యార్థులకు సూచించారు.గురువారం నాగారం మండల కేంద్రంలోని జడ్పీహెచ్ఎస్, ప్రాధమిక ఆరోగ్య కేంద్రం, ధాన్యం కొనుగోలు కేంద్రాలను ఆకస్మికంగా సందర్శించారు.పదవ తరగతి విద్యార్థుల నోట్ బుక్స్ పరిశీలించారు. ఈ కార్యక్రమంలో ఆర్డీఓ వేణు మాధవ్, తహసీల్దార్ హరి కిషోర్ వర్మ, మెడికల్ అధికారి నాగరాజు, వ్యవసాయ అధికారి కృష్ణకాంత్,ప్రధాన ఉపాధ్యాయులు జ్ఞానేశ్వర్ చారి, సీనియర్ అసిస్టెంట్ షఫి, సెంటర్ ఇంచార్జి దశరద,ఉపాధ్యాయులు శ్యామ్ సుందర్ రెడ్డి, అధికారులు తదితరులు పాల్గొన్నారు.

## భూ మాఫియా చర్యలు నుంచి దాన్వాయిగూడెం వాటర్ ఫిల్టర్ బెల్ట్స్ రక్షించండి

- జిల్లా కలెక్టర్, మంత్రులకు సీపీఐ విజ్ఞప్తి



**ఖమ్మం, నవంబర్ 20 (జనం సాక్షి) :** ఖమ్మం కార్పొరేషన్ పరిధిలో 58వ డివిజన్ భూర్హాంపురం రెవెన్యూ లో ఉన్న దాన్వాయిగూడెం వాటర్ ఫిల్టర్ బెడ్స్ పార్క్ వెనక భాగం మున్నేరు వరకు గుట్టలు తొవ్వి కబ్జాల కు పాల్పడుతున్నారని అనేక సార్లు అధికారులకు మొర్ర బెట్టుకున్న చలనం లేదని ఎద తదంగా కబ్జా దారులు రెచ్చిపోతున్నారని సీపీఐ తీవ్రంగ ఆవేదన వ్యక్తం చేసింది. ఈ రోజు ఆ గుట్ట చుట్టు కర్రకట్ట వరకు సీపీఐ నాయకులు సందర్శించారని సీపీఐ రాష్ట్ర సమితి సభ్యులు మహమ్మద్ సలాం మాట్లాడుతూ అధికారులు స్పందించకపోతే ప్రభుత్వ భూమిలో ఇల్లు ఏపిస్తామని అప్పుడు ఎవరు ఏమి చేస్తారో చూస్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో జిల్లా కార్యవర్గ సభ్యులు యానాలి సాంభశివరెడ్డి, త్రి టౌన్ ఏరియా కార్యదర్శి నూనె శేషీధర్, చానా, శేఖర్, ముజమ్మిల్, దుర్గా నాథ్ తదితరులు సందర్శించారు.

## ఇసుక అక్రమ రవాణాకు అడ్డుకట్ట



**భద్రాచలం, నవంబర్ 20 (జనంసాక్షి) :** భద్రాద్రి కొత్తగూడెం జిల్లా :- భద్రాచలం గోదావరి నదీ ప్రవాహ ప్రాంతం నుండి అక్రమ ఇసుక రవాణా జరుగుతుందని వచ్చిన వార్తలపై స్పందించిన సంబంధిత అధికారులు రవాణా మార్గంలో ట్రెంచ్ కొట్టించి అక్రమ ఇసుక రవాణాకు అడ్డుకట్ట వేశారు. భద్రాచలం రెవిన్యూ, పోలీస్, ఫారెస్ట్, మైనింగ్ అధికారుల ఆధ్వర్యంలో అక్రమ ఇసుక రవాణాకు అడ్డుకట్టలో భాగంగా భద్రాచలం గోదావరి వద్ద జెసిబి మిషన్తో సాయంతో ట్రెంచు తీయించారు. నిబంధనలకు విరుద్ధంగా ఎటువంటి అక్రమ రవాణాలు జరిగితే ఎంతటి వారినైనా ఉపేక్షించేది లేదని కఠిన చర్యలు ఉంటాయని సంబంధిత అధికారులు తెలియజేశారు.

## పుణ్యలింగేశ్వరా స్వామి దర్శనంతో జీవితం ధన్యమైంది

- సుప్రసిద్ధ సినీనటుడు రాజేంద్రప్రసాద్



**చౌటుప్పల్, నవంబర్ 20 (జనం సాక్షి) :** జీవితంలో తాను ఎన్నో ఆలయాలు సందర్శించినప్పటికీ శ్రీ పుణ్యలింగేశ్వరా స్వామి ఆలయ దర్శనంతో తన జీవితాన్ని ధన్యం చేసుకున్నానని సుప్రసిద్ధ సినీనటులు, నట కిరీటి డాక్టర్ రాజేంద్ర ప్రసాద్ స్పష్టం చేసారు. గురువారం ఆయన యాదాద్రి భువనగిరి జిల్లా చౌటుప్పల్‌లో వెలిసిన శ్రీ పుణ్యలింగేశ్వరా స్వామి ఆలయాన్ని,అమ్మా నాన్న అనాథుల పుణ్యక్షేత్రాన్ని దర్శించుకున్నారు. కార్తీక మాసం చివరి రోజైన గురువారం నాడు పుణ్యలింగేశ్వర స్వామి క్షేత్రంలో పంచ మహా యాగాల పూర్ణహుతిని సమర్పించారు. ఆలయ వ్యవస్థాపకులు శ్రీ శంకర గురూజీతో పాటు రాజేంద్ర ప్రసాద్ చేతుల మీదుగా యాగాలను ముగించారు. అనంతరం ఆయన మీడియా ప్రతినిధులతో మాట్లాడుతూ, ఇప్పటివరకు తాను ఎన్నో సినిమాల్లో నటించానని, అయితే "ఆ నలుగురు" చిత్రం మాత్రమే తనకు ఎంతో తృప్తి ఇచ్చిందని, అలాగే ఒకే చోటా అన్ని లింగాలు ఉన్న శ్రీ పుణ్య లింగేశ్వరా స్వామి ఆలయ దర్శనం చేసుకోవడం అంతే తృప్తి ఇచ్చిందన్నారు. ఒకే చోటా మానవ సేవా, మాధవ సేవా ఈ పుణ్యక్షేత్రంలో జరగడం గొప్ప విషయమంటూ పుణ్యక్షేత్ర వ్యవస్థాపకులు శ్రీ శంకర గురూజీని ఆయన అభినందించారు.

## ఐకేపీలో రైతు ధాన్యం మాయం..

- పోలీస్ స్టేషన్‌లో పిర్యాదు



**గుర్రంపోడు, నవంబర్ 20 (జనంసాక్షి) :** నల్గొండ జిల్లా గుర్రంపోడ్ మండలం చామలోని బావిలో ఐకేపీ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ధాన్యం కోనుగోలు కేంద్రంలో తన దాన్యపు రాశిలో 10 బస్తాల ధాన్యం మిస్సయిందని రైతు ఎరుకల ఆంజనేయులు ఆవేదన వ్యక్తం చేసాడు.ఆరుగాలం కష్టపడి పండించిన పంట కొనుగోలు కేంద్రం దాకా తీసుకొచ్చాక దోపిడీకి గురైందని,75 బస్తాల నుండి సుమారు 80 బస్తాలు కావాల్సిన దాన్యం కేవలం 62 బస్తాలు మాత్రమే అయ్యాయని పోలీసులకు ఇచ్చిన పిర్యాదులో ఆయన పేర్కొన్నారు.ఇదే విషయమై సీసీ అంజయ్య ని వివరణ కోరగా రైతు దాన్యం అపహారణకు గురైందని తన దృష్టికి తీసుకురావడంతో వెంటనే స్థానిక తహసీల్దార్ మరియు ఎస్సై లకు సమాచారం అందిచ్చానని, విచారణ చేపట్టి రైతుకు న్యాయం చేస్తామని వారు తెలిపినట్టు సీసీ అంజయ్య మీడియాకు తెలిపారు.

## రాష్ట్రస్థాయి వాలీబాల్ పోటీలకు ఎంపికైన హుజూర్‌నగర్ వీవీఎం విద్యార్థులు



**హుజూర్‌నగర్, నవంబర్ 20 (జనంసాక్షి) :** రాష్ట్రస్థాయి వాలీబాల్ పోటీలకు హుజూర్ నగర్ వివిఎం పాఠశాల విద్యార్థులు నరేష్, సంజయ్ ఎంపికైనట్లు గురువారం పాఠశాల కారస్పాండెంట్ సిస్టర్ గాలి సుందరి తెలిపారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ భువనగిరి జిల్లా బొమ్మలరామారంలో జరిగిన ఉమ్మడి నల్గొండ జిల్లా స్థాయి వాలీబాల్ పోటీలలో పాల్గొని విశేష ప్రదర్శన కనబర్చి రాష్ట్ర స్థాయి వాలీబాల్ పోటీలకు ఎంపికైన హుజూర్ నగర్ విజయ విద్యా మందిర్ (వివిఎం) పాఠశాలలో 9వ తరగతి చదువుతున్న విద్యార్థులు నరేష్, సంజయ్ లను వారిని తీర్చిదిద్దిన వ్యాయామ ఉపాధ్యాయులు శ్రీకాంత్ రెడ్డిని, పాఠశాల కారస్పాండెంట్ సిస్టర్ గాలి సుందరి, ప్రధానోపాధ్యాయులు సిస్టర్ అనితలు అభినందించారు. విద్యార్థులు క్రీడలలో మరింత ఉన్నత స్థితికి చేరాలని వారు కోరారు.

## ఈ నెల 30 వరకు జనగణన 2027 ప్రీ-టెస్ట్



**పినపాక, నవంబర్ 20 (జనం సాక్షి) :** ప్రీ టెస్ట్ జనగణన – ఇంటి గణన కార్యక్రమం పకడ్బందీగా ఏ తప్పులు లేకుండా నిర్వహించాలని తెలంగాణ డైరెక్టరేట్ ఆఫ్ సెన్సస్ ఆపరేషన్ భారతి హొలికేరి అన్నారు. గురువారం మధ్యాహ్నం పినపాక మండలం తోగూడెం గ్రామంలో జరుగుతున్న జనగణన ప్రీ టెస్ట్ సర్వేను డిప్యూటీ డైరెక్టర్ సుబ్బరాజు తో కలిసి పరిశీలించారు . నేరుగా ఇంటింటికి తిరుగుతూ ఆన్లైన్ ప్రక్రియను పరిశీలించారు. ఆన్లైన్ వివరాల నమోదును అడిగి తెలుసుకున్నారు. అనంతరం ఆమె మాట్లాడుతూ శిక్షణ పొందిన ఎన్యూరేటర్లు డిజిటల్ లేఅవుట్ యాప్ లో ఇండ్లకు జియోట్యాగింగ్ చేశారన్నారు. ఈ నెల 10వ తేదీ నుంచి హౌస్ లిస్టింగ్ యాప్ లో వివరాలు సేకరిస్తున్నారు. ఈ కార్యక్రమంలో జాయింట్ డైరెక్టర్ సెన్సెస్ ఆపరేషన్ ఆర్ శేఖర్, డిప్యూటీ డైరెక్టర్ సుబ్బరాజు, సెన్సెస్ ఆఫీసర్లు సతీష్, హిమవర్ష, హరిత, వినయ్, తిరుపతి, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

## మత్స్యకారుల అభ్యున్నతే ప్రభుత్వ లక్ష్యం



**దేవరకొండ, నవంబర్ 20 (జనం సాక్షి) :** చెరువులలో చేప పిల్లలను విడవడం మత్స్యకారుల జీవనోపాధిలో వెలుగులు నింపడం, గ్రామీణ ఆర్థిక వ్యవస్థను బలోపేతం చేయడం కోసం చేపట్టిన విప్లవాత్మక చర్య అని దేవరకొండ ఎమ్మెల్యే నేనావత్ బాలు నాయక్ అన్నారు. గురువారం మండలంలోని కొండభీమనపల్లి చెరువులో మత్స్య శాఖ అధికారులతో కలిసి చెరువులో నాణ్యమైన చేప పిల్లలను విడుదల చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ నియోజకవర్గంలోని 241 చెరువుల్లో 2 కోట్లకు పైగా చేపపిల్లల విడుదల చేస్తామని తెలిపారు. మత్స్యకారుల సంక్షేమానికి ప్రజా ప్రభుత్వం కట్టుబడి ఉన్నదనే విషయాన్ని ఆయన ఈ సందర్భంగా గుర్తు చేశారు. నాణ్యమైన మరియు పోషకాలతో కూడిన చేపపిల్లలను పంపిణీ చేయడం ద్వారా చెరువుల జీవవైవిధ్యం పెరుగుతుందని తెలిపారు.గ్రామీణ ప్రాంతాల్లోని మత్స్యకార కుటుంబాలకు అదనపు ఆదాయం లభించి జీవన ప్రమాణాలు మెరుగుపడతాయని తెలిపారు.మత్స్యకారుల ఆర్థిక స్థితిని బలపరచడం ప్రజా ప్రభుత్వ ధ్యేయమని ఎమ్మెల్యే స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో ఆర్డీవో రమణా రెడ్డి, ఎంపీడీవో డానియల్, ఎమ్మార్వో మధుసూదన్ రెడ్డి, మత్స్య శాఖ అధికారులు, మాజీ మున్సిపల్ చైర్మన్ ఆలంపల్లి నర్సింహ, మండల పార్టీ అధ్యక్షుడు లోకసాని శ్రీధర్ రెడ్డి, కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు రుక్మారెడ్డితో పాటు నాయకులు, కార్యకర్తలు, గ్రామ పెద్దలు, తదితరులు పాల్గొన్నారు.

## ఈవీఎంలు మార్చడం, దొంగ ఓట్లను దండుకోవడంపై బీజేపీ దృష్టి

- ఎమ్మెల్సీ, సిపిఐ జిల్లా కార్యదర్శి నెల్లికంటి సత్యం



**వేములపల్లి, నవంబర్ 20 (జనంసాక్షి) :** అధికారాన్ని అడ్డుపెట్టుకోవడానికి ఈవీఎంలు మార్చడం దొంగఓట్లను దండుకోవడంపైనే ప్రధాని నరేంద్ర మోడీ నాయకత్వం లోని బిజెపి సర్కారు దృష్టి పెట్టి, నక్సలిజం పేరుతో అమాయక ప్రజాలను కాల్చిచంపుతుందని ఎమ్మెల్సీ, సిపిఐ జిల్లా కార్యదర్శి నెల్లికంటి సత్యం ఆరోపించారు. నరేంద్రమోడీ అధికారం కోసం ఈవీఎంలు మార్చడం దొంగఓట్లను దండుకోవడంపై పెట్టిన దృష్టి దేశాభివృద్ధి ప్రజల సంక్షేమంపై పెట్టలేదన్నారు. నక్సలిజం పేరుతో అమాయక ప్రజలను కాల్చి చంపుతూ అధికారాన్ని కాపాడుకోవడమే బిజెపిఎజెండాగాపెట్టుకుందన్నారు. ఈ కార్యక్రమంలో సిపిఐ జిల్లా సహాయ కార్యదర్శులు పల్లా దేవేందర్ రెడ్డి లోడంగి శ్రవణ్ కుమార్, జిల్లాకార్యవర్గసభ్యులుపబ్బువీర స్వామి,బంటు వెంకటేశ్వర్లు, వేములపల్లి, మాడ్గుల పల్లి మండల కార్యదర్శులు జిల్లాయాదగిరి,పుల్లెం ల అబ్రహం,ప్రజానాట్యమండలి జిల్లా అధ్యక్షులు బి జగన్, గణేష్ నాయక్, జిల్లా యాదయ్య తదితరులు పాల్గొన్నారు.

## ఘనంగా 58వ జాతీయ గ్రంథాలయ వారోత్సవాలు ముగింపు



**భువనగిరి, నవంబర్ 20 (జనం సాక్షి) :** 58వ జాతీయ గ్రంథాలయ వారోత్సవాల ముగింపు సమావేశం మరియు నృత్య పోటీలు ఈరోజు జిల్లా కేంద్ర గ్రంథాలయం భువనగిరిలో నిర్వహించడం జరిగినది. ఈ సమావేశానికి జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ ఎండి. అవైస్ ఉర్ రెహ్మాన్ చిస్తి అధ్యక్షత వహించినారు. ఈ సమావేశానికి ముఖ్య అతిథులుగా ప్రభుత్వ విప్, ఆలేరు శాసనసభ్యులు బీర్ల ఐలయ్య , భువనగిరి శాసనసభ్యులు కుంభం అనిల్ కుమార్ రెడ్డి , జిల్లా కలెక్టర్ హనుమంతరావు , జిల్లా గ్రంథాలయ సంస్థ కార్యదర్శి ఎం. సుధీర్ , భువనగిరి మార్కెట్ కమిటీ చైర్మన్ రేఖ బాబురావు , వలిగొండ మార్కెట్ కమిటీ చైర్మన్ బీమా నాయక్ , భువనగిరి మాజీ మార్కెట్ కమిటీ చైర్మన్ శ్రీ పొత్నాక్ ప్రమోద్ కుమార్, భువనగిరి మాజీ మున్సిపల్ చైర్మన్ శ్రీ పోతంశెట్టి వెంకటేశ్వర్లు , కాంగ్రెస్ పార్టీ టౌన్ ప్రెసిడెంట్ కూర వెంకటేష్ , బిజెపి టౌన్ ప్రెసిడెంట్ రత్నపురం బలరాం , మాజీ గ్రంథాలయ కమిటీ డైరెక్టర్ పోలిశెట్టి అనిల్ కుమార్ , శెట్టి బాలయ్య , మాజీ మున్సిపల్ చైర్మన్ బర్రె జహంగీర్ , పోతంశెట్టి వెంకటేశ్వర్లు, పింగల్ రెడ్డి, శ్రీ బట్టు రామచంద్రయ్య , బాలేశ్వర్, బీబీనగర్ కాంగ్రెస్ మండల అధ్యక్షులు సత్తి రెడ్డి , వలిగొండ మాజీ ఎంపీపీ నూతి రమేష్ , ఎస్సీ సెల్ జిల్లా అధ్యక్షులు దర్గాయి హరిప్రసాద్ పాల్గొన్నారు. ఈ కార్యక్రమానికి ముందుగా జ్యోతి ప్రజ్వలన చేసి సరస్వతి దేవి చిత్రపటాలకు పూలమాల అలంకరణ తో ఈ కార్యక్రమాన్ని ప్రారంభించడం జరిగినది. ఈ కార్యక్రమంలో ప్రభుత్వ విప్ బీర్ల అయిలయ్య, భువనగిరి శాసనసభ్యులు కుంభం అనిల్ కుమార్ రెడ్డి మాట్లాడుతూ గ్రంథాలయాలను తమ నిధులతో అభివృద్ధి చేస్తామని వారంలో రెండు రోజులైనా సెల్ ఫోన్లు పక్కన పెట్టి పుస్తకాలు చదవాలని గ్రంథాలయాలను సందర్శించాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో అతిథులు వారం రోజులపాటు నిర్వహించిన వివిధ పోటీలలో గెలుపొందిన విద్యార్థులకు బహుమతులు ప్రశంసా పత్రాలు అందజేశారు. జిల్లా గ్రంథాలయ చైర్మన్ పాఠకుల నుండి ఇద్దరిని ఉత్తమ పాఠకులుగా గుర్తించి బహుమతి ప్రధానం చేసినారు. చివరగా వందన సమర్పణ శ్రీ మధుసూదన్ రెడ్డి గ్రంథపాలకులు చేసినారు. ఈ కార్యక్రమంలో జిల్లాలోని గ్రంథాలయ ఉద్యోగులు పాఠకులు తదితరులు పాల్గొన్నారు.






## 26వేల మార్కుపైన ముగిసిన నిఫ్టీ

**ముంబై:**గురువారం ఉదయం లాభాల్లో ప్రారంభమైన దేశీయ స్టాక్ మార్కెట్లు.. ట్రేడింగ్ క్లోజ్ అయ్యే సమయానికి భారీ లాభాల్లో ముగిశాయి. సెన్సెక్స్ 446.21 పాయింట్లు లేదా 0.52 శాతం లాభంతో..85,632.68 వద్ద, నిఫ్టీ 139.50 పాయింట్లు లేదా 0.54 శాతం లాభంతో 26,192.15 వద్ద నిలిచాయి. సెక్యూర్‌క్లౌడ్ టెక్నాలజీస్ లిమిటెడ్, లగ్నమ్ స్పింటెక్స్, ఆస్టెక్ లైఫ్ సైన్సెస్, ప్రీమియర్ పాలీఫిల్మ్, వాస్వానీ ఇండస్ట్రీస్ లిమిటెడ్ వంటి కంపెనీలు టాప్ గెయినర్స్ జాబితాలో నిలిచాయి. మాగెల్లానిక్ క్లౌడ్, ఎనర్జీ డెవలప్‌మెంట్ కంపెనీ, మంగళం డ్రగ్స్ ఆర్గానిక్స్, ఫుజియామా పవర్ సిస్టమ్స్ లిమిటెడ్, సౌత్ ఇండియన్ బ్యాంక్ వంటివి నష్టాలను చవిచూసాయి.

# ఈ-కామర్స్ అనైతిక పద్ధతులకు కేంద్రం కళ్లెం

**• తొలగింపునకు సిద్ధమైన 26 కంపెనీలు • నిబంధనలు ఉల్లంఘిస్తే కఠిన చర్యలు**

**న్యూఢిల్లీ:** ఈ-కామర్స్ ప్లాట్‌ఫామ్‌లు వినియోగదారులను మోసగించేందుకు అనుసరిస్తున్న 'డార్క్ ప్యాటర్న్స్' (అనైతిక పద్ధతులు)కు అడ్డుకట్ట వేయడానికి కేంద్ర ప్రభుత్వం కఠిన చర్యలు చేపట్టింది. ఈ అనైతిక పద్ధతులను తొలగించడానికి వీలుగా సెల్ఫ్ ఆడిట్ (స్వీయ తనిఖీ) చేసుకోవాలని కేంద్ర ప్రభుత్వం నిబంధనలు విధించింది. కేంద్ర ప్రభుత్వం విధించిన ఈ నిబంధనలకు అనుగుణంగా వ్యవహరించడానికి దేశంలోని 26 ప్రధాన ఈ-కామర్స్ కంపెనీలు ముందుకు వచ్చాయి. ఫ్లిప్‌కార్ట్, మేక్ మై ట్రిప్ వంటి అగ్రశ్రేణి కంపెనీలతో సహా పలు సంస్థలు ఇప్పటికే తమ ప్లాట్‌ఫామ్స్‌పై డార్క్ ప్యాటర్న్స్ ఉన్నాయా లేవా అని ఆడిట్ నిర్వహించినట్లు వెల్లడించాయి. ఆన్‌లైన్ వ్యాపారం చేసే అన్ని కంపెనీలు ఈ పద్ధతులను విధిగా పాటించాలని కేంద్ర ప్రభుత్వం ఆదేశించింది. కస్టమర్ల మనస్తత్వాలను వాడుకుని వారి ఇష్టానికి వ్యతిరేకంగా లేదా బలవంతంగా కొనుగోళ్లు, సబ్‌స్క్రిప్షన్‌లు లేదా డేటా షేరింగ్‌ను చేయించేలా ఈ-కామర్స్ ప్లాట్‌ఫామ్‌లు ఉపయోగించే మోసపూరితమైన డిజైన్ పద్ధతులనే డార్క్ ప్యాటర్న్స్ అంటారు. వినియోగదారులకు తెలియకుండానే లేదా వారు సులభంగా క్యాన్సిల్ చేయలేని విధంగా సబ్‌స్క్రిప్షన్ ప్యాకేజీల్లో ఇరికిస్తారు. 'మరో 10 నిమిషాల్లో ఈ ఆఫర్ ముగుస్తుంది', 'మీకు మాత్రమే ప్రత్యేకం', 'ఈ వస్తువులు ఇంకో 5 మాత్రమే మిగిలాయి' అంటూ ఒత్తిడి పెంచి తప్పుడు ప్రకటనలతో కొనుగోలుకు ప్రేరేపిస్తారు. కస్టమర్లు సులభంగా అర్థం చేసుకోలేని సాంకేతిక పదజాలం లేదా నిబంధనలను ఉపయోగించి వారికి తెలియకుండానే కొన్ని అంశాలకు అంగీకరించేలా చేస్తారు. ఈ-కామర్స్ ప్లాట్‌ఫామ్‌లు ఈ అనైతిక పద్ధతులకు పాల్పడినట్లు తేలితే లేదా వినియోగదారులను మోసగించే చర్యలకు పాల్పడినట్లు రుజువైతే వాటిపై కఠిన చర్యలు తీసుకుంటామని సెంట్రల్ కన్స్యూమర్ ప్రొటెక్షన్ అథారిటీ గట్టిగా హెచ్చరించింది. కేంద్ర ప్రభుత్వం తీసుకున్న ఈ నిర్ణయం వినియోగదారుల హక్కుల రక్షణలో కీలకమైన ముందడుగుగా చెప్పవచ్చు. ఆన్‌లైన్ షాపింగ్ పెరిగిన నేపథ్యంలో కమీషన్ల కోసం, ఎక్కువ లాభాల కోసం ఈ-కామర్స్ కంపెనీలు అనుసరించే డార్క్ ప్యాటర్న్స్ కారణంగా మధ్యతరగతి వినియోగదారులు చాలా వరకు నష్టపోతున్నారు. ఈ కొత్త నిబంధనల అమలు, సెల్ఫ్ ఆడిట్ ద్వారా ప్లాట్‌ఫామ్‌ల్లో పారదర్శకత పెరుగుతుంది. ఫ్లిప్‌కార్ట్, మేక్ మై ట్రిప్ వంటి పెద్ద కంపెనీలు స్వచ్ఛందంగా ముందుకు రావడం ఈ నిబంధనల విజయానికి సానుకూల సంకేతంగా ఉంది. భవిష్యత్తులో సీసీపీఏ ఈ నిబంధనలను కఠినంగా అమలు చేయాలని యూజర్లు కోరుతున్నారు.



## సేమ్ ప్రాబ్లమ్..

### మొన్న మారుతి సుజుకి.. నేడు టయోటా!

మారుతి సుజుకి తన గ్రాండ్ విటారా కారుకు ఫ్యూయెల్ గేజ్ కారణంగా రీకాల్ ప్రకటించిన తరువాత.. టాయోటా కూడా తన అర్బన్ క్రూయిజర్ హైరైడర్‌కు రీకాల్ జారీ చేసింది. ఈ కారుకు రీకాల్ ప్రకటించడానికి ప్రధాన కారణం కూడా ఫ్యూయెల్ గేజ్ సమస్య కావడం గమనార్హం. 2024 డిసెంబర్ 9 నుంచి 2025 ఏప్రిల్ 29 మధ్య తయారైన టయోటా అర్బన్ క్రూయిజర్ కార్లు రీకాల్‌కు ప్రభావితమయ్యాయి. ఫ్యూయెల్ గేజ్ సమస్య కారణంగా.. కారులో ఎంత ఇంధనం ఉందనే విషయాన్ని వాహన వినియోగదారుకు చూపించదు. దీనివల్ల దూర ప్రయాణం సమయంలో సమస్య తలెత్తే అవకాశం ఉంటుంది. అంటే.. తక్కువ ఇంధనం ఉన్నప్పుడు కూడా ఇండికేటర్ చూపించకపోవడం వల్ల, డ్రైవర్ ఎప్పుడు ఫ్యూయెల్ ఫిల్ చేసుకోవాలో తెలియకుండా పోతుంది. ఇది అత్యవసర సమయంలో ఇబ్బందులకు గురి చేస్తుంది. సమస్యకు ప్రభావితమైన కార్లను కంపెనీ గుర్తించి, యజమానులకు సందేశం (ఎస్ఎమ్ఎస్, ఈమెయిల్) పంపిస్తుంది. తద్వారా ఓనర్ కారులోని సమస్యను ఉచితంగానే పరిష్కరించుకోవచ్చు. దీనికోసం డబ్బు చెల్లించాల్సిన అవసరం లేదు.



## హోండా కార్స్ ఇండియా నుండి కొత్త ఆవిష్కరణ

### హైదరాబాద్‌లో స్టైలిష్, బోల్డ్ ఎలివేట్ ఏడీవీ ఎడిషన్ విడుదల




**హైదరాబాద్(జనంసాక్షి):** హోండా కార్స్ ఇండియా లిమిటెడ్ (హెచ్‌సీఐఎల్) సంస్థ భారతదేశంలో అత్యంత నాణ్యమైన, విలాసవంతమైన కార్లను తయారు చేయడంలో అగ్రగామిగా ముందంజలో ఉంది. ఈ సంస్థ ఇవాళ హైదరాబాద్ నగరంలో తమ అపారమైన ప్రజాదరణ పొందిన స్పోర్ట్స్ యుటిలిటీ వెహికల్ (ఎస్‌యూవీ) అయిన హోండా ఎలివేట్ ఉత్పత్తుల శ్రేణిలో ఒక కొత్త, ముఖ్యమైన అత్యున్నత స్థాయి శ్రేణి మోడల్‌ను పరిచయం చేసింది. ఆ నూతన మోడల్ పేరే ఎలివేట్ ఏడీవీ ఎడిషన్. ఈ ఆవిష్కరణ వాహన ప్రియులను విశేషంగా ఆకర్షించింది. ఈ ఏడీవీ ఎడిషన్‌ను ముఖ్యంగా చురుకైన, డైనమిక్ జీవనశైలిని అనుసరించే యువ వినియోగదారుల కోసం ప్రత్యేకంగా రూపొందించారు. ఈ నూతన మోడల్, ఎలివేట్ కారుకు ఉన్న బలమైన రూపకల్పన, ఉత్తేజకరమైన ఐ-వీటెక్ ఇంజిన్ పనితీరు, మరియు అత్యాధునిక హోండా సెన్సింగ్ భద్రతా లక్షణాలు అన్నింటినీ ఒకేచోట చేర్చింది. అంతేకాక, వీటన్నిటితో పాటు, ఇది సాధారణం కంటే మరింత క్రీడాస్ఫూర్తిని, ప్రత్యేకమైన రూపాన్ని కలిగి ఉంది. ఈ లక్షణాలన్నీ కారు స్థానాన్ని పరిపూర్ణంగా ప్రతిబింబిస్తాయి. ఎలివేట్ ఏడీవీ ఎడిషన్ ప్రారంభోత్సవం సందర్భంగా హోండా కార్స్ ఇండియా లిమిటెడ్ సంస్థ మార్కెటింగ్ సేల్స్ విభాగ వైస్ ప్రెసిడెంట్, కునాల్ బెహల్ మాట్లాడుతూ.. హోండా ఎలివేట్ కారుకు దేశవ్యాప్తంగా ఉన్న వినియోగదారుల నుండి సానుకూలమైన, గొప్ప స్పందన లభించింది. అపారంగా అభిమానించబడిన మా స్పోర్ట్స్ యుటిలిటీ వెహికల్ (ఎస్‌యూవీ) అయిన హోండా ఎలివేట్ ఉత్పత్తుల శ్రేణిలో అత్యున్నత స్థాయి మోడల్‌గా ఎలివేట్ ఏడీవీని పరిచయం చేయడం ద్వారా, మేము మా వినియోగదారులకు వారి చురుకైన, నిరంతరం మారుతున్న జీవనశైలికి సరిపోయేలా మరిన్ని ఎంపికలను అందించాలని లక్ష్యంగా పెట్టుకున్నాము అని అన్నారు.

## గుడ్ల ధరలు

| హైదరాబాద్ | వరంగల్ |
|---|---|
| ₹ 6.25 | ₹ 6.27 |

## బంగారం ధరలు (10 గ్రాములు)

హైదరాబాద్

| | |
|---|---|
| ₹ 1,24,260 (22 క్యారెట్లు) | ₹ 1,24,260 (24 క్యారెట్లు) |

## వెండి ధరలు (కేజీ)

హైదరాబాద్

₹ 1,73,000

## వారానికి 72 గంటల పని.. వారికి మాత్రమే!

**న్యూఢిల్లీ:** ఇన్ఫోసిస్ నారాయణమూర్తి ఇటీవల చైనా పాటిస్తున్న 996 రూల్ గురించి మాట్లాడుతూ.. యువత వారానికి 72 గంటలు పనిచేయాలని అన్నారు. దీనిపై ఆరిన్ క్యాపిటల్ చైర్మన్ 'మోహన్‌దాస్ పాయ్' స్పందించారు. ఇన్ఫోసిస్ వ్యవస్థాపకుడు ఎన్ఆర్ నారాయణమూర్తి యువ భారతీయులను ఎక్కువ గంటలు పనిచేయాలని కోరారు. కానీ మూర్తి వ్యాఖ్యలు కేవలం వ్యవస్థాపకులు, ఆవిష్కర్తలను మాత్రమే లక్ష్యంగా చేసుకుని ఈ వ్యాఖ్యలు చేసారని మోహన్‌దాస్ పాయ్ పేర్కొన్నారు. ఇది సాధారణ ఉద్యోగులకు వర్తించదని ఆయన పేర్కొన్నారు. ఇన్ఫోసిస్ నారాయణమూర్తి వ్యాఖ్యలను చాలామంది తప్పుగా అర్థం చేసుకున్నారు. ప్రపంచ వ్యాప్తంగా పోటీతత్వం ఎక్కువైంది. టెక్ కంపెనీలు అభివృద్ధి చెందాలంటే.. ఎక్కువ గంటలు పనిచేయాల్సిన అవసరం ఉంది. సాధారణ ఉద్యోగులను 70 గంటలు పని చేయమని అడగడం లేదు. బ్యాంకు సిబ్బందిని లేదా ఆఫీసుకు వెళ్లేవారిని ఎవరూ ఇలా చేయమని అడగడం లేదని పాయ్ తెలిపారు. చైనాలో పాటిస్తున్న 9-9-6 నియమాన్ని ఇన్ఫోసిస్ నారాయణమూర్తి ఒక ఇంటర్వ్యూలో పేర్కొన్నారు. 996 ఫార్ములా ప్రకారం ఉదయం 9 గంటల నుంచి రాత్రి 9 గంటల వరకు పని, వారానికి 6 రోజులను సూచిస్తుంది. అంటే రోజుకు 12 గంటలు.. 6 రోజులు చేయాలన్నమాట. ఇలా మొత్తానికి వారానికి 72 గంటలు పనిచేయాలన్నమాట. చైనాలోని చాలా కంపెనీలు ఈ నియమాన్ని పాటిస్తున్నాయి. దీనిపై అనేక విమర్శలు వచ్చాయి. కొన్ని సంస్థలు ఈ నియమాన్ని రద్దు చేసినప్పటికీ.. ఇంకొన్ని అమలు చేస్తూనే ఉన్నాయి.

## జియో కొత్త ఆఫర్.. 18 నెలలు ఉచితం!

**న్యూఢిల్లీ:** ప్రముఖ టెలికాం సంస్థ జియో ఇప్పుడు తన అపరిమిత 5జీ వినియోగదారులందరికీ జెమిని ప్రో ప్లాన్ ను ఉచితంగా అందిస్తోంది. ఇంకా ఈ ప్లాన్ లో కొత్త జెమిని 3 మోడల్ కు ఉచిత యాక్సెస్ కూడా ఉంది. గూగుల్ ఇటీవలే తన సరికొత్త, అత్యంత సమర్థవంతమైన ఏఐ మోడల్.. జెమిని 3ను విడుదల చేసింది. ఈ కొత్త మోడల్ మునుపటి జెమిని కంటే మెరుగ్గా ఉందని, ఓపెన్‌ఏఐకి చెందిన జీపీటీ-5.1ను అధిగమిస్తుందని గూగుల్ పేర్కొం ది. రూ. 35,100 విలువైన జెమినీ ప్రో ప్లాన్ ను జియో యూజర్లు ఉచితంగా పొం దవచ్చు. గతంలో గూగుల్ జెమిని 2.5 ప్రో, తాజా నానో బనానా, వియో 3.1 మోడళ్లతో ఫొటోలు, వీడియోలను సృష్టించడంలో పరిమితులు ఉండేవి. అయితే, ఈ ప్లాన్ లో కొత్త జెమిని 3కు ఉచిత యాక్సెస్ కూడా ఉంది.

# రైల్వేకు ఐఆర్‌సీటీసీ కాసుల వర్షం

### ఆన్‌లైన్ టిక్కెటింగ్, క్యాటరింగ్, టూరిజం సేవలతో భారీగా ఆర్జన




**న్యూఢిల్లీ:** భారతదేశంలో ప్రతిరోజూ లక్షలాది మంది ప్రజలను రైల్వే తమ గమ్యస్థానాలకు చేరవేస్తోంది. అయితే, ఈ అతిపెద్ద రైల్వే వ్యవస్థకు ఆర్థికంగా వెన్నెముకగా నిలుస్తున్న సంస్థ ఐఆర్‌సీటీసీ (ఇండియన్ రైల్వే క్యాటరింగ్ అండ్ టూరిజం కార్పొరేషన్). కేవలం టిక్కెట్ల అమ్మకాలతోనే కాకుండా, మరెన్నో వినూత్న మార్గాల్లో భారతీయ రైల్వేకు లాభాల పంట పండిస్తున్న ఐఆర్‌సీటీసీ వ్యాపార నమూనాను ఏంటో తెలుసుకుందాం. ఐఆర్‌సీటీసీకి ప్రధాన ఆదాయ వనరుల్లో ఒకటి రైల్వే టిక్కెట్ బుకింగ్. ఆన్‌లైన్‌లో టిక్కెట్ బుక్ చేసినప్పుడు ప్రయాణికుల నుంచి నామమాత్రపు సర్వీస్ ఛార్జ్‌ను వసూలు చేస్తుంది (ఉదాహరణకు, నాన్-ఏసీ టిక్కెట్లపై రూ. 15, ఏసీ టిక్కెట్లపై రూ. 30). పేమెంట్ గేట్‌వేలను ఉపయోగించినందుకు వసూలు చేసే కన్వీనియన్స్ ఫీజు కూడా ఆదాయంగా మారుతుంది. అత్యవసర బుకింగ్ అయిన తత్కాల్ ద్వారా కూడా ఐఆర్‌సీటీసీ మంచి మొత్తాన్ని ఆర్జిస్తుంది. రైల్వే స్టేషన్లు, రైళ్లలో ఆహార సరఫరా, క్యాటరింగ్ సేవల నిర్వహణను ఐఆర్‌సీటీసీ పర్యవేక్షిస్తుంది. ఈ విభాగం ఆదాయంలో ముఖ్యమైన వాటాను కలిగి ఉంది. ప్రీమియం రైళ్లు (రాజధాని, శతాబ్ది వంటివి), ఇతర ఎక్స్‌ప్రెస్ రైళ్లలో ఆహారాన్ని సరఫరా చేస్తున్నారు. అత్యున్నత ప్రమాణాలతో కూడిన ఆహారాన్ని తయారుచేయడానికి దేశవ్యాప్తంగా ఐఆర్‌సీటీసీ ఆధునిక బేస్ కిచెన్‌లను నిర్వహిస్తోంది. రైల్వే స్టేషన్లలో ఫుడ్ ప్లాజాలు, స్టాళ్లను నిర్వహించడం ద్వారా లేదా వాటిని ప్రైవేట్ సంస్థలకు లీజుకి ఇవ్వడం ద్వారా కూడా ఆదాయం లభిస్తుంది. భారతదేశ వారసత్వం, ఆధ్యాత్మిక ప్రదేశాలను ప్రజలకు పరిచ యం చేస్తూ ఐఆర్‌సీటీసీ టూరిజం సేవలను అంది స్తుంది. 'భారత్ గౌరవ్' వంటి ప్రత్యేక టూరిజం రైళ్లను నడుపుతోంది. దేశీయ, అంతర్జాతీయ విమాన, బస్సు టూర్ ప్యాకేజీలను అందించి లాభాలను ఆర్జిస్తోంది. రైల్వే స్టేషన్లలో ఉన్న విశ్రాంతి గృహాలు, హోటళ్లను లీజుకిచ్చి వాటి నిర్వహణ ద్వారా ఆదాయం సమకూర్చుకుంటోంది. రైళ్లలో, రైల్వే స్టేషన్లలో ప్యాకేజ్డ్ తాగునీరు అవసరం చాలా ఎక్కువ. ఐఆర్‌సీటీసీ సొంత బ్రాండ్‌గా 'రైల్ నీర్'ను తయారు చేసి విక్రయిస్తుంది. రైల్వే ఆవరణలో రైల్ నీర్‌కు ప్రాధాన్యత ఇవ్వడం వల్ల ఈ విభాగం నుంచి స్థిరమైన, గణనీయమైన ఆదాయం లభిస్తుంది. ప్రైవేట్ బ్రాండ్స్ కంటే తక్కువ ధరకు నీటిని అందించడం ద్వారా సంస్థకు లాభం వస్తుంది.

**ఇతర మార్గాలు**

పై నాలుగు ప్రధాన మార్గాలు కాకుండా ఐఆర్‌సీటీసీకి మరికొన్ని అనుబంధ ఆదాయ వనరులు ఉన్నాయి. రైల్వే టిక్కెట్ల వెనుక, వెబ్‌సైట్‌లో, ఈ-టికెట్‌పై, రైళ్ల అంతటా ప్రకటనలకు అనుమతి ఇవ్వడం ద్వారా ఆదాయం సంపాదిస్తుంది. పార్శిల్ సేవలు, లాజిస్టిక్స్ సేవలను అందిస్తోంది. వివిధ ఆన్‌లైన్ లావాదేవీల ద్వారా లభించే పేమెంట్ గేట్‌వే కమీషన్ ఆదాయం ఉంది.

**భారతీయ రైల్వేకు ఐఆర్‌సీటీసీ కీలకం**

రైల్వే శాఖకు ఐఆర్‌సీటీసీ ఒక స్థిరమైన ఆదాయ మార్గాన్ని అందిస్తుంది. ఏటా డివిడెండ్ రూపంలో భారతీయ రైల్వేకు పెద్ద మొత్తంలో నిధులను సమకూరుస్తుంది. ఐఆర్‌సీటీసీ ద్వారా వచ్చే లాభాలను భారతీయ రైల్వే ట్రాక్‌ల ఆధునీకరణ, కొత్త రైళ్ల కొనుగోలు, మౌలిక వసతుల కల్పనకు ఉపయోగిస్తుంది.



## పుతిన్ ముందు చిందేసిన రోబో

**మాస్కో:** టెక్నాలజీ పెరుగుతోంది.. ఈ తరుణంలో ప్రపంచంలోని చాలా దేశాలు హ్యూమానాయిడ్ రోబోలను తయారు చేసేపనిలో నిమగమయ్యాయి. ఇందులో రష్యా కూడా ఉంది. ఇటీవల స్బెర్‌బ్యాంక్ బుధవారం ఏర్పాటు చేసిన ప్రదర్శనలో ఒక రోబో అద్భుతమైన ప్రదర్శన ఇచ్చింది. దీనికి సంబంధించిన వీడియో సోషల్ మీడియాలో వైరల్ అవుతోంది. రష్యాలోని స్బెర్‌బ్యాంక్ తన సాంకేతిక పురోగతిని ప్రదర్శించడానికి రూపొందించిన ప్రదర్శనలో.. బుధవారం అధ్యక్షుడు వ్లాదిమిర్ పుతిన్ ఎదురుగా ఒక రోబో డ్యాన్స్ చేసింది. ఈ ప్రదర్శనలో.. క్రెమ్లిన్ చీఫ్, హ్యూమనాయిడ్ రోబోట్ ఎదురుగా నిలబడి రోబో గురించి వివరించారు. రోబో తనను తాను పరిచయం చేసుకుంటూ.. "నా పేరు గ్రీన్. నేను ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ కలిగిన మొదటి రష్యన్ హ్యూమనాయిడ్ రోబోట్. నేను కేవలం ఒక ప్రోగ్రామ్ కాదు. టెక్నాలజీ యొక్క భౌతిక స్వరూపిని. నేను డ్యాన్స్ కూడా చేయగలను, అని వ్లాదిమిర్ పుతిన్ ముందు డ్యాన్స్ చేసింది". దాని డ్యాన్స్ చూసి ఆయన ఎంతో ముగ్ధుడయ్యాడు. నవంబర్ 10న మాస్కోలోని యారోవిట్ హాల్ కాంగ్రెస్ సెంటర్‌లో జరిగిన టెక్నాలజీ షోకేస్ సందర్భంగా 'ఐడల్' అనే రోబోను ఆవిష్కరించారు. ఇది ప్రారంభంలో మెల్లగా అడుగులు వేసుకుంటూ వేదికపైకి వచ్చి.. అక్కడున్నవారికి అభివాదం చేస్తున్నట్లు చెయ్యి పైకెత్తింది. ఆ తరువాత ఓ రెండడుగులు ముందుకు వేసి కిందకు పడిపోయింది. దీంతో అక్కడే ఉన్న సిబ్బంది దానిని పైకిలేపి కష్టం మీద తీసుకెళ్లారు. కానీ అనుకున్నదొకటి, అయినది ఒకటిగా జగడంతో.. కార్యక్రమం మధ్యలోనే నిలిచిపోయింది.

## అది 'నకిలీ అంచనా'

### : కియోసాకి

**టోక్యో:** ఆర్టిఫీషియల్ ఇంటెలిజెన్స్ వినియోగం విస్తృతంగా పెరుగు తున్న నేపథ్యంలో దాని దుర్వినియోగం కూడా అంతే స్థాయిలో పెరుగుతోంది. ఏఐ టెక్నాలజీతో పెరుగుతున్న డీప్ ఫేక్ వీడియోల ప్రభావం ప్రసిద్ధ పర్సనల్ ఫైనాన్స్ పుస్తకం 'రిచ్ డాడ్ పూర్ డాడ్' రచయిత రాబర్ట్ కియోసాకిని కూడా తాకింది. డిసెంబరులో బంగారం ధరలు 50 శాతం తగ్గుతాయని తానుచెప్పినట్లుగా ఏఐతో డీప్ ఫేక్ చేసి రూపొందించిన వీడియో ఒకటి యూట్యూబ్ వీడియో ఆన్ లైన్ లో ప్రత్యక్షమవుతోందని రాబర్ట్ కియోసాకి తన ఫాలోవర్లను అప్రమత్తం చేశారు. అది ఏఐతో సృష్టించిన డీప్ ఫేక్ వీడియో అని, తాను అలా చెప్పలేదని స్పష్టం చేశారు. ఈ మేరకు సోషల్ మీడియా ప్లాట్‌ఫామ్ 'ఎక్స్' (ట్విటర్)లో రాబర్ట్ కియోసాకి ఓ పోస్ట్ చేశారు. 'ఫెడ్ (ఫెడరల్ రిజర్వ్) నకిలీ డబ్బును తయారు చేస్తున్నట్లుగానే ఏఐ నకిలీ మనుషులను సృష్టిస్తోంది' అన్నారు. 'నకిలీ రాబర్ట్ కియోసాకిని సృష్టించి నకిలీ ఆర్థిక అంచనాలను చెప్పిస్తున్నారు. ఇందుకోసం కొంతమంది ఎందుకు తమ సమయాన్ని, శక్తిని వెచ్చిస్తున్నారు?.. ఇదంతా నాకు, మీకు, అందరికీ చికాకు పుట్టిస్తోంది' అని రాసుకొచ్చారు. తనపై ఇలా డీక్ ఫేక్ చేసి అబద్దాలు సృష్టంచడానికి బదులు 'రాబర్ట్ కియోసాకి భారీ యూనిట్ తో పోర్న్ స్టార్ గా ఉండేవాడు' అని ఎందుకు చెప్పకూడదు? నేను దానిని ఇష్టపడతాను" అని చమత్కరించారు. తప్పుడు సమాచారం పట్ల అప్రమత్తంగా ఉండాలని యూజర్లను కియోసాకి మరోసారి హెచ్చరించారు.

## నిను వీడని నీడను నేనే..

### అంబానీని వదలని ఈడీ



అనిల్ అంబానీ నేతృత్వంలోని రిలయన్స్ గ్రూప్‌నకు చెందిన సుమారు రూ. 1,400 కోట్ల విలువైన స్థిరాస్తులను ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్ (ఈడీ) జప్తు చేసింది. తాత్కాలికంగా ఈ ఆస్తులను అటాచ్ చేసినట్లు తెలిపింది. దాంతో ఇప్పటివరకు గ్రూప్‌నకు చెందిన మొత్తం రూ. 9,000 కోట్లకు పైగా ఆస్తులను ఈడీ అటాచ్ చేసినట్లయింది. ఈడీ తాజా చర్యలకు కొద్దిరోజుల ముందు రిలయన్స్ గ్రూప్ ఛైర్మన్ అనిల్ అంబానీ విచారణకు హాజరుకాకుండా సమన్లను దాటవేశారు. విదేశీ మారక నిర్వహణ చట్టం కింద జరుగుతున్న దర్యాప్తులో భాగంగా ఆయనను ఈడీ పిలిపించింది. కానీ విచారణకు ఆయన గైర్హాజరు కావడం ఇది రెండోసారి. ఏజెన్సీ చివరిసారిగా ఆగస్టులో అనిల్ అంబానీని ప్రశ్నించింది. ఈడీ ఆరోపణల ప్రకారం, అనిల్ అంబానీ గ్రూప్ జైపూర్-రీంగస్ హైవే ప్రాజెక్ట్ నుంచి సూరత్‌లోని షెల్ కంపెనీల ద్వారా సుమారు రూ. 40 కోట్లను విదేశాలకు తరలించి దుబాయ్‌కు పంపినట్లు అనుమానిస్తున్నారు. ఇది రూ. 600 కోట్లకు పైగా విస్తృత అంతర్జాతీయ హవాలా నెట్‌వర్క్‌లో భాగమై ఉండవచ్చని ఇంటెలిజెన్స్ ఏజెన్సీ తెలిపింది. అంబానీ గ్రూప్ కంపెనీలపై దర్యాప్తులో భాగంగా ఈడీ ఇటీవల రూ. 4,462 కోట్ల విలువైన ఆస్తులను అటాచ్ చేసింది. దీనికి ముందు, రిలయన్స్ కమ్యూనికేషన్స్ (ఆర్ కామ్) బ్యాంక్ రుణ కేసుకు సంబంధించి నవీ ముంబైలోని ధీరూభాయ్ అంబానీ నాలెడ్జ్ సిటీ (డీఏసీ) ప్రాంగణంలో సుమారు రూ. 7,545 కోట్ల విలువైన 132 ఎకరాల భూమిని కూడా ఈడీ జప్తు చేసింది. మోసం, కుట్ర, అవినీతి ఆరోపణలపై అనిల్ అంబానీతోపాటు ఆర్‌కామ్, ఇతరులపై సెంట్రల్ బ్యూరో ఆఫ్ ఇన్వెస్టిగేషన్ (సీబీఐ) ఎఫ్ఐఆర్ నమోదు చేసిన తర్వాత ఈడీ దర్యాప్తు ప్రారంభించింది. 2010, 2012 మధ్య భారతీయ, విదేశీ బ్యాంకుల నుంచి మొత్తం రూ. 40,000 కోట్లకు పైగా రుణాలు తీసుకున్న ఆర్‌కామ్, దాని అనుబంధ సంస్థలపై దర్యాప్తు జరుగుతోంది.

## శబరిమలలో భక్తుల రద్దీ దృష్ట్యా.. రంగంలోకి ఎన్డీఆర్ఎఫ్ బృందం..

తిరువనంతపురం: శబరిమలలో నెలకొన్న భక్తుల రద్దీ విషయమై ట్రావెన్‌కోర్ దేవస్వం బోర్డుపై సర్వత్రా విమర్శలు వెల్లువెత్తిన సంగతి తెలిసిందే. ఈ నేపథ్యంలోనే శబరిమలలో తొలి జాతీయ విపత్తు నిర్వహణ దళం విధుల్లోకి చేరింది. ఈ మేరకు ప్రాంతీయ రిస్పాన్స్ సెంటర్‌కు చెందిన 4వ బెటాలియన్‌లోని 30 మంది సభ్యుల బృందం నవంబర్ 19న సన్నిధానానికి చేరుకుంది. ప్రస్తుతం వారు మెట్లు ప్రాంతం మరియు నడక మార్గాల వద్ద మోహరించారు. ఒకేసారి ప్రతి ప్రాంతంలో ఐదుగురు చొప్పున విధుల్లో ఉన్నారు. చెన్నై నుంచి వచ్చిన 38 మంది సభ్యుల మరో బృందం కూడా నిన్న రాత్రి చేరుకుంది. యాత్రికులకు సీఆర్పీ సహా అత్యవసర వైద్య సహాయం అందించేలా ప్రత్యేక శిక్షణ తీసుకున్న బృందం. అలాగే ఫస్ట్ ఎయిడ్ కిట్లు, స్ట్రెచర్లు తదితర సామగ్రిని సిద్ధం చేశారు కూడా. అత్యవసర పరిస్థితుల్లో తక్షణమే స్పందించడంతో పాటు, రక్షణ కార్యక్రమాలను సమన్వయం చేసేలా అప్రమత్తంగా ఉన్నారు. అలాగే ఈ బృందం శబరిమల ఏడీఎం పోలీసుల ప్రత్యేక అధికారి ఇచ్చే సూచనల మేరకు పనిచేస్తుందని ఇన్‌స్పెక్టర్ జీసీ ప్రసాద్ తెలిపారు.



**కట్టుదిట్టమైన ఆంక్షలు..**

ప్రస్తుతం శబరిమలలో మరిన్ని ఆంక్షలు విధించారు. స్పాట్ బుకింగ్ 20 వేల మందికి పరిమితం చేశారు. పంపా చేరుకున్న భక్తులు తమ శబరిమల దర్శనాన్ని పూర్తి చేసుకుని నిర్ణీత సమయంలోపు తిరిగి వస్తారు. అధికంగా వచ్చే వారికి మరుసటి రోజు దర్శనం చేసుకునేందుకు ఏర్పాట్లు చేసినట్లు అధికారుల పేర్కొన్నారు. నీలక్కల్ నుంచి పంపా వరకు ప్రవేశం పరిమితం చేసినట్లు తెలిపారు. భక్తులకు నీలక్కల్‌లో వసతి సౌకర్యాలు కల్పించినట్లు పేర్కొంది ట్రావెన్‌కోర్ దేవస్వం బోర్డు.

## త్వరలో భారత్‌కు అధునాతన జావెలిన్ క్షిపణి వ్యవస్థ

ఈ క్రమంలో అమెరికాతో 93 మిలియన్ డాలర్ల విలువైన ఆయుధాలను భారత్‌కు విక్రయించేందుకు అగ్రరాజ్యం ఆమోదించింది. జావెలిన్ ట్యాంక్ విధ్వంసకర క్షిపణిని భుజంపై నుంచి శత్రు ట్యాంకుల పైకి గురిపెట్టి ప్రయోగించవచ్చు. దీనిలో 3.7 అడుగుల క్షిపణి, డిస్పోజబుల్ లాంచ్ ట్యూబ్, కమాండ్ కంట్రోల్ యూనిట్ ఉంటాయి. వాస్తవానికి ట్యాంక్ విధ్వంసకర ఆయుధాన్ని ప్రయోగించిన ప్రదేశం నుంచి పొగ, వేడి వెలువడతాయి. ప్రత్యర్థులు హీట్ సెన్సర్లతో వాటిని గుర్తిస్తారు. కానీ, జావెలిన్‌లో తొలుత ట్యూబ్ నుంచి ఓ మోటర్ క్షిపణిని బయటకు కొంత దూరం విసురుతుంది. ఆ తర్వాత క్షిపణి మోటార్ పనిచేయడం మొదలుపెట్టి లక్ష్యం వైపు దూసుకెళుతుంది. దీనిని కంప్యూటర్‌తో నియంత్రిస్తారు. దీంతో కచ్చితంగా జావెలిన్‌ను ఎక్కడినుంచి ప్రయోగించారో శత్రువుకు అర్థం కాదు. ఈ లోపు ప్రయోగించిన వారు సురక్షిత ప్రదేశంలో దాక్కోవచ్చు. రీయాక్టివ్ ఆర్మర్ రక్షణ కవచాలను ఛేదించి.. ట్యాంకును ధ్వంసం చేసేలా దీనిలో రెండు దశల్లో పేలుడు పదార్థాలను అమర్చారు. తొలిదశలో కవచాన్ని ఛేదించి.. ఆ తర్వాత దశలో వార్‌హెడ్ ట్యాంక్‌ను ధ్వంసం చేస్తుంది. వీటిని అమెరికాకు చెందిన రక్షణరంగ దిగ్గజాలు రేథియాన్, లాక్‌హీడ్ మార్టిన్ సంస్థలు అభివృద్ధి చేశాయి. వీటి ఉత్పత్తి చాలా క్లిష్టమైన, ఖరీదైన వ్యవహారం. వీటి ధర 2 లక్షల డాలర్ల వరకూ ఉంటుందని అంచనా. రష్యాతో పోరులో ఉక్రెయిన్ ఈ క్షిపణులను విపరీతంగా వినియోగించింది. మాస్కోకు చెందిన పలు యుద్ధ ట్యాంకులను పేల్చేసింది.



# తరగతికి ఒక టీచర్ తప్పనిసరి

- టెట్ నుంచి ఇన్‌సర్వీస్ ఉపాధ్యాయులకు మినహాయింపు ఇవ్వాలి
- కేజీబీవీ టీచర్లను రెగ్యులర్ చేయాలి
- జీవో 317 బాధితులకు న్యాయం జరగాలి

**కథలాపూర్, నవంబర్ 20 (జనంసాక్షి) :** ప్రభుత్వ పాఠశాలలను బలోపేతం చేయాలంటే తరగతికి ఒక ఉపాధ్యాయుడు తప్పనిసరిగా కేటాయించాలని, సర్వీస్‌లో ఉన్న ఉపాధ్యాయులను టెట్ పరీక్ష నుంచి పూర్తిగా మినహాయింపు ఇవ్వాలని తెలంగాణ రాష్ట్ర ఐక్యోపాధ్యాయ ఫెడరేషన్ (టిఎస్‌యూటఎఫ్) డిమాండ్ చేసింది. గురువారం కథలాపూర్ మండలంలో టిఎస్‌యూటీఎఫ్ ఆధ్వర్యంలో జరిగిన సభ్యత్వ నమోదు కార్యక్రమంలో జిల్లా అధ్యక్షులు తిరుకోవెల శ్యామ్‌సుందర్, ప్రధాన కార్యదర్శి అంబటి భూమేశ్వర్ మాట్లాడుతూ.. దశాబ్దాలుగా బోధనలో నిమగ్నమైన ఉపాధ్యాయులను ఉద్యోగ చివరి దశలో టెట్ పరీక్ష రాయమంటూ భయభ్రాంతులకు గురిచేయడం ఘోర అన్యాయమని మండిపడ్డారు. పాత సర్దుబాటు విధానాన్ని పక్కనపెట్టి, నేటి సమాజ అవసరాలకు అనుగుణంగా కొత్త సర్దుబాటు చేయాలని, ప్రతి పది మంది విద్యార్థులకు ఇద్దరు టీచర్లు, తర్వాత ప్రతి తరగతికి ఒక ఉపాధ్యాయుడు ఉండేలా జీవో నం.25ను సవరించాలని కోరారు. కేజీబీవీ ఉపాధ్యాయులను వెంటనే రెగ్యులర్ చేయాలని, గురుకుల పాఠశాలల్లో ఉన్న సమస్యలు తక్షణం పరిష్కరించాలని, జీవో నం.317 బాధిత ఉపాధ్యాయులకు న్యాయం చేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో జిల్లా కార్యదర్శి కలిద్ పాషా, మండల అధ్యక్షులు పిట్టల రాజేందర్, మండల బాధ్యులు రాజేష్ తదితరులు పాల్గొన్నారు.

# ప్రజాస్వామ్యంలో ఎన్‌కౌంటర్‌లు అన్యాయం

- ప్రజాస్వామ్యంలో ఎన్‌కౌంటర్‌ల పేరుతో మావోయిస్టులను హతం చేయడం దుర్మార్గం
- బీసీ రిజర్వేషన్లపై కేంద్ర ప్రభుత్వ వైఖరిని ఎండగట్టాలి
- రానున్న స్థానిక సంస్థల ఎన్నికల్లో సిపిఐ పోటీకి సిద్ధం
- సిపిఐ జాతీయ నేత,మాజీ ఎమ్మెల్యే చాడ వెంకటరెడ్డి



**చిగురుమామిడి, నవంబర్ 20 (జనంసాక్షి) :** ప్రజాస్వామ్యంలో ఎన్‌కౌంటర్‌ల పేరుతో మావోయిస్టు లను హతం చేయడం దుర్మార్గమని సిపిఐ జాతీయ నేత, మాజీ ఎమ్మెల్యే చాడ వెంకటరెడ్డి తీవ్రంగా ఖండించారు. గురువారం కరీంనగర్ జిల్లా చిగురుమామిడి మండలంలోని సిపిఐ కార్యాలయం ముస్కురాజిరెడ్డి స్మారక భవన్‌లో జరిగిన విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ, గతంలో భూస్వాములు, పెద్దాళ్ల ఆధిపత్యం ఉండి ఉండాలంటే నేడు కార్పొరేట్ శక్తులు, పెట్టుబడిదారులకు అనుకూలంగా పరిపాలన జరుగుతోందని విమర్శించారు. డా.బీ.ఆర్. అంబేద్కర్ రచించిన రాజ్యాంగం ప్రకారం మాట్లాడే స్వేచ్ఛ, ప్రశ్నించే హక్కులు ఉన్నప్పటికీ పాలకులు వాటిని హరిస్తున్నారని ఆరోపించారు.
కేంద్ర బీజేపీ ప్రభుత్వం ఆపరేషన్ కగార్ పేరుతో చత్తీస్‌గఢ్‌లోని మావోయిస్టులను చంపడం, ఈ నెల 27, 28 తేదీల్లో దేశవ్యాప్త డీజీపీలు, ఐజీల సమావేశాన్ని చత్తీస్‌గఢ్‌లో జరపడం, దాన్ని కేంద్ర హోంమంత్రి అమిత్ షా ప్రారంభించి ప్రధాని మోడీ ముగించడం మావోయిస్టులను పూర్తిగా అంతం చేసే కుట్రలో భాగమని చాడ వెంకటరెడ్డి అన్నారు. ప్రజాస్వామ్యంలో ఇలాంటి చర్యలు మంచివి కావని, సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తిపై చెప్పువిసిరిన వారిపై చర్యలు తీసుకోకపోవడం కేంద్ర వైఖరిపై అనుమానాలు రేకెత్తిస్తున్నాయని విమర్శించారు. పాలకులు ఇష్టానుసారం వ్యవహరిస్తుంటే నియంతృత్వ ఫ్యూడల్ వ్యవస్థ పునరావృతమవుతుందని, ప్రజాస్వామ్యం ప్రమాదంలో పడుతుందని హెచ్చరించారు. పార్టీలు ఫిరాయించిన ఎమ్మెల్యేలపై చర్యలు లేకపోవడం, స్పీకర్లు ఇష్టానుసారం పెండింగ్‌లో పెట్టడం లేదా తిరస్కరించడం ప్రజాస్వామ్యానికి విరుద్ధమని ఆయన తెలిపారు.
దేశ ప్రజాస్వామ్యం నాలుగు కాలాలు ఉండాలంటే ప్రగతిశీల, లౌకిక శక్తులు, వామపక్షాలు ఏకమై కాపాడాలని చాడ వెంకటరెడ్డి పిలుపునిచ్చారు. స్థానిక సంస్థల ఎన్నికలు నిర్వహించకపోవడం వల్ల కేంద్ర నిధులు నిలిచిపోతున్నాయని, రాష్ట్ర ప్రభుత్వం వెంటనే ఎన్నికలు జరపాలని డిమాండ్ చేశారు. రాజ్యాంగం తొమ్మిదవ షెడ్యూల్ ప్రకారం బీసీలకు 42 శాతం రిజర్వేషన్లు అమలు చేయాలని, రిజర్వేషన్ల పెంపు బిల్లు గవర్నర్, రాష్ట్రపతి వద్ద పెండింగ్‌లో ఉండటం ఎన్నికలకు అడ్డంకిగా మారిందని వివరించారు. కేంద్రంలో బీజేపీ, ప్రతిపక్షాలు ఏకమైతేనే రిజర్వేషన్ల పెంపు సాధ్యమని, కానీ బీజేపీ స్పష్టత ఇవ్వకపోవడం అన్యాయమని ఆరోపించారు. బీసీ సంఘాలతో కలిసి ఢిల్లీలో కేంద్రంపై ఒత్తిడి పెంచాలని సూచించారు.
కాంగ్రెస్‌తో సిపిఐ మిత్రపక్ష సంబంధం కొనసాగుతోందని, స్థానిక ఎన్నికల్లో వారు పిలిస్తే చర్చిస్తామని చాడ వెంకటరెడ్డి తెలిపారు. ప్రజల మధ్య నిరంతరం ఉండి పనిచేసే సిపిఐ తప్పనిసరిగా ఎన్నికల్లో పోటీ చేస్తుందని, చిగురుమామిడి మండలంలో అన్ని గ్రామాల్లో శ్రేణులు సిద్ధంగా ఉండాలని పిలుపునిచ్చారు. సిపిఐ వందేళ్ల ఉత్సవాలు దేశవ్యాప్తంగా ఘనంగా జరుగుతున్నాయని, తెలంగాణలో డిసెంబర్ 26న ఖమ్మంలో బహిరంగ సభ జరగనుందని, మూడు ప్రచార రథాలు రాష్ట్రవ్యాప్తంగా జరుగుతున్నాయని, జోడేఘాట్‌లో ప్రారంభమైన జాత ఈ నెల 21న భద్రాచలంలో ముగుస్తుందని వివరించారు.
సమావేశంలో సిపిఐ నాయకులు అందె స్వామి, నాగెల్లి లక్ష్మారెడ్డి, బోయిని అశోక్, అందె చిన్న స్వామి, చాడ శ్రీధర్ రెడ్డి, బోయిని సర్దార్ వల్లభాయ్ పటేల్, మావురపు రాజు, తేరాల సత్యనారాయణ, బూడిద సదాశివ, పైడిపెల్లి వెంకటేష్, ముద్రకోల రాజయ్య, గోలీ బాపు రెడ్డి, రాకం అంజవ్వ తదితరులు పాల్గొన్నారు.

# గ్రంథాలయ వారోత్సవాలలో పారడైజ్ విద్యార్థుల ప్రతిభ

**పారడైజ్ పాఠశాల చైర్మన్ డా. పి. ఫాతిమా రెడ్డి**




**కరీంనగర్, నవంబర్ 20 (జనంసాక్షి) :** కరీంనగర్‌లోని స్థానిక కేంద్ర గ్రంథాలయంలో గతవారం రోజుల నుండి నిర్వహిస్తున్న జిల్లా స్థాయి 58వ జాతీయ గ్రంథాలయ వారోత్సవాలలో భాగంగా పాఠశాల విద్యార్థులకు వివిధ అంశాలపై పలు పోటీలను నిర్వహించారు. ఇట్టి పోటీలలో పారడైజ్ పాఠశాల విద్యార్థులు పాల్గొని పలు విభాగాలలో జిల్లా స్థాయిలో బహుమతులు సాధించినట్లు పాఠశాల చైర్మన్ డా. పి. ఫాతిమా రెడ్డి తెలిపారు. డ్రాయింగ్ విభాగంలో యు.శివాణి 8వ తరగతి జిల్లాస్థాయిలో ప్రథమ బహుమతి, మెమరీ విభాగంలో ఎ. మహిత్ 9వ తరగతి జిల్లాస్థాయిలో ప్రథమ బహుమతి, క్విజ్ విభాగంలో సాన్విత, టీం జిల్లా స్థాయిలో ప్రథమ బహుమతి, వ్యాసరచన పోటీలలో సనా 9వ తరగతి జిల్లా స్థాయి రెండవ బహుమతి, మెహిందీ విభాగంలో యు. శివాణి 8 వ తరగతి జిల్లా స్థాయిలో రెండవ బహుమతి సాధించినట్లు చైర్మన్ తెలిపారు. గురువారం పాఠశాలలో నిర్వహించిన ప్రత్యేక అభినందన సభలో ఇట్టి విద్యార్థులను ఘనంగా సన్మానించి అభినందనలు తెలిపారు. ఈ సందర్భంగా చైర్మన్ డాక్టర్ పి. ఫాతిమా రెడ్డి మాట్లాడుతూ... తమ పాఠశాలలో విద్యతో పాటు పోటీపరీక్షలకు తగిన ప్రాధాన్యత ఇస్తున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో చైర్మన్ డా. పి. ఫాతిమా రెడ్డి, ప్రిన్సిపాల్ టి. వసంత, వైస్ ప్రిన్సిపాల్ మధు, విద్యార్థినివిద్యార్థులు, తల్లిదండ్రులు పాల్గొన్నారు.

# కొనుగోలు కేంద్రాలను వినియోగించుకోవాలి

**అదనపు కలెక్టర్ గడ్డం నగేష్**



**వేములవాడ రూరల్, నవంబర్ 20 (జనంసాక్షి):** ప్రభుత్వం ఏర్పాటు చేసిన కొనుగోలు కేంద్రాలను రైతులు వినియోగించుకోవాలని అదనపు కలెక్టర్ గడ్డం నగేష్ సూచించారు. వేములవాడ రూరల్ మండలం అచ్చన్న పల్లి, వెంకటాంపల్లి, నమిలిగుండుపల్లి గ్రామాల్లో ఏర్పాటు చేసిన ధాన్యం కొనుగోలు కేంద్రాలను అదనపు కలెక్టర్ గడ్డం నగేష్ గురువారం పరిశీలించారు. ఈ సందర్భంగా అదనపు కలెక్టర్ మాట్లాడుతూ దళారులకు అడ్డుకట్ట వేసేందుకు, రైతులకు మద్దతు ధర అందించేందుకు కొనుగోలు కేంద్రాలను ప్రారంబించామని వెల్లడించారు. రైతులు తమ ధాన్యాన్ని తాలు, తప్ప లేకుండా ఉండేలా చూసుకోవాలని సూచించారు. ప్రభుత్వం గ్రేడ్ ఏ రకం ధాన్యానికి క్వింటాలుకు రూ.2389, కామన్ రకానికి రూ.2369 నిర్ణయించిదని వెల్లడించారు. కొనుగోలు కేంద్రాలను సద్వినియోగం చేసుకోవాలని, దళారులకు ధాన్యం విక్రయించవద్దని కోరారు.

# వీరాపూర్‌లో అట్టహాసంగా గృహప్రవేశాలు

**మానకొండూరు ఎమ్మెల్యే డా. కవ్వంపల్లి సత్యనారాయణ**



**కరీంనగర్ జిల్లా బ్యూరో, నవంబర్ 20 (జనంసాక్షి):** కాంగ్రెస్ ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన ఇందిరమ్మ ఇంటి పథకం కింద ఇళ్ల నిర్మాణాలు పూర్తి చేసుకున్న లబ్ధిదారులు గురువారం రోజు అట్టహాసంగా గృహ ప్రవేశాలు చేశారు. ఈ కార్యక్రమాలకు మానకొండూర్ ఎమ్మెల్యే డాక్టర్ కవ్వంపల్లి సత్యనారాయణ ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా డాక్టర్ కవ్వంపల్లి సత్యనారాయణ మాట్లాడుతూ... ఇందిరమ్మ ఇంటి పథకం కింద వీరాపూర్ ను పైలట్ గ్రామంగా ఎంపిక చేశామని, అందులో భాగంగానే సొంత ఇల్లు లేని నిరుపేదలకు వందశాతం గృహాలు మంజూరు చేశామన్నారు. ప్రస్తుతం నలుగురు లబ్ధిదారులు ఇళ్ల నిర్మాణాలు పూర్తి చేసి గృహప్రవేశాలు చేసుకోవడం సంతోషకరమని ఆయన పేర్కొన్నారు. గృహప్రవేశాలు చేసుకున్న లబ్ధిదారుల కుటుంబ సభ్యులకు ఆయన శుభాకాంక్షలు తెలిపారు. నూతన గృహాల్లో సుఖశాంతులతో ఆనందకరమైన జీవితం గడపాలని, అన్ని శుభాలే చేకూరలని ఎమ్మెల్యే అభిలషించారు.

### సీఎంఆర్ఎఫ్ చెక్కుల పంపిణీ



బెజ్జంకి మండలానికి 21విడుతలో మంజూరైన సీఎంఆర్ఎఫ్ చెక్కులను ఎమ్మెల్యే డాక్టర్ కవ్వంపల్లి సత్యనారాయణ పంపిణీ చేశారు. గురువారం వీరాపూర్ గ్రామాల లబ్ధిదారులకు ఆయన అందజేశారు. ఈ కార్యక్రమంలో బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు ఒగ్గు దామోదర్, మండల కాంగ్రెస్ అధ్యక్షుడు ముక్కిస రత్నాకర్ రెడ్డి, వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ పులి కృష్ణ, వైస్ చైర్మన్ చిలువేరు శ్రీనివాస్ రెడ్డి, పార్టీ నాయకులు బైర సంతోష్, పులి సంతోష్, గూడెల్లి శ్రీకాంత్, సాదిక్ తదితరులు పాల్గొన్నారు.

# రాష్ట్ర దేవాదాయశాఖ మంత్రిని కలిసిని కేకే మహేందర్ రెడ్డి



**ముస్తాబాద్ నవంబర్ 20 (జనం సాక్షి) :** ముస్తాబాద్ మండల కేంద్రంలో పట్టణంలో దాదాపు 700 సంవత్స రాల పైగా చరిత్ర గల అతి పురాతన శ్రీ వేణుగోపాల స్వామి ఆలయం పూర్తిగా శిథిలావస్థలో ఉంది, నూతన ఆలయం నిర్మించు టకు నిధులు మంజూరు చేయవలసిందిగా సిరిసిల్ల నియోజకవర్గం ఇంచార్జ్ కేకే మహేందర్ రెడ్డి ప్రత్యేక చొరవతో రాష్ట్ర దేవాదాయ శాఖ మంత్రి కొండ సురేఖను కలవడం జరిగింది, ఈ సందర్భంగా మంత్రి స్పందిస్తూ తప్పకుండా ఆలయ పునః నిర్మాణం కోసం నిధులు మంజూరు చేస్తామని మాట ఇవ్వడం జరిగింది, కేకే మహేందర్ రెడ్డి మాట్లాడుతూ ముస్తాబాద్ పట్టణంలో పెద్ద చెరువుకు దగ్గరలో వేణుగోపాలస్వామి పురాతన దేవాలయం ఉంది అప్పుడు పూర్వికులు ముస్తాబాద్ గ్రామం ఏర్పడ్డప్పుడు ఈ దేవాలయం నిర్మించారు ఇప్పుడు గుడిని కొత్తగా నిర్మిస్తే మండల ప్రజలకు ఒక టూరిజం లాగా ఏర్పడుతుంది, గత ప్రభుత్వం పాలకులు గుడి నిర్మిస్తామని ఆగమేఘాల మీద ఫోటోలకు ఫోజులు కొడుతూ కాలయాపన చేయడం జరిగింది. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి పరిపాలన ప్రతి ఒక్కరికి అందే విధంగా కృషి చేస్తున్నారు. మంత్రిగారిని కలవడంతో సానుకూలంగా స్పందించి త్వరలోనే నిధులు మంజూరు చేస్తాననిక హామీ ఇవ్వడం జరిగింది అన్నారు. మంత్రి గారికి ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు ఈ కార్యక్రమంలో మాజీ ఎంపిటిసి సభ్యులు గుండెల్లి శ్రీనివాస్ గౌడ్, గజ్జెల రాజుతో బద్దిపడిగే అనిల్ రెడ్డి, ఉన్నారు

# అధికారులు సమన్వయంతో పని చేయాలి

- నియోజకవర్గంలో వివిధ అభివృద్ధి పనులపై అన్ని శాఖల అధికారులతో సమీక్ష
- హాజరైన ఇంచార్జి కలెక్టర్ గరిమ అగ్రవాల్, ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్






**రాజన్న సిరిసిల్ల జిల్లా ప్రతినిధి నవంబర్ 20 (జనంసాక్షి) :** రాజన్న సిరిసిల్ల జిల్లాలోని అన్ని శాఖల అధికారులు సమన్వయంతో పని చేసి అభివృద్ధి పనులను పూర్తి చేయాలని ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్ అధికారులను ఆదేశించారు.గురువారం వేములవాడ నియోజకవర్గంలో చేపడుతున్న అభివృద్ధి పనుల పురోగతిపై రెవెన్యూ, నీటిపారుదల,విద్యుత్, రహదారులు మరియు భవనాలు, పంచాయితీ రాజ్,గృహనిర్మాణ, మిషన్ భగీరథ, వివిధ శాఖల అధికారులతో వేములవాడ మున్సిపల్ కార్యాలయంలోని సమావేశ మందిరంలో ఇంచార్జి కలెక్టర్ గరిమ అగ్రవాల్ తో కలిసి ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్ సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రభుత్వ విప్ మాట్లాడుతూ నియోజకవర్గ పరిధిలో లోఓల్టేజ్ సమస్య పరిష్కారానికి, విద్యుత్తు సరఫరాలో ఇబ్బందులు దూరం చేసేందుకు వేములవాడ నియోజకవర్గానికి 220/11, 133/11 ఒక్కొకటి 33/11 (11) సబ్ స్టేషన్లు మంజూరు అయ్యాయన్నారు.ఆయా సబ్ స్టేషన్ల పురోగతిపై అయన అధికారులను అడిగి తెలుసుకున్నారు. పంచాయితీ రాజ్ ఇంజనీరింగ్ శాఖకు రూ 10 కోట్ల ప్రత్యేక అభివృద్ధి నిధులు మంజూరు చేయడం జరిగిందని, సామాజిక భవనాలు,తదితర వాటికి ఈ నిధులను కేటాయించడం జరిగిందన్నారు. రూ 15 కోట్లను పంచాయితీ రాజ్ శాఖ ద్వారా మంజూరు చేయించి, గ్రామ పంచాయతీ భవనాలు, అంగన్వాడీ కేంద్రాలు, ఆరోగ్య ఉప కేంద్రాలు, మొదలైన నిర్మాణాలకు శంకుస్థాపన చేసిన పనుల అయన ఆరా తీశారు.బీటీ రోడ్లు, సీసీ రోడ్ల నిర్మాణాల పనులు ప్రారంభం కాకుండా ఉన్న వాటిని యుద్ధప్రాతిపదికన చేపట్టాలని, రహదారి నిర్మించే ప్రదేశాల్లో వేసిన విద్యుత్ స్తంభాలను తొలగించి, రహదారులు నిర్మించాలని ఆదేశించారు.సమస్యలు ఉంటే సంబంధిత శాఖల అధికారులు జాప్యం చేయకుండా క్షేత్ర స్థాయిలో పరిశీలించి, సమస్యలను పరిష్కరించాలని సూచించారు. రహదారులు, భవనాల శాఖ ద్వారా వేములవాడ మూలవాగు వంతెనకు 2015లో శంకుస్థాపన చేసి, పనులు ప్రారంభించకుండా ఉంచారని, ఈ మధ్య తిరిగి శంకుస్థాపన చేసుకున్నామని వివరించారు.వంతెన నిర్మాణం కోసం రూ 6 కోట్ల 90 లక్షలు భూసేకరణ కోసం కేటాయించడం జరిగిందని,అవసరమైన భూసేకరణ చేసి, పనులు ప్రారంభించి, పనులు వేగవంతం చేయాలని, వచ్చే వర్షాకాలంలో లోగా వంతెన నిర్మాణం పూర్తి చేయాలని ఆదేశించారు.భారీ వర్షాల నేపథ్యంలో దెబ్బతిన్న కల్వర్టులు, రహదారుల మరమ్మతు పనులపై ఆరా తీశారు.దెబ్బతిన్న రహదారులు, కల్వర్టులు,వంతెనలకు భవిష్యత్ లో ఇబ్బందులు తలెత్తకుండా శాశ్వత మరమ్మతులు చేయాలన్నారు.
మోత్కురావుపేట- చందుర్తి రోడ్డుకు అటవీ శాఖ నుంచి అనుమతి వచ్చిందని, రూ 24 కోట్లతో రోడ్డు పనులు పూర్తి చేయనున్నామ న్నారు. నీటి పారుదల శాఖ ద్వారా ఎల్లంపల్లి ప్రాజెక్టు పరిధిలో మొత్తం 10 చెరువుల పనులు మొదలు కాగా, 7 పూర్తి అయ్యాయని,మర్రిపెల్లి, లచ్చపేట,కలికోట సూరమ్మ ప్రాజెక్టుల పనులు జరుగుతున్నాయాని ఈఈ తెలిపారు. తక్కువ బడ్జెట్ తో ఎక్కువ ఎకరాల భూమి సాగులోకి తీసుకు వచ్చేందుకు రూ 325 కోట్ల నిధులు మంజూరు అయ్యాయని, పనులు పూర్తి చేస్తే 45 వేల ఎకరాల భూములకు సాగులోకి వస్తాయని విప్ తెలిపారు.జిల్లాలో ఆయా ప్రాజెక్టులు పూర్తి చేస్తే దాదాపు లక్ష 50 వేల ఎకరాల భూమి సాగులోకి వస్తుందన్నారు. మల్కపేట ప్రాజెక్ట్ కోసం కుడి, ఎడమ కాలువల నిర్మాణానికి మొత్తం 700 ఎకరాల భూమి అవసరమని జిల్లా నీటి పారుదల శాఖ అధికారి కిశోర్ కుమార్ తెలిపారు. వాటి కోసం పూర్తి ప్రతిపాదనలు పంపాలని విప్ సూచించారు. వీటిని పూర్తి చేస్తే వేలాది ఎకరాల భూములు సాగులోకి వస్తాయని విప్ తెలిపారు. వేములవాడ నియోజకవర్గ పరిధిలో ఇందిరమ్మ ఇళ్ల పనులు ముమ్మరంగా కొనసాగుతున్నాయని, 1957 ఇండ్ల నిర్మాణాలకు మార్కింగ్ చేయడం జరిగిందని,1482 ఇండ్లు వివిధ దశల్లో ఉన్నాయని, 12 ఇండ్ల నిర్మాణం ఇప్పటివరకు పూర్తయిందని గృహ నిర్మాణ శాఖ అధికారులు వివరించారు. మండలాల వారీగా ఇండ్ల నిర్మాణాల పురోగతిపై ఆరా తీశారు.వేములవాడ రాజన్న ఆలయం ద్వారా ప్రతి ఏడాది రూ 186 కోట్ల ఆదాయం వస్తుందని, అదే స్థాయిలో భక్తులకు మెరుగైన వసతులు కల్పించేందుకు గత ఏడాది సీఎం రేవంత్ రెడ్డి, మంత్రులు నవంబర్ 20. 2024న వివిధ అభివృద్ధి పనులకు శంకుస్థాపన చేశారని విప్ గుర్తు చేశారు. రూ 150 కోట్ల ఆలయ విస్తరణ పనులు వేగంగా కొనసాగుతు న్నాయన్నారు. భీమేశ్వర ఆలయంలో రూ 3.50 కోట్లతో అభివృద్ధి పనులు చేశామని, రాజన్న ఆలయ వద్ద భక్తులకు ఏర్పాట్లు చేశామన్నారు అనంతరం జిల్లా ఇన్చార్జి కలెక్టర్ గరీమ అగర్వాల్ మాట్లాడుతూ నియోజకవర్గంలో ఆయా గరీమ అగర్వాల్అభివృద్ధి పనులను వేగంగా పూర్తి చేయాలని ఇంచార్జి కలెక్టర్ గరిమ అగ్రవాల్ ఆదేశించారు. వివిధ అభివృద్ధి పనులకు స్థలాలు వెంటనే గుర్తించాలని సూచించారు. సమన్వయంతో పని చేస్తూ ముందుకు వెళ్ళాలని, గడువులోగా పనులు పూర్తి చేయాలని తెలిపారు. క్షేత్ర స్థాయిలో పర్యటించి ఆయా సమస్యలను పరిష్కరించాలని ఆదేశించారు.ఈసమావేశంలో వేములవాడ ఆర్డీఓ రాధాభాయ్, డీఆర్డీఓ శేషాద్రి,ఆయా శాఖల అధికారులు పాల్గొన్నారు.



# రైతుల సమస్యలు వెంటనే పరిష్కారం

- వరి కొనుగోలు కేంద్రాల్లో వేగం పెంచండి
- తేమ పరీక్షలు.. బరువు కొలతలు.. పారదర్శకంగా ఉండాలి
- మిల్లులకు తక్షణ రవాణాకు లారీల షార్టేజ్ లేకుండా చూడాలి

**మల్లాపూర్, నవంబర్ 20 (జనంసాక్షి) :** జగిత్యాల జిల్లా కలెక్టర్ బి. సత్యప్రసాద్ గురువారం మల్లాపూర్ మండలంలోని ముత్యంపేట్, రాఘవపేట్, ఓబులాపూర్ గ్రామాల్లో ఏర్పాటు చేసిన వరి ధాన్యం కొనుగోలు కేంద్రాలను సందర్శించి సమీక్షించారు. ట్రక్‌షీట్లు, రికార్డులు, గత సీజన్‌తో పోల్చి ప్రస్తుత సీజన్ ధాన్యం రాకను విశ్లేషించారు. రైతులతో మాట్లాడి వారి సమస్యలు, అభిప్రాయాలు తెలుసుకున్నారు. ఇప్పటివరకు చేరిన ధాన్యం పరిమాణం, ఇంకా రావాల్సిన మోతాదును సమీక్షించిన కలెక్టర్.. రైతులు ఎక్కువసేపు వేచి ఉండకుండా వేగవంతంగా కొనుగోలు ప్రక్రియ జరిపించాలని, ఎదుర్కొంటున్న సమస్యలకు వెంటనే స్పందించి పరిష్కారం చూపాలని అధికారులను ఆదేశించారు. కొనుగోలు చేసిన ధాన్యాన్ని తక్షణమే రైస్‌మిల్లులకు తరలించేలా రవాణా వ్యవస్థను బలోపేతం చేయాలని, లారీల షార్టేజ్ లేకుండా నిశిత పర్యవేక్షణ ఉండాలని స్పష్టం చేశారు. తేమ శాతం పరీక్షలు, బరువు కొలతలు, సంచుల సీలింగ్, రసీదుల జారీలో ఎటువంటి లోపాలు లేకుండా పారదర్శకంగా కొనుగోలు జరగాలని కలెక్టర్ హెచ్చరించారు. త్రాగునీరు, నీడ, టోకెన్ వ్యవస్థ, రద్దీ తగ్గింపు చర్యలతోపాటు రైతులకు అందుబాటులో ఉండే సౌకర్యాలను మరింత మెరుగుపరచాలని సూచించారు. అధికారులు నిరంతరం కేంద్రాలను పర్యవేక్షించి, సెంటర్ ఇంచార్జిలతో సమన్వయంతో కొనుగోలు సజావుగా సాగేలా చూడాలని ఆదేశించారు. ఈ సందర్శనలో మెట్పల్లి ఆర్డీవో శ్రీనివాస్, డీసీఓ మనోజ్ కుమార్, ఎంఆర్ఓ రమేష్‌తోపాటు సంబంధిత శాఖల అధికారులు పాల్గొన్నారు.

# మైహోమ్ సిమెంట్స్ "భూమాయ"

- సర్వేనెంబర్ 876లో ప్రభుత్వ భూమి ఆక్రమణ
- అక్రమ నిర్మాణాల విచారణకు జిల్లా కలెక్టర్ ఆదేశం
- ఫోర్జరీ పత్రాలతో 10 ఎకరాల సర్కారు భూమిని రిజిస్ట్రేషన్
- అక్రమాలపై ప్రభుత్వానికి ఫిర్యాదు చేసిన న్యాయవాది కమతంనాగార్జున



**మేళ్లచెరువు నవంబర్ 20 (జనంసాక్షి) :** మేళ్లచెరువు రెవెన్యూ పరిధిలోని సర్వే నెంబర్ 876లో గల 446 ఎకరాల ప్రభుత్వ భూమిలో 10 ఎకరాల ప్రభుత్వ భూమికి మైహోమ్స్ అధినేత జూపల్లి రామేశ్వరరావు ఫోర్జరీ పత్రాలు సృష్టించి అధికారులను మభ్యపరిచి భూమిని సెల్ డిడ్ రిజిస్ట్రేషన్ చేసుకున్నారని, ఆ భూమిలో అక్రమ నిర్మాణాలు నిర్మించి గత 20 సంవత్సరాలుగా అనుభవిస్తున్నాడని జూపల్లి రామేశ్వరావుపై చట్టపరంగా చర్యలు తీసుకోవాలని కోరుతూ స్థానిక న్యాయ వాది కమతం నాగార్జున ఇటీవల ప్రభుత్వానికి ఫిర్యాదు చేశాడు. ఫిర్యాదుపై స్పందించిన ప్రభుత్వం వారం రోజుల్లో విచారణ నివేదిక సమర్పించా లని హుజూర్ నగర్ ఆర్డీవో శ్రీనివాసులుకు, జిల్లా కలెక్టర్ తేజస్ నందులాల్ పవర్ లిఖితపూర్వక ఆదేశాలు జారీచేశారు. ఈ మేరకు విచారణకు ఆదేశించినట్లు ఫిర్యాదుదారుడైన న్యాయవాదికి సమాచారం ఇచ్చినట్లు కమతం నాగార్జున గురువారం మీడియా సమావేశం ఏర్పాటు చేసి వివరాలు వెల్లడించారు. "మేళ్లచెరువు రెవిన్యూ పరిధిలో 10 ఎకరాల ప్రభుత్వ భూమికి ఫోర్జరీ పత్రాలు సృష్టించి, మైహెూమ్స్ అధినేత జూపల్లి రామేశ్వరరావు సెల్ డిడ్ డాక్యుమెంట్ నం 648/2001 ద్వారా అక్రమ క్రయవిక్రయాలు జరిపారు. ప్రభుత్వ భూమిని జూపల్లి రామేశ్వరావు పేరిట అధికారులు అక్రమంగా మ్యుటేషన్ నిర్వహించారు. ఈ 10ఎకరాల భూమిలో ఎటువంటి అనుమతులు లేకుండా నిర్మాణాలు చేపట్టి గత 20 సంవత్సరాలుగా అనుభవిస్తున్నారనీ, ఈ అక్రమాలపై విచారణ జరిపి జూపల్లి రామేశ్వరావు పై చట్టపరంగా చర్యలు తీసుకోవాలని కోరుతూ గతంలో ప్రభుత్వానికి ఫిర్యాదు చేసినట్లు ఆయన తెలిపారు. ఈ మేరకు స్పందించిన ప్రభుత్వం విచారణ నివేదిక వారం రోజుల్లోగా సమర్పించాలని హుజూర్ నగర్ ఆర్డీవో శ్రీనివాసులు వ్యక్తిగతంగా విచారణ జరపాలని, జిల్లా కలెక్టర్ తేజస్ నందలాల్ లేఖ రాసినట్లు కమతంనాగార్జున తెలిపారు. ప్రభుత్వ భూమికి రిజిస్ట్రేషన్లు మ్యుటేషన్లు నిర్వహించిన ప్రభుత్వ అధికారులపై చర్యలు తీసుకోవాలని లోకాయుక్తలో కేసు దాఖలు చేసినట్లు కమతం నాగార్జున తెలిపారు. ఈ నేపథ్యంలో జిల్లా కలెక్టర్ విచారణకు ఆదేశించడం ప్రాధాన్యత సంతరించుకుంది. మేళ్లచెరువు లో డబ్బు ఆశ చూపి భూమాఫియాకు పాల్పడుతున్న మైహెూమ్స్ అధినేత జూపల్లి రామేశ్వరరావుపై కఠిన చర్యలు తీసుకోవాలని కమతం నాగార్జున కోరారు.



# ఉన్మాది ప్రవీణ్‌కు ఉరిశిక్ష

- భార్య, ఇద్దరు పిల్లల దారుణ హత్య కేసులో సంచలన తీర్పు
- రూ.10 వేల జరిమానా.. చెల్లించకపోతే అదనంగా 6 నెలల జైలు
- తీర్పునిచ్చిన న్యాయమూర్తి శ్రీనివాస్ రెడ్డి




**వికారాబాద్ జిల్లా బ్యూరో నవంబర్ 20( జనం సాక్షి) :** భార్యతోపాటు ఇద్దరు చిన్న పిల్లలను కిరాతకంగా హతమార్చిన నిందితుడు గురు ప్రవీణ్ కుమార్‌కు వికారాబాద్ ప్రిన్సిపల్ జిల్లా సెషన్స్ కోర్టు గురువారం మరణశిక్ష విధించింది. రూ.10 వేల జరిమానా కూడా విధించిన ధర్మాసనం.. జరిమానా చెల్లించకపోతే అదనంగా ఆరు నెలల కఠిన కారాగార శిక్ష అనుభవించాలని ఆదేశించింది. నేరం యొక్క తీవ్రతను పరిగణనలోకి తీసుకుని ప్రిన్సిపల్ డిస్ట్రిక్ట్ సెషన్స్ జడ్జి డాక్టర్ సున్నం శ్రీనివాస్ రెడ్డి ఈ చారిత్రక తీర్పు వెలువరించారు. 2019 ఆగస్టు 4 రాత్రి వికారాబాద్ మోతీబాగ్‌లో జరిగిన ఈ దారుణం.. రాష్ట్రవ్యాప్తంగా సంచలనం రేపింది. శేరిలింగంపల్లికి చెందిన ప్రవీణ్ కుమార్.. ముందు వివాహమై ఒక కుమారుడు (ఆయాన్ బాబు) ఉన్న చాందినిని ప్రేమించి వివాహం చేసుకున్నాడు. ఆమెను తన బిడ్డలా ఆదరించి వికారాబాద్‌కు తరలించాడు. వీరికి ఏంజెల్ అనే కూతురు కూడా జన్మించింది. అయితే భార్య మొబైల్ ఫోన్‌లో ఎక్కువగా మాట్లాడుతుందనే అనుమా నంతో ప్రవీణ్ తర చూ గొడవపడేవాడు. ఆ రోజు రాత్రి పిల్లలు నిద్రపోయాక ఆగ్రహంతో ఇనుప రాడ్డుతో చాందినిని కొట్టి చంపాడు. అనంతరం ఆయాన్ బాబును రాడ్డుతో కొట్టి, పాప ఏంజెల్ గొంతు పిసికి ముగ్గురినీ దారుణంగా హతమార్చాడు. నేరం తర్వాత రైలు కింద పడి ఆత్మహత్య చేసుకోవాలని బయలుదేరిన ప్రవీణ్.. మార్గమధ్యలోనే పోలీస్ స్టేషన్ చూసి స్వయంగా వెళ్లి నేరాన్ని ఒప్పుకున్నాడు.

అప్పటి టౌన్ ఇన్‌స్పెక్టర్ శ్రీనివాస్‌రావు కేసు నమోదు చేయగా.. డీఎస్పీలు సీతారాం, సంజీవరావు లోపం లేకుండా దర్యాప్తు పూర్తి చేశారు. పబ్లిక్ ప్రాసిక్యూటర్ సుధాకర్‌రెడ్డి కోర్టులో పటిష్ఠంగా వాదించడంతో నిందితుడికి గతంలో ఎప్పుడూ లేని విధంగా ఉరిశిక్ష పడింది. ఈ తీర్పుకు కృషి చేసిన పోలీసు అధికారులు, ప్రాసిక్యూటర్‌ను ఎస్పీ నారాయణరెడ్డి ప్రత్యేకంగా అభినందించారు. వికారాబాద్ జిల్లా కోర్టు చరిత్రలో ఇదో రేర్ ఆఫ్ రేరెస్ట్ తీర్పుగా నిలిచిపోయింది.

## చదువు ధ్యేయంగా ముందుకు వెళ్లి సమాజ అభివృద్ధికి ప్రతి ఒక్కరూ కృషి చేయాలి

**కొడంగల్ ,నవంబర్ 20 (జనం సాక్షి):** ప్రతిజ్ఞ దివస్ సందర్భంగా కొడంగల్ పట్టణంలో స్వేరో విందు ఆధ్వర్యంలో బహుజన నాయకులు, మేధావులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భం గా స్వేరో నాయకులు మాట్లాడుతూ స్వేరో నెట్‌వర్క్ యొక్క ప్రధాన ఉద్దేశం చదువు ధేయంగా ముందుకు వెళ్లి సమాజ అభివృద్ధికి కృషి చేయడం అని తెలిపారు. కార్యక్రమంలో వికారాబాద్ జిల్లా అధ్యక్షు లు రాజేష్, జిల్లా ఉపాధ్యక్షులు ముకుంద్, కొడంగల్ తాలూకా స్వేరో అధ్యక్షులు కుప్పగిరి సాయిలు, కొడంగల్ అంబేద్కర్ యువజన సంఘం అధ్యక్షుడు యు. రమే శ్ బాబు, మాసాని వెంకటయ్య, బీసీ సంఘాల ఉద్యమ నాయకులు డాక్టర్ వెంకటేశ్వర్లు, భీమరాజ్, పులిందర్ గౌడ్, కస్తూరు పల్లి మైమూద్, స్వేరో ఉపాధ్య క్షుడు గొర్లకాడి శ్రీనివాస్, జాయింట్ సెక్రటరీ సునీల్, చౌదర్పల్లి వెంకట్, రాములు, శేఖర్, చందు సార్, సాయప్ప సార్, ప్రవీణ్ పాల్గొన్నారు.

# క్షణికావేశం... ప్రాణం తీసింది

- ఖమ్మం నగరంలో దారుణం
- భార్య గొంతు కోసి హత్య చేసిన భర్త



**ఖమ్మం, నవంబర్ 20 (జనంసాక్షి) :** ఖమ్మంలో దారుణం చోటు చేసుకుంది. అనుమానంతో భార్యను గొంతు కోసి చంపిన ఘటన పట్టణంలో కలకలం రేపింది. ఖమ్మం రెండో పట్టణ సీఐ బాలకృష్ణ తెలిపిన వివరాల ప్రకారం చింతకాని మండలం, నేరేడ గ్రామానికి చెందిన జి భాస్కర్ అనే వ్యక్తికి, జగ్గయ్యపేట మండలం, తొర్రగుంట పాలెం గ్రామానికి చెందిన సాయి వాణి (33)తో 16 ఏళ్ల క్రితం వివాహం జరిగింది. వీరికి హర్షవర్ధిని, హేమేంద్ర లక్ష్మీ నరసింహ సంతానం. భాస్కర్ కుటుంబంతో కలిసి తన స్వగ్రామమైన నేరెడలో నివసిస్తుండేవాడు. భాస్కర్ అనుమానంతో తన భార్యను తరచూ వేధిస్తుండేవాడు. దీంతో ఇద్దరు మధ్య కలహాలు జరిగేవి. భర్త వేధింపులు తట్టుకోలేని సాయి వాణి ఆరు నెలల కిందట భర్తకు దూరంగా, తన ఇద్దరు పిల్లలతో కలిసి ఖమ్మం పట్టణ మున్సిపాలిటీ ప్రాంతంలో నివాసం ఉంటోంది. వీరు నివాసం ఉంటున్న ఇంటికి భాస్కర్ బుధవారం రాత్రి మద్యం తాగి వచ్చి భార్యతో గొడవకు దిగాడు. ఆ తర్వాత అక్కడ నుంచి వెళ్ళిపోయి, మళ్ళీ గురువారం ఉదయం వచ్చాడు. వెంట తెచ్చుకున్న కత్తితో పడుకున్న భార్యపై దాడికి దిగి గొంతు కోసి హత మార్చాడు. ఈ దాడిలో హర్షవర్ధని మూడు వేళ్ళు తెగిపోయాయి. విషయం తెలుసుకున్న పోలీసులు సంఘటన స్థలానికి చేరుకొని నిందితుడు భాస్కర్ ను అదుపులోకి తీసుకొన్నారు. ఈ ఘటన పై కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు.

## ఛాంబర్ విజయం స్ఫూర్తిగా
# ముందుకు సాగండి


మున్నూరుకాపులకు ఆర్‌జెసి కృష్ణ పిలుపు



**ఖమ్మం (జనంసాక్షి) :** ఇటీవల ప్రతిష్టాత్మకంగా జరిగిన చాంబర్ ఆఫ్ కామర్స్ ఎన్నికల్లో మున్నూరు కాపు కులస్తులు 11 మందికి 9మంది వివిధ పదవులకు ఎన్నిక ద్వారా, మరికొంతమంది ఏకగ్రీవంగా ఎన్నిక కావడం హర్షనీయమని ఇదే స్ఫూర్తితో రానున్న ఎన్నికల్లో మున్నూరు కాపులు ఐక్యంగా సత్తా చాటాలని మున్నూరుకాపు సంక్షేమ సంఘం సీనియర్ నాయకులు గుండాల కృష్ణ పిలుపునిచ్చారు. చాంబర్ ఆఫ్ కామర్స్ ఎన్నికల్లో గెలుపొందిన మున్నూరుకాపు కులస్తుల సన్మాన కార్యక్రమం గురువారం సాయంత్రం త్రీ టౌన్ మున్నూరుకాపు సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో ఆయన నివాసంలో నిర్వహించారు. ఈ సందర్భంగా విజయం సాధించిన మెంతుల శ్రీశైలం, మలిశెట్ వెంకన్న (గీత) , బైరి శెట్టి శ్రీనివాసరావు (టక్ శ్రీను), యర్రా అప్పారావు, బాసా మల్లికార్జున్, జంగిలిరమణ, వాసంశెట్టి రామారావు, మాటేటి కిరణ్, మాటేటి రాకేష్ లను మిగతా నాయకులతో కలిసి కృష్ణ ఘనంగా సన్మానించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ స్థానిక సంస్థల్లో కూడా మున్నూరు కాపులు పోటీచేసిన చోట మిగతా బీసీలను కలుపుకొని సత్తా చాటాలని పిలుపునిచ్చారు.

## సంక్షేమమే ధ్యేయంగా
# కాంగ్రెస్ ప్రభుత్వం పని చేస్తుంది

రాష్ట్ర రైతు కమిషన్ చైర్మన్ కోదండ రెడ్డి



**యాచారం, నవంబర్ 20 (జనం సాక్షి):** రైతుల సంక్షేమమే ధ్యేయంగా రాష్ట్ర వ్యవసాయ రైతు కమిషన్ పనిచేస్తుందని రాష్ట్ర రైతు కమిషన్ చైర్మన్ కోదండ రెడ్డి అన్నారు. గురువారం వ్యవసాయ శాఖ ఉద్యాన శాఖ ఆధ్వర్యంలో చౌదర్పల్లి లోని డ్రిప్ ద్వారా తక్కువ పెట్టుబడితో అధిక దిగుబడులు ఇచ్చే కాసి మల్ల వెం కట రాములు వరి పంటను పరిశీలించారు. అనంతరం రైతు వేదికలో ఏర్పాటు చేసిన సమావేశంలో కోదండ రెడ్డి మాట్లాడారు. రైతును రాజును చేయడమే కాంగ్రెస్ ప్రభుత్వం లక్ష్యంగా పెట్టుకుందని రైతుల సంక్షేమం కోసం ప్రభుత్వం పనిచేస్తుందన్నారు. మండలంలోని రైతులంతా కూరగాయల సాగుకు మరింత ప్రాధాన్యం ఇవ్వాలని చెప్పారు. మార్కెట్ వ్యవస్థను విస్తరించడం ద్వారా రైతుల కు లాభం చేకూరనున్నట్లు చెప్పారు. మండలంలో రైతులు ఇబ్బందులు పడకుం డా ఉండేలా త్వరలోనే రైతు బజార్ ఏర్పాటు ప్రక్రియను అందుబాటులోకి తెచ్చేలా ప్రయత్నిస్తున్నామని అన్నారు. రైతులను ప్రధానంగా వేధించే దళారీ వ్యవస్థను తగ్గించేందుకు కసరత్తు చేస్తున్నట్లు చెప్పారు. మండలంలో రైతులకు మేలు కలిగేలా మార్కెట్ వ్యవస్థను ఏర్పాటు చేసేందుకు సన్నాహాలు జరుగుతున్నాయన్నారు. కార్యక్రమంలో రైతు కమిషన్ సభ్యులు కెవి ఎన్ రెడ్డి, మరికంటి భవాని, గోపాల్, జిల్లా వ్యవసాయ అధికారి డీ.ఉష, జిల్లా ఉద్యాన శాఖ, పట్టు పరిశ్రమ శాఖ అధికారి సురేష్, ఏడీఏ సుజాత, ఇబ్రహీం పట్నం, యాచారం మండలాల వ్యవసాయశాఖ, ప్రజాప్రతినిధులు, రైతులు పాల్గొన్నారు.

# స్వాతంత్ర్య సమరయోధురాలి మహాదానం

- మమతా మెడికల్ కాలేజీకి కమలమ్మ భౌతికకాయం
- 'మరణించినా జీవించండి' నినాదానికి స్ఫూర్తిగా మారిన ఆమె నిర్ణయం
- తెలంగాణ రైతాంగ పోరాటంలో భర్తకు చేదోడు-వాదోడుగా నిలిచిన ధీరవనిత



**శేరిలింగంపల్లి, నవంబర్ 20 (జనంసాక్షి) :** ఫ్రీడమ్ ఫైటర్ కొండకింది కమలమ్మ 90 సంవత్సరాల వయసులో ఈనెల 19న శేరిలింగంపల్లి నియోజకవర్గం పరిధి మై హెూమ్ జ్యువల్ గేటెడ్ కమ్యూనిటీలో మరణించడం జరిగింది. ఈ ఏడాది ఏప్రిల్ నెలలో మై హెూమ్ జ్యువల్ గేటెడ్ కమ్యూనిటీ క్లబ్ హౌస్ లో 'మరణించినా జీవించండి' అనే నినాదంతో అఖిల భారత శరీర, అవయవ దాతల సంఘం పక్షాన గూడూరు సీతామహాలక్ష్మి ఆధ్వర్యంలో మై హెూమ్ జెవెల్ కమ్యూనిటీ బోర్డు సహకారంతో ఒక వినూత్నమైన కార్యక్రమాన్ని నిర్వహించడం జరిగింది. ఆ కార్యక్రమం ద్వారా స్ఫూర్తిని పొందిన ఫ్రీడమ్ ఫైటర్ కమలమ్మ, కూతురు సుగుణ తమ తదనంతరం తమ పూర్తి శరీర దానం చేయటానికి ముందుకు రావడం జరిగింది. ఇందులో భాగంగానే బుధవారం మృతి చెందిన కొండకింది కమలమ్మ భౌతిక కాయాన్ని వైద్య విద్యార్థుల అవసరాలకు ఉపయోగించే నిమిత్తం హైదరాబాద్ మమతా వైద్య కళాశాలకు ఇవ్వడానికి వారి సంతానం అందరూ ఏకగ్రీవంగా ఆమోదం తెలుపడంతో వైద్య కళాశాల సిబ్బంది మై హెూమ్ జ్యువల్ గేటెడ్ కమ్యూనిటీ కి విచ్చేసి ఆమె భౌతిక కాయాన్ని తీసుకొని వెళ్లారు. కాగా స్వాతంత్ర్య సమరయోధురాలైన కొండకింది కమలమ్మ ప్రస్తుత భువనగిరి - యాదాద్రి జిల్లా రామన్నపేట మండలంలోని నీర్నాముల గ్రామంలో జన్మించారు. పెరిగి పెద్దయిన తర్వాత ప్రక్కనే ఉన్న శోభనాద్రిపురం వాస్తవ్యులైన కొండకింది శ్రీనివాస రెడ్డి గారితో వివాహం జరిగింది. శ్రీనివాస రెడ్డి 1940-48 ల నాటి సమైక్య కమ్యూనిస్ట్ పార్టీ సభ్యులుగా అప్పటి నిజాం నిరంకుశ పాలనకు వ్యతిరేకంగా తెలంగాణా రైతాంగ సాయుధ పోరాటంలో పాల్గొన్నట్లు వారి కుటుంబీకులు తెలియజేశారు. కమలమ్మకూడా ఆ పోరాటానికి మద్దతు ఇచ్చి, భర్తకు చేదోడు వాదోడుగా ఉంటూ పరోక్షంగా సహాయం చేసేవారు. దాంపత్య జీవితంతో పాటు, ఉద్యమ కార్యకర్తగా పోరాటానికి సహాయ సహకారాలు అందజేసే క్రమంలో శ్రీనివాస రెడ్డి కొన్నాళ్ళు అజ్ఞాతవాసంలో ఉన్నప్పటికీ ఓవైపు వ్యవసాయం, మరోవైపు పార్టీ కార్యకర్తలతో సమన్వయం కొనసాగించడం కమలమ్మకే చెల్లింది. కాలక్రమంలో పార్టీ చీలిక తర్వాత వీరు సీపీఐ - ఎమ్ పార్టీలో చేరి పార్టీ కార్యక్రమాల్లో చురుకైన పాత్రను నిర్వహించడం గమనార్హం. తెలంగాణా పోరాటంలో పాల్గొన్న విషయాన్ని పరిగణనలోకి తీసుకొని పార్టీ పెద్దలు కమలమ్మకు ఫ్రీడమ్ ఫైటర్ పెన్షన్ వచ్చేలా ప్రత్యేక చొరవను చూపించడం జరిగింది.

# బడా నాయకుల భూములను కాపాడే కుట్ర

- భూ నిర్వాసితులను చూస్తే గుండె చెరువవుతుంది
- బాధిత రైతులకు అండగా ఉంటా
- తెలంగాణ జాగృతి వ్యవస్థపాక అధ్యక్షురాలు ఎమ్మెల్సీ కవిత



**కేశంపేట, నవంబర్ 20 (జనంసాక్షి) :** త్రిబుల్ ఆర్ రోడ్డు అలైన్మెంట్ మార్చి బడా నాయకుల భూము లను కాపాడేందుకు కుట్ర జరుగుతుందని తెలంగాణ జాగృతి వ్యవస్థాపక అధ్యక్షురాలు, ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవిత ఆరోపించారు. మండల పరిధిలోని తొమ్మిది రేకుల గ్రామంలో త్రిబుల్ ఆర్ రోడ్డు నిర్మాణంతో భూములను కోల్పోతున్న భూ నిర్వాసితులను పరామర్శించారు. బాధిత రైతులతో మమేకమై వారి బాధల్ని విన్నారు. ఈ సందర్భంగా కవిత మాట్లాడుతూ.. సెంట్రల్ బస్ స్టేషన్ నుండి 25 కిలోమీటర్లు ఘట్కేసర్ వైపు, ఔటర్ రింగ్ రోడ్డు నుండి 25 కిలోమీటర్లు ఇటువైపు రింగురోడ్డును మార్చు చేయడంలో పెద్ద కుట్ర జరిగిందన్నారు. అన్ని వైపులా ఒకే విధంగా ఉండాల్సిన రింగ్ రోడ్డు దిశను పూర్తిగా మార్చారన్నారు. రైతుల సమస్యను కేంద్ర ప్రభుత్వ పెద్దల దృష్టికి తీసుకువెళతానని రైతులకు హామీ ఇచ్చారు. భూమిని కోల్పోతున్న రైతుల బాధల్ని వింటుంటే గుండె చేరువవుతుందని ఆవేదన వ్యక్తం చేశారు. పోరాటల గడ్డ తెలంగాణా లో భూమిని కోల్పోతున్న రైతు బిడ్డలు తమ భూముల్ని కాపాడుకునేందుకు పిడికిలి బిగించి పోరాటం చేయాలన్నారు. భూముల్ని కోల్పోతున్న రైతులకు న్యాయం జరిగే వరకూ అండగా నిలబడతానన్నారు. ఈ కార్యక్రమం లో తెలంగాణ జాగృతి నియోజకవర్గ ఇంచార్జ్ సీమల రమేష్ , స్థానిక నాయకులు బాలరాజ్ గౌడ్, మధుసూదన్ గౌడ్, సిల్వేరు మల్లయ్య, జాగృతి నాయకులు పాల్గొన్నారు.

## హకీంపేట జడ్పిహెచ్‌ఎస్ పాఠశాలలో బాలసభ

**బొంరాస్‌పేట/దుద్యాల (జనం సాక్షి):** అంతర్జాతీయ బాలల దినోత్సవం అన్ని పురస్కరిం చుకొని దుద్యాల మండలం హకీంపేట గ్రామంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ఆవరణంలో బాలసభ నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యార్థు లకు పలు రకాల ఆటల పోటీలు నిర్వహించారు. అనంతరం విద్యార్థులను ఉద్దేశించి మాట్లాడిన ఎంఈఓ విజయరామారావు విద్య యొక్క ప్రాముఖ్య తను వివరించారు.

# బాల్యాభివృద్ధిపై అంగన్వాడీలకు శిక్షణ

**కొడంగల్ ,నవంబర్ 19 (జనం సాక్షి):** కొడంగల్‌లో అగాఖాన్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో అంగన్‌వాడీ, ఆశా వర్కర్లకు రెండు రోజులబాల్యాభివృద్ధి శిక్షణ ప్రారంభించారు. అగాఖాన్ ఫౌండేషన్ వికారాబాద్ జిల్లా, కొడంగల్ మండలంలో పనిచేస్తోంది. సమాజ అభ్యున్నతికి కట్టుబడి పనిచేసే అంతర్జాతీయ స్వచ్ఛంద సంస్థగా, అగాఖాన్ ఫౌండేషన్ ఇక్కడ ప్రారంభ బాల్యాభివృద్ధి ఫలితాలను మెరుగుపరచడం కోసం వివిధ కార్యక్రమాలను అమలు చేస్తోంది. ఈ కార్యక్రమంలో భాగంగా, అగాఖాన్ ఫౌండేషన్ అంగన్‌వాడీ టీచర్లు మరియు ఆశా వర్కర్ల కోసం ప్రారంభ బాల్యాభివృద్ధి మరియు పాజిటివ్ పేరెంటింగ్ ప్రాముఖ్యతపై 2 రోజుల శిక్షణను నిర్వహించింది. ఈ రెండు రోజుల శిక్షణతో అంగన్‌వాడీ టీచర్లు మరియు ఆశా వర్కర్లు ఒకే వేదికపైకి వచ్చి, సమాజంలో ప్రారంభ బాల్యాభివృద్ధిని ప్రోత్సహించడంలో తమ తమ పాత్రలను స్పష్టంగా అర్థం చేసుకున్నారు. శిక్షణలో భాగంగా నిర్వహించిన అన్ని గ్రూపు కార్యకలాపాల్లో వారు చురుకుగా పాల్గొన్నారు. ఈ శిక్షణలో సిడిపిఓ సూపర్‌వైజర్ కూడా హాజరై పాల్గొనేవారిని ప్రోత్సహించారు. ఈ శిక్షణ కార్యక్రమాన్ని ఏ కె ఎఫ్ ఈ సి డి ప్రాజెక్ట్ బృందం సుమలత, మమత మరియు సంపత్ సమర్థంగా నిర్వహించారు. ఈ శిక్షణ ద్వారా అంగన్‌వాడీ టీచర్లు మరియు ఆశా వర్కర్లు సంరక్షకులకు సరైన పద్ధతులను సూచించడం, పాజిటివ్ పేరెంటింగ్ ఆచరణలను ప్రోత్సహించడం వంటి విషయాల్లో మరింత నైపుణ్యం పొందారు. దీని వల్ల పిల్లల అభివృద్ధి మరింత మెరుగయ్యే అవకాశం ఉంది అన్నారు.

# సీఎం చలవతో శేరిలింగంపల్లి అద్భుత ప్రగతి

- 1606 కోట్లతో భారీ ప్రాజెక్టులు.. ఫ్లైఓవర్లు, రోడ్లు, నాలాల విస్తరణ
- వర్షాకాలం లోపు వరద ముంపు సమస్యకు శాశ్వత పరిష్కారం
- ట్రాఫిక్ రహిత సమాజం.. రాష్ట్రంలోనే అగ్రగామి నియోజకవర్గంగా తీర్చిదిద్దుతాం



**శేరిలింగంపల్లి, నవంబర్ 20 (జనంసాక్షి) :** ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి సహకారంతో శేరిలింగంపల్లి నియోజకవర్గాన్ని అన్ని రంగాల్లో అగ్రగామిగా తీర్చిదిద్దుతామని రాష్ట్ర ప్రజాపద్దుల కమిటీ చైర్మన్ అరికెపూడి గాంధీ ధీమా వ్యక్తం చేశారు. గురువారం మియాపూర్ ఎమ్మెల్యే క్యాంప్ కార్యాలయంలో హెచ్-సిటి ప్రాజెక్టులు, ఎస్ఎన్‌డీపీ నాలాల విస్తరణ పనులపై అధికారులతో సమీక్ష నిర్వహించిన ఆయన సీఎం 1606 కోట్ల నిధులు మంజూరు చేయడం పట్ల ప్రజల తరఫున కృతజ్ఞతలు తెలిపారు. ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా ట్రాఫిక్ రహిత సమాజం కోసం పనులు త్వరితగతిన పూర్తి చేయాలని, నాణ్యతలో రాజీ పడకూడదని అరికెపూడి గాంధీ అధికారులను ఆదేశించారు. ప్రతి వర్షాకాలంలోనూ కాలనీలు మునిగిపోతున్న సమస్యకు శాశ్వత పరిష్కారం కోసం రూ.79.58 కోట్లతో నాలాల విస్తరణ, ఆర్‌సీసీ బాక్స్ డ్రైన్ల నిర్మాణం చేపట్టామని, రాబోయే వర్షాకాలం లోపు పనులు పూర్తి చేస్తామని హామీ ఇచ్చారు. మూడు జంక్షన్లలో మల్టీలెవెల్ ఫ్లైఓవర్లు, గ్రేడ్ సెపరేటర్ల నిర్మాణానికి 837 కోట్లు, మియాపూర్ నుంచి ఆల్విన్ చౌరస్తా వరకు ఆరు లేన్ల బై డైరెక్షనల్ ఫ్లైఓవర్, లింగంపల్లి-గచ్చిబౌలి మధ్య మూడు లేన్ల యూని డైరెక్షనల్ అండర్‌పాస్ నిర్మాణానికి 530 కోట్లు, శేరిలింగంపల్లి రైల్వే స్టేషన్‌లో ఆర్ఓబీకి 124 కోట్లు, సైబరాబాద్ సీపీ కార్యాలయం నుంచి గచ్చిబౌలి వరకు 215 అడుగుల రోడ్డుకు 39 కోట్లు, అంజయ్యనగర్-రాంకీ టవర్ మధ్య 150 అడుగుల రోడ్డుకు 31 కోట్లు, శ్రీదేవి థియేటర్-అమీన్‌పూర్ మధ్య 150/100 అడుగుల రోడ్డుకు 45 కోట్లు మంజూరయ్యాయి. అలాగే ఎస్ఎన్‌డీపీ ఫేజ్-2లో గఫూర్ నగర్-దుర్గం చెరువు మధ్య ఆర్‌సీసీ బాక్స్ డ్రైన్‌కు 11.55 కోట్లు, జనార్దన్ హిల్స్-యూరో కిడ్స్ స్కూల్ వరకు 13.86 కోట్లు, గురునాథం చెరువు-పటేల్ చెరువు మధ్య 6.80 కోట్లు, పటేల్ చెరువు-గంగారాం చెరువు మధ్య 18.92 కోట్లు, నల్లగండ్ల చెరువు-భేల్ చౌరస్తా వరకు 28.45 కోట్లతో ఆర్‌సీసీ బాక్స్ డ్రైన్ల నిర్మాణం కొనసాగనుంది. సమావేశంలో చందానగర్ సర్కిల్ డీసీపీ ప్రశాంతి, మియాపూర్ కార్పొరేటర్ ఉప్పలపాటి శ్రీకాంత్, ప్రాజెక్ట్స్ ఈఈ నామ్యా, డీఈ హరీష్‌బాబు, ఎస్ఎన్‌డీపీ ఈఈ శ్రీనాథ్‌రెడ్డి, డీఈ ధీరజ్ తదితరులు పాల్గొన్నారు.

### శ్రీదేవి థియేటర్ - అమీన్‌పూర్ వరకు రూ.45 కోట్లతో 4 లేన్ల రోడ్డు

మౌలిక వసతులు, సమగ్రాభివృద్ధికి తాను పూర్తిగా కట్టుబడి ఉన్నానని రాష్ట్ర ప్రజాపద్దుల కమిటీ చైర్మన్ అరికెపూడి గాంధీ స్పష్టం చేశారు. ముంబై జాతీయ రహదారిపై శ్రీదేవి థియేటర్ నుంచి అమీన్‌పూర్ వరకు రూ.45 కోట్ల అంచనా వ్యయంతో 2.7 కిలోమీటర్ల పొడవైన నాలుగు లేన్ల ప్రధాన రోడ్డు, రెండు లేన్ల సర్వీస్ రోడ్డు విస్తరణ పనులను గురువారం ఆయన అధికారులతో కలిసి పరిశీలించారు.

"ఈ రోడ్డు పనులు ప్రారంభమవడం చాలా సంతోషంగా ఉంది. త్వరితగతిన పూర్తి చేసి ప్రజలకు అందుబాటులోకి తెస్తాం. ఏదైనా సమస్య వస్తే నా దృష్టికి తీసుకొస్తే వెంటనే పరిష్కరిస్తా" అని అరికెపూడి గాంధీ హామీ ఇచ్చారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి సహకారంతో నియోజకవర్గాన్ని అన్ని రంగాల్లో అభివృద్ధి చేస్తామని, ప్రజలకు మెరుగైన రవాణా సౌకర్యం కల్పిస్తామని ఆయన ధీమా వ్యక్తం చేశారు. ఈ రోడ్డు పూర్తయితే ఎన్‌హెచ్ 65 నుంచి అమీన్‌పూర్ వరకు ఎటువంటి ఇబ్బంది లేకుండా ట్రాఫిక్ రహితంగా ప్రయాణం సాగుతుందని, ఔటర్ రింగ్ రోడ్డు ఎగ్జిట్ నంబర్ 4కు సులువుగా చేరుకోవచ్చని ఆయన వివరించారు. భారతదేశంలో మొట్టమొదటి పట్టణ జీవవైవిధ్య వారసత్వ ప్రదేశంగా గుర్తింపు పొందిన అమీన్‌పూర్ సరస్సుకు ఈ రోడ్డు మరింత సౌలభ్యం కల్పిస్తుందని, పక్షి పరిశీలకులు, పర్యాటకులకు ఎంతో ఉపయోగపడుతుందని ఆయన పేర్కొన్నారు.

పరిశీలనలో కార్పొరేటర్ మంజుల రఘునాథ్ రెడ్డి, ఇంజనీరింగ్ విభాగం ఈఈ నామ్యా, డీఈ హరీష్ బాబు, ఏఈలు శివకృష్ణ యాదవ్, సౌమ్య, టౌన్ ప్లానింగ్ సూపర్‌వైజర్ రోహన్, ఎలక్ట్రికల్ ఏఈ శ్రీనివాస్ రెడ్డి, నాయకులు రఘునాథ్ రెడ్డి, పోచయ్య, ఎల్లమయ్య, శ్రీకాంత్ రెడ్డి, సందీప్ రెడ్డి, నరేందర్ బల్లా, కాలనీ అసోసియేషన్ సభ్యులు, స్థానికులు పాల్గొన్నారు



జనంసాక్షి
www.janamsakshi.org
శుక్రవారం
21 నవంబర్ 2025

# 'సేఫ్ విలేజ్'పై ఫోకస్



రాష్ట్రంలో మానవ అక్రమ రవాణాను అరికట్టేందుకు ఎంపిక చేసిన జిల్లాలలో 'సేఫ్ విలేజ్ ప్రోగ్రాం' కార్యక్రమాలను విస్తృతంగా నిర్వహించనున్నట్లు డైరెక్టర్ జనరల్ ఆఫ్ పోలీస్ బి.శివధర్ రెడ్డి వెల్లడించారు. రాష్ట్రంలోని పోలీస్ కమిషనర్లు, ఎస్పీలతో గురువారం డిజిపి వీడియో కాన్ఫరెన్స్ ద్వారా రాష్ట్రంలో నేరాల స్థితిగతులను సమీక్షించారు. ముఖ్యంగా తీవ్రమైన నేరాలు, ఆర్థిక నేరాలు, బాలలకు సంబంధించిన నేరాలపై ఈ సందర్భంగా లోతుగా చర్చించారు. ఈ సమీక్ష సందర్భంగా డీజీపీ మాట్లాడుతూ మానవ అక్రమ రవాణాను సమర్థవంతంగా అరికట్టేందుకు ప్రయోగాత్మకంగా రాష్ట్రంలోని ఏడు జిల్లాల పరిధిలో 'సేఫ్ విలేజ్ ప్రోగ్రాం'పై విస్తృత కార్యక్రమాలను నిర్వహించనున్నట్లు తెలియజేశారు.

హైదరాబాద్, నవంబర్ 20 (జనంసాక్షి) :

- మానవ అక్రమ రవాణా నివారణ ప్రధాన లక్ష్యం
- నేరాల సమీక్షలో పోలీస్ అధికారులతో డీజీపీ బి శివధర్ రెడ్డి

మహబూబాబాద్, ఖమ్మం, వరంగల్, భద్రాద్రి కొత్తగూడెం, వికారాబాద్, రంగారెడ్డి, మెదక్ జిల్లాలలో స్వచ్ఛంద సంస్థ సహకారంతో ఈ కార్యక్రమాలను చేపట్టి, ఫలితాలను బట్టి అవసరమైతే మిగిలిన ప్రాంతాలకు కూడా విస్తరిస్తామన్నారు. ఈ కార్యక్రమాలను నిర్వహించడంలో మానవ అక్రమ రవాణాను అరికట్టడమే ప్రధాన ఉద్దేశంగా ఉంటుందని ఆయన స్పష్టం చేశారు. పొరుగు రాష్ట్రాల సరిహద్దులుగా కలిగిన జిల్లాల ఎస్పీలు ఆయా రాష్ట్రాలకు సంబంధించిన అధికారులతో సమన్వయ సమావేశాలను ఏర్పాటు చేసుకొని, అంతర్రాష్ట్ర నేరాలు జరగకుండా ముందస్తు చర్యలు తీసుకోవాలని డిజిపి ఆదేశించారు. దీర్ఘకాలంగా పెండింగ్‌లో ఉన్న కేసులను త్వరితగతిన పరిష్కరించాలని అధికారులకు సూచించారు. సిఐడి విభాగంలో నేర విశ్లేషణ, సాంకేతికత కోసం క్రైమ్ ఇంటెలిజెన్స్ టెక్నాలజీ ఎనాలసిస్ పేరుతో ప్రత్యేక వింగ్‌ను ఏర్పాటు చేసినట్లు ఈ సందర్భంగా తెలిపారు. అవినీతికి పాల్పడే సిబ్బందిపై ఉన్నతాధికారులు ఎప్పటికప్పుడు చర్యలు తీసుకోవాలని, మెదక్ జిల్లాలోని టేక్మాల్ (టెక్మాల్)లో జరిగిన సంఘటన పునరావృతం కారాదని డైరెక్టర్ జనరల్ ఆఫ్ పోలీస్ మరోసారి అధికారులను గట్టిగా హెచ్చరించారు. కిందిస్థాయి సిబ్బంది అవినీతికి పాల్పడితే, వారిని పర్యవేక్షించడంలో విఫలమైన ఉన్నతాధికారులపై కూడా చర్యలు తీసుకోవాల్సి ఉంటుందని స్పష్టం చేశారు. నేర సమీక్షా సమావేశంలో శాంతి భద్రతల అడిషనల్ డిజిపి మహేష్ ఎం.భగవత్, సిఐడి అడిషనల్ డిజిపి చారు సిన్హా, మల్టీజోన్ – 2 అడిషనల్ డిజిపి డిఎస్ చౌహాన్, మల్టీ జోన్ 1 ఐజిపి ఎస్.చంద్రశేఖర్ రెడ్డి, ఐజీపీలు డాక్టర్ ఎం రమేష్, కె.రమేష్ నాయుడు, ఎస్పీలు నవీన్ కుమార్, వెంకటలక్ష్మి, సతీష్, లీగల్ అడ్వైజర్ అజయ్ కుమార్, తదితరులు పాల్గొన్నారు.

# సీబీఐ కోర్టుకు హాజరైన జగన్

- వ్యక్తిగత హాజరుతో పూర్తయిన లాంఛనం
- జగన్ రాకతో అభిమానుల హల్‌చల్



హైదరాబాద్, నవంబర్ 20 (జనంసాక్షి) : అక్రమాస్తుల కేసులో వైకాపా అధ్యక్షుడు, మాజీ సీఎం జగన్ సీబీఐ ప్రత్యేక కోర్టుకు హాజరయ్యారు. న్యాయమూర్తి ఎదుట విచారణకు వచ్చారు. విజయవాడ నుంచి బేగంపేట ఎయిర్‌పోర్టుకు వచ్చి అక్కడి నుంచి నాంపల్లిలోని కోర్టుకు ఆయన చేరుకున్నారు. విచారణ అనంతరం జగన్ అక్కడి నుంచి లోటస్‌పాండ్‌కు వెళ్లిపోయారు. మరోవైపు వైకాపా నేత పేర్ని నాని, మరో ముగ్గురు నేతలను కోర్టు లోపలికి పోలీసులు అనుమతించలేదు. దీంతో వారు గేట్ వద్దే నిలుచున్నారు. ఈ కేసులో 2013 సెప్టెంబర్ నుంచి జగన్ బెయిల్‌పై ఉన్నారు. ఇప్పుడు కూడా వ్యక్తిగత హాజరు నుంచి తనకు మినహాయింపు ఇవ్వాలని ఆయన కోరగా సీబీఐ తీవ్రంగా వ్యతిరేకించింది. ఆరేళ్లుగా జగన్ కోర్టుకు ప్రత్యక్షంగా హాజరవడం లేదని, ఈ కేసుల్లో డిశ్చార్జి పిటిషన్లపై రోజువారీ విచారణ జరుగుతున్నందున ప్రత్యక్షంగా హాజరవ్వాలని సీబీఐ తెలిపింది. దీంతో ఈ నెల 21లోగా వ్యక్తిగతంగా హాజరవ్వాలని కోర్టు ఆదేశించింది. ఈ నేపథ్యంలో ఒకరోజు ముందే ఆయన కోర్టుకు హాజరయ్యారు. అక్రమాస్తుల కేసులో వైకాపా అధ్యక్షుడు జగన్ సీబీఐ కోర్టుకు హాజరుకానున్న నేపథ్యంలో బేగంపేట ఎయిర్‌పోర్ట్ వద్ద వైకాపా కార్యకర్తలు హల్‌చల్ చేశారు. కొందరు రప్పా రప్పా అంటూ నినాదాలు చేశారు. ఎయిర్ పోర్టు లోపలికి చొచ్చుకెళ్లే ప్రయత్నం చేయగా పోలీసులు అడ్డుకున్నారు. దీంతో వారితో వాగ్వాదానికి దిగారు. మరోవైపు సీబీఐ కోర్టు వద్ద పెద్ద ఎత్తున పోలీసులు మోహరించారు.

# లొంగిపోతే ప్రభుత్వ పక్షాన సాయం

- నక్సల్స్ జనజీవన స్రవంతిలోకి రావాలి: ఏపీ డీజీపీ

రంపచోడవరం, నవంబర్ 20 (జనంసాక్షి) : లొంగిపోయిన నక్సల్స్‌కు అన్ని విధాలా ప్రభుత్వ సహకారం ఉంటుందని డీజీపీ హరీష్ కుమార్ గుప్తా అన్నారు. చాలామంది ఇప్పటికే లొంగిపోయారని, మిగతావారు సైతం లొంగిపోయి జనజీవన స్రవంతిలో కలవాలని అన్నారు. ఆంధ్రప్రదేశ్‌లో మావోయిస్టులు లేని రాష్ట్రంగా చేయడమే పోలీసుల లక్ష్యమని డీజీపీ హరీష్ కుమార్ గుప్తా అన్నారు. అల్లూరి జిల్లా రంపచోడవరం, మారేడుమిల్లి అటవీ ప్రాంతంలో జరిగిన ఎన్‌కౌంటర్ జరిగిన స్థలాన్ని ఏరియల్ సర్వే ద్వారా పరిశీలించారు. అనంతరం మావోయిస్టుల నుంచి స్వాధీనం చేసుకున్న ఆయుధాలను పరిశీలించారు. ఈ సందర్భంగా డీజీపీ మీడియాతో మాట్లాడారు. దేశవ్యాప్తంగా మావోయిస్టుల ఏరివేత కొనసాగుతుందని, ఆరు నెలలుగా రాష్ట్రంలో మావోయిస్టుల కోసం సంభవ్ ఆపరేషన్ పేరిట గాలింపు చర్యలు ముమ్మరం చేశామని, అందులో భాగంగా మారేడుమిల్లి అటవీ ప్రాంతంలో జరిగిన ఎన్‌కౌంటర్‌లో హిడ్మా, టెక్ శంకర్‌తో పాటు దళాలకు చెందిన 13 మంది హతమయ్యారని, 50 మందిని అరెస్టు చేశామని వివరించారు. ఇప్పటికైనా మావోయిస్టుల్లో మిగిలిన వారు లొంగిపోయి జనజీవన స్రవంతిలో కలువాలని సూచించారు.

# కండువా ఊపుతూ..

- హుషారెత్తించిన మోదీ
- సోషల్ మీడియాలో ట్రెండింగ్



పాట్నా, నవంబర్ 20 (జనంసాక్షి) : ప్రధాని నరేంద్ర మోదీ ఇవాళ సోషల్ మీడియాలో ట్రెండింగ్ అయ్యారు. . బిహార్‌లో ఎన్డీయే విజయాన్ని పూర్తిగా ఆస్వాదిస్తున్న ప్రధాని మోదీ, 'గంచా మూమెంట్' తీసుకొచ్చారు. మెడలోని కండువా తీసి తలపై గుండ్రంగా తిప్పుతూ జనాన్ని ఉర్రూతలూగించారు. బిహార్ ముఖ్యమంత్రిగా నీతీష్ కుమార్ ప్రమాణ స్వీకారోత్సవానికి హాజరైన ప్రధాని ఉదయం నుంచీ చాలా ఉత్సాహంగా కనిపించారు. వేదిక వద్దకు చేరుకునే సందర్భంలో కూడా ప్రధాని తన కండువా గాల్లో ఊపుతూ అక్కడికి చేరుకున్న ప్రజల్ని ఉత్సాహపరిచే యత్నం చేశారు. కాగా, బిహార్‌కు పదవసారి ముఖ్యమంత్రిగా నితీష్ కుమార్ గురువారం ప్రమాణ స్వీకారం చేశారు. ఈ కార్యక్రమానికి ప్రధాని నరేంద్రమోదీ, అమిత్ షా తదితర ఎన్డీయే పెద్దలు హాజరయ్యారు. పాట్నాలోని గాంధీ మైదానంలో జరిగిన ఈ వేడుకకు భారీ ఎత్తున జనం హాజరయ్యారు. ఈ సందర్భంగా పీఎం మోదీ తన కండువాతో జనాల్ని ఉత్సాహపర్చారు. ముఖ్యమంత్రి, మంత్రుల చేత గవర్నర్ ఆరిఫ్ మొహమ్మద్ ఖాన్ ప్రమాణ స్వీకారాలు చేయించారు. ముఖ్యమంత్రిగా నితీష్ కుమార్ (జేడీ-యూ), బీజేపీ నేతలు సామ్రాట్ చౌదరి, విజయ్ కుమార్ సిన్హా ఉప ముఖ్యమంత్రులుగా, మరో 26 మంది మంత్రులుగా ఇవాళ ప్రమాణ స్వీకారం చేశారు.

# అమెరికా అభివృద్ధిలో వలసదారుల పాత్ర ఎనలేనిది

- టెక్ రంగంలో వారి పాత్ర అద్భుతం: సుందర్ పిచాయ్



న్యూఢిల్లీ, నవంబర్ 20 (జనంసాక్షి) : అమెరికాలో సృజనాత్మకతకు వలసదారులు చోదకశక్తిగా ఉన్నారని ఆల్ఫబెట్ (గూగుల్ మాతృసంస్థ) సీఈఓ సుందర్ పిచాయ్ ప్రశంసించారు. టెక్ రంగంలో వలసదారుల పాత్ర అద్భుతమని వ్యాఖ్యానించారు. అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ మద్దతుదారులు హెచ్-1బీ వీసా విధానం రద్దుకు పట్టుబడుతున్న నేపథ్యంలో ఆల్ఫబెట్ సీఈఓ ఈ వ్యాఖ్యలు చేశారు. అమెరికా టెక్ రంగంలో వలసదారుల పాత్రపై ఆల్ఫబెట్ సీఈఓ సుందర్ పిచాయ్ బీబీసీ వార్తాసంస్థకు ఇచ్చిన ఇంటర్వ్యూలో పలు కీలక వ్యాఖ్యలు చేశారు. 'టెక్ రంగ అభివృద్ధి చెందిన తీరును మీరు ఓసారి గమనించండి..ఇందులో వలసదారుల పాత్ర చాలా గొప్పది' అని ఆయన అన్నారు. హెచ్-1బీ వీసాలో లోపాలను సరిదిద్దేందుకు ప్రభుత్వం ప్రయత్నిస్తోందని అన్నారు. ప్రతిభావంతులను అమెరికాకు తీసుకొచ్చే విధంగా మార్పులు ఉంటాయని తాను భావిస్తున్నట్టు తెలిపారు. పైదవులు కోసం అమెరికాకు వెళ్లిన సుందర్ పిచాయ్.. హెచ్-1బీ వీసాతోనే తన కెరీర్‌ను ప్రారంభించారు. ఆర్థిక, సాంకేతిక రంగాల్లో అభివృద్ధికి వలసలు అవసరమని కూడా గతంలో ఓసారి స్పష్టం చేశారు. ఇక టెక్ రంగ వ్యాపారవేత్తలకు రాజకీయ ప్రాముఖ్యత పెరుగుతుండటంపై ఎదురైన ప్రశ్నలకు కూడా సీఈఓ సుందర్ పిచాయ్ స్పందించారు. ట్రంప్ ప్రమాణస్వీకారంలో పలువురు టెక్ రంగ నిపుణులు పాల్గొనడంపై మాట్లాడారు. 'ఏఐ సాంకేతికత ఎంతో అద్భుతమైనది. ఇది ఆర్థికాభివృద్ధికి దోహదపడుతుంది. జాతీయ భద్రతా కారణాల దృష్ట్యా కూడా ఏఐకి ఎంతో ప్రాధాన్యం ఉంది. సమాజానికి ఏఐతో ప్రయోజనాలు కలిగేలా ప్రభుత్వంతో కలిసి పనిచేయాలి. సాంకేతికత దుర్వినియోగమయ్యే ముప్పుపై ప్రభుత్వంతో కలిసి తీసుకోవాల్సిన జాగ్రత్తలపై ఆలోచించాలని ఆయన అన్నారు.

# బంగాళాఖాతంలో కొనసాగుతున్న అల్పపీడనం

- 48 గంటల్లో వాయుగుండంగా మారే అవకాశం

అమరావతి, నవంబర్ 20 (జనంసాక్షి) : నైరుతి బంగాళాఖాతంలో కొనసాగుతున్న అల్పపీడనం, రాబోయే 48 గంటల్లో వాయుగుండంగా మారే అవకాశాలు ఉండడంతో ఆంధ్రప్రదేశ్‌కు తుపాను ప్రమాదం పొంచి ఉందని వాతావరణ అధికారులు వెల్లడించారు. ఆగ్నేయ బంగాళాఖాతంలో శనివారం అల్పపీడనం ఏర్పడి పశ్చిమ-వాయువ్య దిశగా కదులుతూ వాయుగుండంగా బలపడే అవకాశముందని పేర్కొన్నారు. కొనసాగుతున్న అల్పపీడనం కారణంగా రాబోయే 24 గంటల్లో ప్రకాశం, బాపట్ల,కృష్ణా, తిరుపతి, చిత్తూరు, శ్రీపొట్టిశ్రీరాములు నెల్లూరు జిల్లాల్లో తేలికపాటి నుంచి ఓ మోస్తరు వర్షాలు పడవచ్చని తెలిపారు. శని, ఆదివారాల్లో ఓ మోస్తారు నుంచి తేలికపాటి వర్షాలు కురిసే అవకాశముందని వెల్లడించారు. అల్లూరి జిల్లా జి.మాడుగులలో4.6 డిగ్రీల అత్యల్ప ఉష్ణోగ్రత నమోదైంది. ముంచంగిపట్టులో 5.8, చింతపల్లిలో 6.8, డుంబ్రిగూడలో 7.8 కనిష్ఠ ఉష్ణోగ్రతలు నమోదయ్యాయి.

# కల్తీ నెయ్యి కేసులో వైవీ విచారణ



హైదరాబాద్, నవంబర్ 20 (జనంసాక్షి) : టీటీడీ కల్తీ నెయ్యి కేసులో కీలక పరిణామం చోటు చేసుకుంది. ఈ కేసులో వైఎస్సార్ సిపి పార్టీ నేత వైవి సుబ్బారెడ్డిని సిట్ బృందం గురువారం విచారించింది. జూబ్లీహిల్స్ రోడ్ నంబర్ 10లోని ఆయన నివాసానికి సిట్ అధికారులు బృందం చేరుకుని టీటీడీ కల్తీ నెయ్యి కేసులో ఆయన ఇంట్లోనే విచారిస్తోంది. ఇప్పటికే ఈ కేసులో వైవీ సుబ్బారెడ్డి పీఏ చిన్న అప్పన్నతో పాటు టీటీడీ మాజీ ఈవోతో పాటు పలువురు అధికారులను సిట్ విచారించింది. వారు చెప్పిన సమాచారం మేరకు సిట్ వైవీ సుబ్బారెడ్డిని విచారిస్తోంది. సిట్ అధికారులు పలువురి స్టేట్మెంట్స్ తో పాటు పలు డాక్యుమెంట్స్ తీసుకొచ్చారు. వాటిని ముందుంచి వైవీ సుబ్బారెడ్డిని విచారించారు.

# దేవ్‌జీ, మల్లా రాజిరెడ్డిలు మావద్ద లేరు

- హైకోర్టుకు తెలిపిన పోలీసులు

అమరావతి, నవంబర్ 20 (జనంసాక్షి) : మావోయిస్టు నాయకులు దేవజీ, మల్లా రాజిరెడ్డి కోర్టులో హాజరు పర్చాలిందిగా కోరుతూ దాఖలైన 'హెబియస్ కార్పస్' పిటిషన్‌పై ఆంధ్రప్రదేశ్ హైకోర్టులో విచారణ జరిగింది. ఈ కేసులో పిటిషనర్లు చేసిన అభ్యర్థనపై కోర్టు కీలక వ్యాఖ్యలు చేసింది. ఈ విచారణలో భాగంగా, దేవజీ, మల్లా రాజిరెడ్డి తమ అదుపులో లేరని పోలీసులు హైకోర్టుకు సమర్పించిన నివేదికలో పేర్కొన్నారు. అలాగే, అరెస్ట్ చేసిన మావోయిస్టులను సంబంధిత మేజిస్ట్రేట్ ఎదుట నియమిత విధానంలోనే హాజరుపర్చినట్లు కూడా పోలీసులు వివరణ ఇచ్చారు. అయితే, మావోయిస్టు నేతలు తమ అదుపులో ఉన్నారని పోలీసులు ముందుగా ప్రెస్ స్టేట్మెంట్ రిలీజ్ చేశారని పిటిషనర్ వాదించారు. దీనిపై స్పందించిన పిటిషనర్ తరఫు న్యాయవాది, ఆ ప్రెస్ స్టేట్మెంట్‌ను కోర్టు ముందు సమర్పిస్తామని వెల్లడించారు. ఈ నేపథ్యంలో, మావోయిస్టులు పోలీసుల ఆధీనంలోనే ఉన్నారని నిరూపించే ఆధారాలను సమర్పించాలని పిటిషనర్లకు హైకోర్టు ఆదేశాలు జారీ చేసింది. ఈ కేసుపై తదుపరి విచారణను శుక్రవారం నాటికి వాయిదా వేస్తున్నట్లు ప్రకటించింది.

# పోలీసుల అదుపులో ఉన్న అశోక్, ఆజాద్‌లను కోర్టులో వెంటనే హాజరుపర్చాలి

- తెలంగాణ పౌర హక్కుల సంఘం డిమాండ్

హైదరాబాద్, నవంబర్ 20 (జనంసాక్షి) : ఈ నెల 11 నుంచి పోలీసుల అదుపులో ఉన్నారని భావిస్తున్న సికాస అశోక్, ఆజాద్‌లను వెంటనే కోర్టులో హాజరుపర్చాలని తెలంగాణ పౌరహక్కుల సంఘం అధ్యక్ష ప్రధాన కార్యదర్శులు ప్రొఫెసర్ జి లక్ష్మణ్, ఎన్ నారాయణ రావు డిమాండ్ చేశారు. ఇంతవరకు వారి అరెస్టుగానీ, సరెండర్‌గానీ ప్రకటించకుండానే పదిరోజులు గడిచిపోయాయని ఆందోళన వ్యక్తం చేశారు. హిడ్మా సహా 13 మందిని ఎన్‌కౌంటర్ చేసిన నేపథ్యంలో అశోక్, ఆజాద్ ప్రాణాలకు కూడా అపాయం ఉందని, అందుకే వెంటనే కోర్టులో హాజరుపరిచి వారి జీవించే హక్కుకు రక్షణ కల్పించాలని కోరారు. ఆపరేషన్ కగార్ హత్యాకాండను వెంటనే ఆపేయాలని, 1996 పెసా చట్టాన్ని, 2007 అటవీ హక్కుల చట్టాన్ని అమలు చేయాలని పౌర హక్కుల సంఘం డిమాండ్ చేసింది.

# కర్నాటకలో మళ్లీ పవర్ పాలిటిక్స్

- డీకేకు పగ్గాలు అప్పగించాలంటున్న ఆయన వర్గం



బెంగళూరు, నవంబర్ 20 (జనంసాక్షి) : కర్ణాటకలో మళ్లీ పవర్ పాలిటిక్స్‌కు తెరలేచాయి. తాజాగా కర్ణాటక అధికార పార్టీ పంచాయితీ ఢిల్లీ హైకమాండ్‌కు చేరింది. కర్ణాటకలో కాంగ్రెస్ సర్కార్ ఏర్పడి రెండున్నరేళ్లు పూర్తి చేసుకుంది. ఇప్పుడు డీకే శివకుమార్ వర్గం.. సీఎం సిద్దరామయ్యను మార్చాలంటూ డీకే శివకుమార్ వర్గం ఎమ్మెల్యేలు ఢిల్లీ వెళ్తున్నారు. రాష్ట్రంలో డీకే శివకుమార్‌కు సీఎం పగ్గాలు ఇవ్వాలని ఆయన వర్గం ఎమ్మెల్యేలు కోరుతున్నట్లు సమాచారం. అయితే రాష్ట్రంలో సీఎం మార్పు ఊహాగానాలే అంటూ సీఎం సిద్దరామయ్య కొట్టిపారేశారు. కర్ణాటకలో పవర్ షేరింగ్‌పై ఇప్పుడు పవర్ పాలిటిక్స్ నడుస్తున్నాయని రాజకీయ విశ్లేషకులు అభిప్రాయపడుతున్నారు. కర్ణాటక అసెంబ్లీ ఎన్నికల ఫలితాలు వెలువడిన అనంతరం కాంగ్రెస్ హైకమాండ్ రాష్ట్రంలో ఎవరిని సీఎం చేయాలనే దానిపై పెద్ద ఎత్తున చర్చలు జరిపింది. ఆ సమయంలో పీసీసీ చీఫ్‌గా ఉన్న డీకే శివకుమార్, గతంలో సీఎంగా పని చేసిన సిద్దరామయ్య పేర్లు తెరపైకి వచ్చాయి. వాళ్లిద్దరిలో కూడా సీనియర్‌గా ఉన్న సిద్దరామయ్య వైపు పార్టీ అధిష్టానం మొగ్గు చూపి సీఎంగా పగ్గాలు అప్పగించింది. అయితే ఆ సమయంలో పలు కీలక శాఖలతో డిప్యూటీ సీఎం డీకే శివకుమార్ వర్గం ప్రమాణస్వీకారం చేసింది. ఆ సమయంలో ఈ ఇద్దరు నాయకుల మధ్య రాజీ జరిగిందనే చర్చ బయటికి వచ్చింది. వీరిద్దరి మధ్య 2.5 ఫార్ములా సయోధ్య జరిగిందనే చర్చ కూడా జోరుగా ప్రచారం జరిగింది. మొదటి 2.5 ఏళ్ల రాష్ట్రంలో సిద్దరామయ్య సీఎంగా ఉంటారని, తర్వాత కాలం డీకే శివకుమార్ ముఖ్యమంత్రిగా పని చేస్తారని ఒక రాజీ జరిగిందనే ప్రచారం బయటికి వచ్చింది. అందులో భాగంగా మొదటగా సిద్దరామయ్య ముఖ్యమంత్రిగా ప్రమాణ స్వీకారం చేశారని డీకే వర్గం చెబుతుంది. కానీ ఇప్పుడు అనుకున్న సమయం ముగిసిన కూడా సీఎం కుర్చీ శివకుమార్‌కు ఎందుకు ఇవ్వడం లేదనే దానిపై ఆయన వర్గం వాళ్లు ప్రశ్నలు సంధిస్తున్నారు. గత వారమే సిద్దరామయ్య, శివకుమార్ ఇద్దరు కూడా ఢిల్లీకి వెళ్లారు. ఆ సమయంలో వాళ్లిద్దరూ హైకమాండ్ పెద్దలతో విడివిడిగా సమావేశం అయ్యారు. పార్టీ పెద్దలకు రాష్ట్రంలోని పరిస్థితులు, ముఖ్యమంత్రి మార్పు అంశంపై వాళ్లిద్దరూ చర్చించినట్లు సమాచారం. అయితే ఆ సమయంలోనే హైకమాండ్ సీఎం మార్పుపై ఏ విషయం అయినా తామే నిర్ణయం తీసుకుంటామని, ఎవరు కూడా ఎటువంటి ఊహాగానాలకు పోవద్దని, దీనిపై ఎక్కడ కూడా మాట్లాడవద్దని స్పష్టం చేసినట్లు సమాచారం. ఈ ఢిల్లీ పర్యటన తర్వాత ఇద్దరు నాయకులు కూడా సైలెంట్‌గా ఉన్నప్పటికీ ఇప్పుడు డీకే శివకుమార్ వర్గానికి చెందిన కొందరు ఎమ్మెల్యేలు హస్తినకు బాట పడుతున్నారు. ఈ రాత్రి వాళ్లు బెంగళూరు నుంచి ఢిల్లీకి వెళ్లి పార్టీ పెద్దలను కలిసి డీకే శివకుమార్‌ను సీఎంను చేయాలనే ఒక డిమాండ్‌ను చేసే ఛాన్స్ ఉందని సమాచారం. డీకే వర్గం ఎమ్మెల్యేలు పార్టీ జాతీయ అధ్యక్షుడు ఖర్గేను కలుస్తారా, లేదంటే రాహుల్ గాంధీని కలుస్తారా అనేది మాత్రం ఇంకా అధికారికంగా బయటికి రాలేదు.

# విద్యార్థిని ఇంటికి వెళ్లిన యాదాద్రి కలెక్టర్



యాదాద్రి (జనంసాక్షి) : యాదాద్రి భువనగిరి జిల్లా కేంద్రంలోని సింగన్న గూడెం ఇందిరమ్మ కాలనీ నివాసి బానోతు సుస్మిత పదవ తరగతి చదువుతోంది. అయితే సుస్మిత కొద్దిరోజులుగా పాఠశాలకు సరిగా హాజరు కావడం లేదు. ఈ విషయం కలెక్టర్ దృష్టికి వచ్చింది. విద్యార్థుల హాజరు సమస్యను కేవలం రికార్డుకే పరిమితం చేయకుండా కలెక్టర్ సుస్మిత ఇంటికి వెళ్లారు. పాఠశాలకు ఎందుకు రావడం లేదు అని కలెక్టర్ సుస్మితను అడిగి తెలుసుకున్నారు. సుస్మిత తల్లి ఆరోగ్యం సరిగా లేదు. తండ్రి మేస్త్రి పనికి వెళ్లారు. తల్లికి సహాయంగా ఇంట్లో ఉండటం వలన రోజూ బడికి రాలేకపోతున్నా అని సుస్మిత వివరించింది. కలెక్టర్ ఇంటికి వెళ్ళిన సమయానికి సుస్మిత అన్న తల్లిని ఆసుపత్రికి తీసుకెళ్లారు. ఈ పరిస్థితిని చూసి కలెక్టర్ చలించిపోయారు. ఇంట్లో ఎలాంటి ఇబ్బందులు ఉన్నా తాను చూసుకుంటా అని సుస్మితకు హామీ ఇచ్చారు.

# ఇద్దరు ప్రభుత్వ ఉపాధ్యాయుల సస్పెన్షన్

వరంగల్ బ్యూరో, నవంబర్ 20 (జనం సాక్షి) : ఇద్దరు ఉపాధ్యాయులను వరంగల్ డీఈవో రంగయ్య నాయుడు గురువారం సస్పెండ్ చేశారు. వివరాలు ఇలా ఉన్నాయి. బి. జగన్మోహన్ ఎస్‌జిటి ,ఎంపిపిఎస్ మహబూబ్ నగర్ మరియు జి. వెంకటేశ్వర్లు, ఎస్‌జిటి, ఎంపిపిఎస్ మహబూబ్ నగర్, మండలం రాయపర్తి, వరంగల్ జిల్లా పాఠశాల సమయాలను పాటించడంలో , విద్యార్థులకు ఉదయం ప్రార్థన నిర్వహించడం , విద్యార్థుల ఎస్ఏ1 సమాధాన పత్రాలను మూల్యాంకనం చేయడం మరియు మార్కులు రిజిస్టర్‌ను నిర్వహించడం చేయడం లేదు. తరచుగా విధులకు హాజరు కాకపోవడం, విద్యార్థులు మరియు తల్లిదండ్రులతో అర్థరహిత ప్రవర్తించడం, పాఠశాల సమయాల్లో మొబైల్ ఫోన్ ఉపయోగించడం, పాఠాలు బోధించకపోవడం మరియు తన విధుల పట్ల తీవ్రమైన నిర్లక్ష్యాన్ని చూపించడం వల్ల 12.11.2025 నుండి పాఠశాల మూసివేతకు దారితీసింది. ఈ మూసివేత విషయాన్ని పై అధికారులకు తెలియజేయడంలో కూడా ఆ ఇద్దరు ఉపాధ్యాయులు విఫలం అయ్యారు. అప్పటి నుండి ఏ పనులు చేయకుండా పాఠశాలలో కూర్చోవడం మాత్రమే చేస్తున్నారు. అందువలన ఆ ఇద్దరు ప్రభుత్వ ఉపాధ్యాయులను సస్పెండ్ చేశారు.

Printed, Published and Owned by M.M.RAHMAN Printed at M/s. Manair Enterprises, Plot No. 16E/4, IDA, Kattedan, Ranga Reddy Dist, Telangana - 500077, Published at #119&120, 1st Floor, Down Town Mall, Lakdikapul, Hyderabad, Telangana-500004. Editor : M.M.RAHMAN RNINo. APTEL/2013/50370